

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్

fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

25-5-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 113 పేజీలు: 10+4 వెల: 8.00


పోటీ నిర్వాహకులు నన్ను వేశ్యగా భావించారు

మిస్ ఇంగ్లండ్ మిల్లామాగీ ఆరోపణ




7

## కరోనా పంజా

### కొత్త వేరియంట్లను గుర్తించిన వైద్యఆరోగ్యశాఖ

### పెరుగుతున్న కేసులు



**న్యూఢిల్లీ, మే 24:** దేశంలో కరోనా గురించి పూర్తిగా మరిచిపోతున్న తరుణంలో మళ్లీమహమ్మారి విజృంభిస్తోంది. దేశంలోని పలు రాష్ట్రాలు,పట్టణప్రాంతాల్లో వైరస్ కేసులు వెలుగులోకి వచ్చాయి. కొత్త కొత్త కొవిడ్ వేరియంట్లు ఎన్‌బి 1.8.1 ఎల్‌ఎఫ్ 7లను భారత్‌లో గుర్తించినట్లు ఇండియన్ సార్స్‌కోవ్2 జీనోమిక్స్ కన్సార్టియం ప్రకటించింది ఎన్‌బీ 1.8.1 రకం కేసు ఏప్రిల్‌లో బయటపడింది. ఎల్‌ఎఫ్7కు సంబంధించి నాలుగు కేసులను ఈనెలలోనే గుర్తించామని ఇన్సాకాగ్ తెలిపింది. తమిళనాడు, గుజరాత్‌లలో ఆకేసులు బయటపడ్డాయి. ఇక ఢిల్లీ మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సహా పలు రాష్ట్రాల్లో కొత్తకేసులను >>2



శనివారం న్యూఢిల్లీలో నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, అమిత్ షా, సిఎం రేవంత్, ఎపి సిఎం చంద్రబాబు తదితరులు

# మనం, మనం.. టీమిండియా

## కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పనిచేస్తే 'వికసిత్ భారత్' సాకారం

### ఉపాధి వ్యవస్థలో మహిళలకు మరింత భాగస్వామ్యం

### రాష్ట్రాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

### నీతి ఆయోగ్ భేటీలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, మే 24:** క్రికెట్‌లో టీమిండియా తరహాలో కేంద్ర రాష్ట్రాలు సమన్వయంతో పనిచేస్తే సాధించలేని లక్ష్యం అంటూ ఉండదని ప్రధాని నరేంద్రమోడీ వ్యాఖ్యానించారు. దేశ రాజధానిలో పదవ నీతి ఆయోగ్ సమావేశం ప్రారంభించి ప్రసంగించిన మోడీ >>2

## మెట్రో-2కు అనుమతివ్వండి

### గ్రీన్ ఫీల్డ్ హైవే మంజూరు చేయండి

### రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర,దక్షిణ భాగాలకు అనుమతి ఇవ్వండి

### ప్రధాని మోడీతో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే24:** ఢిల్లీలో నీతి అయోగ్ సమావేశంలో పాల్గొన్న అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా >>2



ఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన సిఎం రేవంత్

## వికసిత తెలంగాణ దిశగా అడుగులు

### నాలుగు కీలక అంశాలతో 'రైజింగ్ విజన్'

### పేదల క్షేమం, సమగ్రపాలసీలు, ప్రపంచశ్రేణి మౌలిక సౌకర్యాలు, పారదర్శక సుపరిపాలనే ప్రభుత్వ లక్ష్యాలు

### 2028 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరుల్ని చేస్తాం

### నీతి ఆయోగ్ సమావేశంలో సిఎం రేవంత్




నీతి ఆయోగ్ సమావేశంలో సిఎం రేవంత్, తమిళ సిఎం స్టాలిన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే24:** 2047 నాటికి మన భారత దేశాన్ని సూపర్ పవర్‌గా,నెంబర్ వన్‌గా నిలబెట్టాలన్న మోదీ సంకల్పాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్వాగతించారు. వికసిత భారత్ ప్రణాళికను రూపొందించడం అభినందనీయమని, అదే స్పూర్తితో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళిక సిద్ధమైందని, ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో ఆదర్శవంతమైన లక్ష్యాలతో తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ >>2

సింధు జలాల ఒప్పందంపై పాక్ విష ప్రచారం 5

కొవిడ్‌పై ఆందోళన వద్దు: మంత్రి దామోదర 6



## వచ్చేశాయ్.. రుతుపవనాలు

### 8 రోజుల ముందే కేరళను తాకాయి..

### 'ముందస్తు'లో సరికొత్త రికార్డు.. భారీ వర్ష సూచన

**న్యూఢిల్లీ, మే 24:** భానుడి ప్రతాపంతో గత కొన్ని రోజులుగా అల్లాడుతున్న దేశ ప్రజలకు ఉపశమనం లభించింది. దేశానికి అత్యధికంగా వర్షపాతానిచ్చే నైరుతి రుతుపవనాలు శనివారం కేరళలో ప్రవేశించాయి. సాధారణం కంటే ఎనిమిది రోజుల ముందే ఈ రుతుపవనాలు దేశంలోకి వచ్చాయి. దీంతో 2009 తర్వాత భారత ప్రధాన భూభాగంలోకి రుతుపవనాలు ముందుగా ప్రవేశించాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. అంటే 16 ఏళ్ల తర్వాత నైరుతి రుతు పవనాలు అంచనాల కంటే ముందుగా వచ్చేశాయి. చివరిసారిగా 2001, 2009లో రుతుపవనాలు అనుకున్న సమయం కంటే ముందుగానే కేరళలోకి ప్రవేశించాయి. ఆ రెండేళ్లలో మే 23నే కేరళను >>2

# కొత్త పార్టీకి కవిత రెడీ!

## సామాజిక తెలంగాణే అజెండా!



### బిఆర్ఎస్‌లో దెయ్యాలు, కోవర్టులపై రాజుకున్న రగడ

### కవిత వర్సెస్ కెటిఆర్.. ఆస్తి తగాదాలేనా?

### ఆమె లేఖ సృష్టిస్తున్న 'గులాబీ' దుమారం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 24:** బిఆర్ఎస్ పార్టీలో లొల్లి తారాస్థాయికి చేరుకుంది. కవిత రాసిన లేఖ బయటికి రావడం సంచలనంగా మారింది. రెండు రోజుల క్రితం ఎర్రవల్లి సభపై గ్రౌండ్ రిపోర్టు పేరుతో బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావుకు రాసిన లేఖపై ఆమె అమెరికా నుంచి వచ్చిన వెంటనే క్లారిటీ ఇచ్చిన తీరు మరింత సంచలనాలకు దారి తీసింది. కెసిఆర్ కుమార్తె రాసిన లేఖనే లీకైతే ఇక పార్టీలోని సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దీనిపై చర్చ జరగాలని అన్నారు. తాను అలా చాలా లేఖలు రాశానని, ఎవరు బయట పెట్టారన్నది తేలాలని అన్నారు. కెసిఆర్ దేవుడని అంటూనే ఆయన చుట్టూ దయ్యాలున్నాయని వ్యాఖ్యానించారు. వాళ్లకారణంగా పార్టీకినష్టం జరుగుతోందని అన్నారు. కవిత లేవనెత్తిన అంశాలపై తెలంగాణ భవన్‌లో శనివారం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మాట్లాడుతూ తమ పార్టీలో రేవంత్‌రెడ్డి కోవర్టులు ఉండొచ్చని అన్నారు. పార్టీ అంతర్గత విషయాలు మాట్లాడకపోవడమే మంచిదన్నారు. తెలంగాణకు పట్టిన దయ్యం రేవంత్‌రెడ్డి అని,శని కాంగ్రెస్ పార్టీ అంటూ టాపిక్ డైవర్షన్ చేసే ప్రయత్నం చేశారు. కవిత లేఖలో ప్రస్తావించిన అంశాలపై విలేకరులు అడగగా దాట వేశారు. ఆమె పేరును ప్రస్తావించకపోవడం గమనార్హం. ఆమె రాసిన లేఖ ఎలా లీకైందన్న ప్రశ్నకై సమాధానం చెప్పక పోగా రేవంత్ కోవర్టులు ఉండొచ్చన్నారు. దీంతో ఎవరు రేవంత్ కోవర్టులు అన్నది చర్చనీయాంశంగా మారింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కెటిఆర్‌కు కోవర్టులెవరన్నది తెలియదా? లేదా కావాలనే అసలు విషయం బయట పెట్టలేదా? అన్న చర్చ మొదలైంది. మా పార్టీలో ప్రజాస్వామ్యం ఉందని,ఎవరైనా ఉత్తరాలు రాయొచ్చని,సలహాలు ఇవ్వొచ్చని అన్నారు. పదేండ్లుగా అంతర్గత ప్రజాస్వామ్యం అంశాన్ని ప్రస్తావించకుండా శుక్రవారం అమెరికా నుంచి వచ్చిన తర్వాత కవిత మాట్లాడుతూ కెసిఆర్ >>2



శనివారం పాలిసెట్ ఫలితాలు విడుదల చేస్తున్న విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన

## పాలిసెట్‌లో బాలికల హవా

### 88 % అర్హతతో టాప్

### బాలురు 80 శాతం

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఇంజనీరింగ్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలీసెట్-2025 ఫలితాలను విడుదల చేశారు. ఫలితాల్లో మరోసారి బాలికలే ముందున్నారు. పాలీసెట్-2025లో 84.33 అర్హత సాధించారు. అందులో బాలికలు 88.54 శాతం ఉండగా.. బాలురు 80.69 శాతం అర్హత సాదించారు. తెలంగాణ పాలిసెట్-2025 ఫలితాలను సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన శనివారం ఉదయం 11 గంటలకు విడుదల చేశారు. పరీక్షను ఈ నెల 13న రాష్ట్రంలోని 276 కేంద్రాల్లో నిర్వహించారు. పరీక్షకి 98,858 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో >>2

## ఎపి కొత్త ఎత్తిపోతలు ఆపండి

### ఆ ప్రాజెక్టుతో తెలంగాణకు నష్టం: గోదావరి బోర్డుకు ఇఎన్‌సి లేఖ



**హైదరాబాద్,మే24,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా పోలవరం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి 35మీటర్ల ఎత్తులో నీటిని ఎత్తిపోసేందుకు ఆంధ్రప్రదేశ్ చేసిన ప్రతిపాదనలపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలను గోదావరి నదియాజమాన్యం బోర్డుకు నీటిపారుదల శాఖ ఇఎన్‌సి జనరల్ జి అనిల్‌కుమార్ లేఖ రాని నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర జలసంఘం అనుమతి లేకుండా కొత్త ఎత్తిపోతల పథకం మొదలు పెట్టారని ఆయన జిఆర్ఎంబికి రాసిన లేఖలో ఎత్తిచూపారు.పోలవరం అథారిటి సిఇవో, గోదావరి నది యాజమాన్య బోర్డు ఛైర్మన్‌లకు రాసిన లేఖలో సిడబ్ల్యుసి అనుమతి పొందిన ప్రాజెక్టు నమూనాకు విరుద్ధంగా పనులు చేపడుతున్నారని ఆరోపించారు. ఎత్తిపోతల పనులు ఆపినట్లు ఏప్రిల్ 8న జరిగిన పిపిఎలో పోలవరం చీఫ్ఇంజినీర్ తెలిపినా వాస్తవానికి క్షేత్రస్థాయిలో అత్యంతవేగంగా పనులు చేస్తున్నారని ఆయన ఆరోపిం చారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే పోలవరం డెడ్‌స్టోరేజీనుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధమైందని లేఖలో పేర్కొన్నారు. కేంద్ర జలసంఘంతోపాటు ఏ అనుమతులు తీసుకోకుండానే పోలవరం డెడ్‌స్టోరేజి నుంచి నీటిని ఎత్తిపోయడానికి వేగంగా పనులు చేస్తున్నట్లు అనిల్‌కుమార్‌జి ఆరోపించారు.దీనివల్ల గోదావరి డెల్టా వ్యవస్థ ప్రయోజనాలకు కూడా నష్టం వాటిల్లుతుందని లేఖలో పేర్కొన్నారు. >>2



బెంగళూరులో శనివారం జరిగిన విద్యుత్ మంత్రుల భేటీలో డి.సిఎం భట్టి

## మరింత పటిష్టంగా విద్యుత్ నెట్‌వర్క్

### బెంగళూరులో జరిగిన దక్షిణాది విద్యుత్ మంత్రుల సదస్సులో డి.సిఎం భట్టి

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** తెలంగాణలో అంతర్గత విద్యుత్ ప్రసార నెట్‌వర్క్‌ను బలోపేతం చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. తద్వారా పెరుగుతున్న డిమాండ్‌కి తగినట్లుగాను, వివిధ విద్యుత్ వనరుల సమన్వయానికి అనుకూలంగా చర్యలు చేపడుతున్నట్టు వెల్లడించారు. బెంగళూరులో దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రుల సదస్సులో మాట్లాడుతూ తమ రాష్ట్రంలో నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా జరుగుతుందని వివరించారు. విద్యుత్ రంగంలో తెలంగాణ రాష్ట్ర పురోగతి మరియు ప్రణాళికలను వివరిస్తూ, ఇంధన మౌళిక సదుపాయాలను మెరుగుపర్చడం, ఆపరేషనల్ సామర్థ్యాన్ని పెంచడం వంటి వాటి కార్యాచరణలపై రాష్ట్రాలు మరియు కేంద్రం కలసి చర్చించడానికి ఈ సదస్సు విలువైన వేదికగా నిలిచిందన్నారు. తెలంగాణలో ప్రసార లైన్లు మరియు ట్రాన్స్‌ఫర్మేషన్ సామర్థంలో గణనీయమైన విస్తరణపై ప్రణాళికలను ఈ సందర్భంగా వివరించారు. 2034-35 వరకు దీర్ఘకాలిక ప్రణాళికను రూపొందించాల్సిన అవసరం కూడా ఉందన్నారు. అలాగే విద్యుత్ పంపిణీ సంస్థల పనితీరు, వాటి ఆర్థిక స్థితిని మెరుగుపరిచే వ్యూహాలపై చర్చించడం జరిగిందని చెప్పారు. సాంకేతిక మరియు వాణిజ్య నష్టాలను తగ్గించడం, విద్యుత్‌రంగ ఆర్థిక స్థిరతను నిర్ధారించడం, తద్వారా >>2

## ఇడి అప్పుడు అపవిత్రం.. ఇప్పుడు పవిత్రమా?

### అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేకనే మాపై దుష్ప్రచారం

### బిజెపితో చేసుకున్న చీకటి ఒప్పందంతోనే కాంగ్రెస్‌పై విమర్శలు

### తీరు మార్చుకోవాలంటూ బిఆర్ఎస్ నేతలకు మంత్రి శ్రీధర్ బాబు హితవు



**హైదరాబాద్, మే24, ప్రభాతవార్త:** తెలంగాణలో అధికారంలో ఉన్నపుడు అపవిత్రంగా కనిపించిన ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ "ఇడి" ఇప్పుడు బిఆర్ఎస్ నాయకులకు పవిత్రంగా కనిపిస్తుందా? అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రశ్నించారు. ఇప్పుడు పొగుడుతున్న దర్యాప్తు సంస్థే గతంలో కవితపై కేసు నమోదు చేసిన సంగతిని మర్చిపోయారా? అంటూ ఎద్దేవా చేశారు. ఆధారాల్లేకుండాఅక్రమంగా కేసులు నమోదు చేయడాన్ని సమర్థిస్తున్నారా లేదా? అని చెప్పాలని శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 60 ఏళ్ల కలను సాకారం చేస్తూ సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇస్తే,పదేళ్లు బిఆర్ఎస్ పార్టీ తెలంగాణను దెయ్యంలా పట్టి పీడించిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా.. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతూ, నియంతృత్వ పాలనతో ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఆ పార్టీ నాయకులకు కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు లేదన్నారు. ఆ చేదు జ్ఞాపకాలను తెలంగాణ ప్రజలిప్పుడిప్పుడే మరిచిపోతున్నారన్నారన్నారు. "ఇడి"ని పావుగా చేసుకొని కేడర్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసేలా కాంగ్రెస్ అగ్ర నాయకులపై బిజెపి పెడుతున్న అక్రమ కేసులను బిఆర్ఎస్ నాయకులు సమర్థించడం వెనుకున్న చీకటి ఒప్పందాన్ని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ మార్గ నిర్దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు, రాజ్యాంగ స్పూర్తిని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోంది. ఇలాంటి తరుణంలో ఆధారాల్లేకుండారాజ్యాంగ స్పూర్తికి విరుద్ధంగాప్రజాస్వామ్య విలువలనుతుంగలో తొక్కుతూ బిజెపి పెడుతున్న అక్రమ కేసులపై స్పందించాల్సిన అవసరం రాహుల్ గాంధీకి లేదన్నారు. >>2



జమ్మూ కాశ్మీర్ పూంచ్‌లో శనివారం ఒక పాఠశాల విద్యార్థులతో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

# కొత్త పార్టీకి కవిత రెడీ!

>>చుట్టూ దయ్యాలు ఉన్నాయని చెప్పగానే కెటిఆర్ ప్రెస్‌మీట్ పెట్టడం,అంతర్గత ప్రజాస్వామ్యం, సలహాలు, సూచనలు ఇవ్వొచ్చని చెప్పడం కూడా పార్టీ కేడర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. బిఆర్‌ఎస్ పార్టీలో దెయ్యాలు ఎవరు? కోవర్టులెవరన్నది హాట్ టాపిగ్ మారింది. శుక్రవారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న ఆమెకు అభిమానులు ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయం వెలుపల "టీమ్ కవితక్క" పేరుతో భారీగా ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేశారు. అయితే, ఈ స్వాగత ఏర్పాట్లలో ఎక్కడా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చిత్రాలు గానీ, బీఆర్‌ఎస్ పార్టీ జెండాలు గానీ కనిపించకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అక్కడికి చేరుకున్న అభిమానులు సీఎం సీఎం, కవితక్క నాయకత్వం వర్ధిల్లాలి, జై కవితక్క అని పెద్దగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో కవిత కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. సామాజిక తెలంగాణే అజెండాతో ఆమె రాజకీయ పార్టీని ఏర్పాటు చేయవచ్చునని తెలుస్తోంది. బీసీ అజెండాతోనే ఆమె రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తారని అంటున్నారు. కాగా, ఆమె అమెరికా వెళ్లే ముందు తన తండ్రి కెసిఆర్‌ను కలిసేందుకు యత్నించగా అప్పాయింట్‌మెంట్ దొరకలేదని సమాచారం. అప్పటికే ఎల్కతుర్తిలో బిఆర్‌ఎస్ సిల్వర్ జూబ్లీ సభలో కెసిఆర్ ప్రసంగంపై పాజిటివ్ ఫీడ్ బ్యాక్, నెగిటీవ్ ఫీడ్ బ్యాక్ 8 అంశాలపై మీ డియర్ డాడి పేరుతో గ్రౌండ్ రిపోర్ట్ తెలుపుతూ కవిత లేఖ రాసినప్పటికీ లీక్ కాలేదు. సరిగ్గా ఆమె అమెరికా నుంచి తిరిగి హైదరాబాద్‌కు వచ్చే ముందు లేఖ లీక్ కావడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల కాలంగా కెటిఆర్‌కు, కవితకు అస్తి అంశాలపై గొడవ జరుగుతుందని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా ఈ విషయంలోనే కెటిఆర్,కవిత మధ్య తీవ్ర విభేదాలు వచ్చాయని అంటున్నారు. అందుకనే కవిత బిఆర్‌ఎస్ పేరు లేకుండానే సొంత తెలంగాణ జాగృతి పేరుతో కార్యక్రమాలు చేపడుతున్నారని అంటున్నారు. ఇటీవల కాలంలో కవిత బీసీ సంఘాలను దగ్గరకు తీస్తూ సామాజిక తెలంగాణ అంశాన్ని తెర మీదకు తెస్తున్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. ఈ విషయంలో బీసీలతో కలిసి ధర్నాలు కూడా చేశారు. బీసీ నినాదం ఎత్తుకున్న కవిత సమావేశాలు నిర్వహిస్తున్న సమయంలో బిఆర్‌ఎస్‌లోని పలువురు బీసీ నేతలు హాజరు కావడంపై కెటిఆర్ గమనించినట్లు సమాచారం. ఈ క్రమంలో కవిత వద్ద సమావేశాలకు వెడుతున్న నేతలను కెటిఆర్ ఆపుతున్నట్లు సమాచారం. లిక్కర్ కేసు కారణంగా జైలుకు వెళ్లొచ్చిన తర్వాత రాజకీయంగా మరింత ముందుకు వెళ్లానుకున్న కల్వకుంట్ల కవితకు పార్టీ అధినేత కెసిఆర్ నుంచి కూడా పెద్దగా మద్దతు లభించడం లేదని సమాచారం. దీంతో కెసిఆర్ కుటుంబంలో ఆమె ఒంటరిగానే పోరాటం చేస్తున్నారని జరుగుతోంది. ఈ క్రమంలో రాజకీయంగా వేయాల్సిన అడుగులపై తర్జనభర్జన పడుతున్నారని అంటున్నారు.

## కొత్త ఎత్తిపోతలు ఆపండి

>> పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి నీటిని ఎత్తిపోయడం సరైన చర్యకాదని తెలిపారు. .తెలంగాణ చేపడుతున్న ప్రతి ప్రాజెక్టుకూ నీటి లభ్యత లేదంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం చెబుతోందని, మరోవైపు ఆంధ్రప్రదేశ్ మాత్రం డెడ్ స్టోరేజీ నుంచి కొత్తగా ఎత్తిపోతల పథకాన్ని ప్రతిపాదించడం ఎంతవరకు సమంజసమని అనిల్ కుమార్ లేఖలో ప్రశ్నించారు. డెడ్ స్టోరేజీ నుంచి ఎత్తిపోతల చేపట్టడం కేంద్రజలవనరుల సంఘం అనుమతులకు విరుద్ధమని తెలంగాణ ఇఎన్‌సి రాసిన లేఖలో తెలిపారు.సిడబ్ల్యుసి వెంటనే జోక్యం చేసుకొని ఆంధ్రప్రదేశ్‌ను అడ్డుకోవాలని అనిల్ కుమార్ కోరారు. పోలవరం నుంచి ఎత్తిపోతల చేపట్టకుండా చూడాలని కోరారు.కేంద్ర జల సంఘం ఇచ్చిన అనుమతులకు కూడా ఇది విరుద్ధంగా ఉందనీ పేర్కొన్నారు. గోదావరి నది యాజమాన్య బో ర్డుతో పాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీ జోక్యం చేసుకొని ఈ ప్రాజెక్టు పై ఎంపి ముందుకు వెళ్ళకుండా చూడాలనీ తెలంగాణ ఇఎన్‌సి జనరల్ కోరారు. అదేవిధంగా గోదావరి బనకచర్ల నిర్మాణం అడ్డుకోవాలని గోదావరి నదియాజమాన్యం బోర్డుకు, కెఆర్‌ఎంబికిచైర్మన్‌కు,సిడబ్ల్యుసికి లేఖలు అనిల్‌కుమార్ గురువారంరాసినారు.

## అప్పుడు అపవిత్రం, ఇప్పుడు పవిత్రమా?

>> ఆయన గురించి మాట్లాడే కనీస అర్హత కూడా బిఆర్ ఎస్ నాయకులకు లేదని స్పష్టం చేశారు. తెలంగాణలో బిఆర్‌ఎస్ పార్టీ మనుగడ ప్రశ్నార్థకంగా మారడం, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే ఆ పార్టీ నాయకులు మాపై విమర్శలు చేస్తున్నారన్నారు. జాతీయ పార్టీలో నిర్ణయాలన్నీ అధినాయకత్వమే తీసుకుంటుందనే కనీస అవగాహన పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులకు లేకపోవడం దురదృష్టకరమన్నారు. సమాఖ్య వ్యవస్థలో కేంద్రంతో సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంటుందనే విషయం, అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర ప్రయోజనాలు పట్టకుండా కేంద్రంతో తరచూ తగువు పెట్టుకున్న మీకెలా తెలుస్తుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రం కోసం ఒక ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్లి ప్రధాని, కేంద్ర మంత్రులను కలవడంలో తప్పేముందని, ఈ విషయంలో ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.
ఆయన తరచూ ఢిల్లీకి వెళ్లడం వల్లే సికింద్రాబాద్ నుంచి శామీర్ పేట్ వరకు నిర్మించతలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్, కాజీపేట్ లో కోచ్ ఫ్యాక్టరీ, జహీరాబాద్ నిమ్జ్ విషయంలో కదలికొచ్చిందనే విషయాన్ని మరువొద్దన్నారు. మీరు తెచ్చిన అప్పులకు వడ్డీలు కడుతూగాడి తప్పిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సరిదిద్దుతున్న మాపై బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. రుణ మాఫీ, రైతు భరోసా, మహాలక్ష్మి పథకం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న బియ్యం, రాజీవ్ ఆరోగ్య శ్రీ, రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్ల లాంటి పథకాలు మీ కంటికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. మీకు నచ్చకపోతే తొలగించాలా...?ఓవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధిలో తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ గా నిలిపేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డిని బిఆర్‌ఎస్ నాయకులు విమర్శించడం సరికాదన్నారు.

## బాలికల హవా

>> 83,364 మంది విద్యార్థులు (84.33 శాతం) అర్హత సాధించారని తెలిపారు. 53,085మంది బాలురు హాజరుకాగా.. వారిలో 42,836 మంది(80.69 శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 45,773 మంది హాజరు కాగా వారిలో 40,528 మంది (88.54శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను అధికారిక వెబ్ సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు. 2025 పాలిసెట్‌లో మొత్తం 120 మార్కులకు పరీక్షలు నిర్వహించగా.. అందులో.. 36 మార్కులు వచ్చిన అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. అలాగే ఎస్సీ, ఎస్టీలు నిర్ణీత ఉత్తీర్ణతకు ఒక్క మార్కు పొందాలి. పాలీసెట్-2025లో సాధించిన మొత్తం మార్కుల ఆధారంగా అభ్యర్థులకు మెరిట్ ర్యాంకులు ఇవ్వడం జరిగింది. ఇందులో 18039 మంది ఎస్సీ విద్యార్థులకుగాను 18037 మందికి ర్యాంకులు ఇవ్వడం జరిగింది. ఉత్తీర్ణత సాధించిన 7459 మంది ఎస్టీ విద్యార్థులకు ర్యాంకులు ఇచ్చారు. ఎంపిసిలో 80,949 మంది అర్హత సాధించగా.. ఎంబైపిసిలో 83,364 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంపిసిలో గోరుగంటి శ్రీజ, తూమటి లాస్యశ్రీ, ఉద్యాల కౌశిక్ నారాయణ,విసవరం దీక్షిక నలుగురు 120 మార్కులతో మొదటి ర్యాంక్‌ను సొంతం చేసుకున్నారు. 119 మార్కులతో షేక్ ఇఫ్రా తస్నీమ్, జాదవ్ రిషి ఆరాధ్య, పోగుల సాత్విక, కాజా హారిదీప్ నలుగురు రెండో ర్యాంక్‌ను సాధించారు. మరోఏడుగురు118 మార్కులు సాధించారు. ఎంబైపిసిలో 120 మార్కులతో గోరుగంటి శ్రీజ, తూమటి లాస్యశ్రీ ఇద్దరు మొదటి ర్యాంక్ సాధించారు.119 మార్కులతో షేక్ ఇఫ్రా తస్నీమ్, ఉంద్యాల కౌశిక్ నారాయణ 3, 4 ర్యాంక్‌లను సొంతం చేసుకున్నారు.

## విద్యుత్ నెట్‌వర్క్

>>పెట్టుబడులకు మరియు సేవల అందించడంలో నిరంతరత ఉండేలా చర్యలు చేపట్టడంపై దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. ఇక ఎలక్ట్రిక్ వాహన ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటును వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఛార్జింగ్ స్టేషన్లకు కనెక్షన్ ప్రక్రియను సులభతరం చేయడంపై తెలంగాణ రాష్ట్రం వివిధ చర్యలు చేపట్టిందని వివరించారు. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ వ్యవస్థ అభివృద్ధికి లక్ష్యాలను నిర్దేశించినట్లు వెల్లడించారు. అంతేకాకుండా విద్యుత్ గ్రిడ్‌లో సైబర్ భద్రతా చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో ప్రతిస్పందన సామర్థ్యాన్ని పెంచడం వంటికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందని తెలిపారు. ఏ పరిస్థితుల్లోనైనా నాణ్యమైన మరియు నమ్మదగిన విద్యుత్ సరఫరా నిర్ధారించేందుకు బలమైన వ్యవస్థలు అవసరమన్న విషయాన్ని నొక్కి చెప్పారు.

## వారం - వర్జ్యం

తేది : 25-05-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
త్రయోదశి మ.3.49
అశ్వని ఉ.11.11
వర్జ్యం రా.7.40-9.05
దు.సా.4.47-5.39
శుభసమయం :ఉ.8.15-8.50
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**వృషభం:** నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. ఇంటా బయటా ప్రోత్సహం. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**మిథునం:** చేపట్టిన కార్యక్రమాలలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**కర్కాటకం :** కుటుంబంలో ఏర్పడిన సమస్యలు కొంతవరకు తీరుతాయి. ఉద్యోగాలలో స్థానమార్పులు వుంటాయి. ధనవ్యయం.

**సింహం:** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే.

**కన్య :** నూతన కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. చర్చల్లో పురోగతి సాధిస్తారు. శ్రమ పెరుగుతుంది.

**తుల :** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. పాత మిత్రుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**వృశ్చికం:** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. గృహయోగం. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**ధనుస్సు:** ఆర్థిక ఇబ్బందులు ఎదురై చికాకులు పెడతాయి. భూవివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. ఖర్చులు.

**మకరం:** ఋణదాతల వత్తిడులు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం. ప్రయాణాలు.

**కుంభం:** ఇంటా బయటా సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి. వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు.

**మీనం:** ఆదాయం తగ్గుతుంది. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది. సోదరుల నుండి సాయం అందుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వికసిత తెలంగాణ దిశగా అడుగులు

>> రూపొందించామని సీఎం ప్రకటించారు. శనివారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ సమక్షంలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హాజరై తెలంగాణ రైజింగ్-2047పై ప్రసంగించారు. తెలంగాణ రైజింగ్ విజన్ లోని 4 కీలక అంశాలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. పేదల సంక్షేమం,సమగ్ర పాలసీల రూప కల్పన, వరల్డ్ క్లాస్ ఇన్ఫ్రా డెవలప్మెంట్, పారదర్శక సుపరిపాలన లక్ష్యాలకు ప్రాధాన్యమిస్తామన్నారు. తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కుల గణన, బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు, ఎస్సీల ఉప వర్గీకరణకు ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందన్నారు.తెలంగాణ సమగ్రాభివృద్ధికి ఇప్పటికే వెల్ఫేర్ అండ్ సోషల్ జస్టిస్ పాలసీ, గ్రీన్‌ఎనర్జీ పాలసీ, ఇన్ఫ్రా అండ్ ఇండస్ట్రియల్ పాలసీ,టూరిజం పాలసీలను సిద్ధం చేసి కార్యాచరణలో పెట్టినట్లు చెప్పారు.అభివృద్ధిలో, సంక్షేమంలో ఆయా వర్గాలకు న్యాయమైన వాటా ఇవ్వాలన్నది తమ సంకల్పమన్నారు.అందుకే తెలంగాణలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కులగణన చేపట్టామన్నారు. బీసీలకు విద్య, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ ఉపకులాల వర్గీకరణ.. ఈ రెండు చరిత్రాత్మక నిర్ణయాలను దేశంలోనే మొట్టమొదటగా తెలంగాణ అమలు చేయడం గర్వంగా ఉందన్నారు.దేశవ్యాప్త కుల గణనకు కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ముఖ్యమంత్రి స్వాగతించారు.కులగణనలో తెలంగాణ అనుభ వాలను పంచుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు.2028 నాటికి రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యాన్ని ప్రకటించారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో మహిళలకు కీలక పాత్ర ఉండేలా విధానాలు రూపొందించినట్లు సీఎం ప్రకటించారు.మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళా సంఘా లకు రూ.లక్ష కోట్ల రుణాలు,మహిళా సంఘాలకు పాఠశాలల నిర్వహణ,శిల్పారామంలో 100 స్టాళ్లతో మహిళా బజార్ అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు.సోలార్ పవర్ జనరేషన్ లోనూ భాగస్వా మ్యం కల్పించి మహిళలను వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా ప్రోత్స హించే కార్యక్రమాలు అమలు చేశామన్నారు. మన దేశ భవిష్యత్తు మన యువత. తెలంగాణ రాష్ట్ర సాధనలో యువతదే కీలక పాత్ర. అందుకే యువత ఆశయాల సాధనకు అనుగుణంగా యూత్ పాలసీ అమలు చేస్తున్నాం.60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశాం, ప్రైవేటు రంగంలో లక్ష ఉద్యోగాలు సృష్టించామని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఒకవైపు మానవ వనరులకు డిమాండ్ పెరుగుతున్నా మరోవైపు నిరుద్యోగ సమస్య నెలకొంది.నైపుణ్యాల కొరతే ఈ అంతరానికి కారణమని గుర్తించాం.అందుకే యంగ్ ఇండియా స్కిల్ యూని వర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, పోలీస్ స్కూల్, ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్స్, ఐటీఐలను అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లుగా ఆధునీకరించి స్కిల్ శిక్షణ ఇస్తున్నామని సీఎం వివరించారు.తెలంగాణను డ్రగ్స్ ఫ్రీ స్టేట్ గా తీర్చిదిద్దుతామని సిఎం ప్రకటించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన, వాటికి అడ్డుకట్ట వేయటంలో139 దేశాల్లో తెలంగాణ నెంబర్1 స్థానం సాధించిన విషయాన్ని గుర్తు చేశారు.రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా యువతకు రూ.5లక్షల స్వయం ఉపాధిపథకాన్ని జూన్ 2 నుంచి ప్రారంభిస్తామన్నారు. దేశానికి రైతే వెన్నెముక అని, ఆ వెన్నెముక కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతుల ఆత్మహత్యలకు అప్పులే ప్రధాన కారణం.వారిని అప్పుల ఊబి నుండి బయటకు తేవడం, తిరిగి ఆ ఊబిలోకి జారి పోకుండా నిలబెట్టాలన్న లక్ష్యాలతో పని చేస్తున్నామన్నారు. తెలంగాణలో 25.35 లక్షల మంది రైతులకు, రూ.20,616 కోట్ల రుణమాఫీ చేసి వారిని రుణ విముక్తులను చేశాం. సాగు కోసం రైతు మళ్లీ అప్పుల పాలు కాకూడదన్న ఉద్దేశంతో ఎకరాకు రూ.12వేల రైతు భరోసా సాయం చేస్తున్నాం. బియ్యానికి మద్దతు ధరకు అదనంగా క్వింటాల్‌కు రూ.500 చెల్లించి వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తున్నాం. రైతుకు చేదోడుగా ఉండే వ్యవ సాయ కూలీకి రూ.12వేల ఆర్థిక సాయం చేస్తున్నాం.ఈ రోజు వరి ఉత్పత్తిలో దేశంలో తెలంగాణ నెంబర్ వన్‌గా ఉంది.గత ఏడాది 2.90 కోట్ల టన్నుల ఉత్పత్తిని సాధించి దేశానికి ఆదర్శంగా నిలిచాం. ఈ నేపథ్యంలో రైతుల కోసం చేసే వ్యయాన్ని సంక్షేమ కోణంలో కాక... ఆహార సంపద సృష్టికి పెడుతున్న పెట్టుబడిగా చూడాలని పిలుపునిచ్చారు.2047 నాటికి ఇండస్ట్రీ, ఇన్ఫ్రా విషయంలో అంతర్జా తీయ నగరాల సరసన తెలంగాణను నిలబెట్టే భవిష్యత్తు లక్ష్యంతో తెలంగాణ రైజింగ్-2047 విజన్ ఎంచుకున్నట్లు చెప్పారు.ఈ లక్ష్య సాధనలో తొలి అడుగుగా ఏడాదిన్నర కాలంలో అమెరికా,జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా, దావోస్ (స్విట్జర్ లాండ్) దేశాలలో పర్యటించి రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించామని అన్నారు. తెలంగాణ రాష్ట్రం మొత్తాన్ని మూడు జోన్లుగా విభజించి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని, తెలంగాణను కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ తెలంగాణగా విభజించి వృద్ధి సాధిస్తామన్నారు. తెలంగాణలో కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ విభాగాల్లో మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్, మెట్రో రైల్ సెకండ్ ఫేజ్, ఫ్యూచర్ సిటీ నిర్మాణం,మాన్యూఫాక్చరింగ్ హబ్, అగ్రిబేస్డ్ పరిశ్రములు ఏర్పాటు చేస్తామన్నారు.సబర్మతీ రివర్ ఫ్రంట్, గంగా పునరుద్ధరణ ప్రాజెక్ట్ మాదిరిగా తెలంగాణలో మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉందని,మెట్రో సెకండ్ ఫేజ్,రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టులు ప్రస్తుతం డీపీఆర్‌ల స్టేజ్‌లో ఉన్నాయి.రేడియల్ రోడ్ల నిర్మాణం. తెలంగాణ ప్రతిపాదిత డ్రై పోర్ట్ నుండి మచిలీపట్నం పోర్టుకు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం తెలంగాణ అభివృద్ధిలో కీలకమవుతాయన్నారు. గుడ్ గవర్నెన్స్ తో అత్యున్నత ప్రమాణాలతో పౌర సేవలను అందిస్తామని, ఇందులో భాగంగా బిల్డ్ నవ్ యాప్ ద్వారా నిర్మాణ రంగానికి వేగం పెంచినట్లు సిఎం తెలిపారు. హైదరాబాద్‌ను డేటా సెంటర్ హబ్‌గా మార్చాలనే లక్ష్యం పెట్టుకున్నట్లు చెప్పారు.విద్య, వైద్యంలో అంతర్జాతీయ ప్రమాణాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వికసిత భారత్ లక్ష్య సాధన మనందరి ఆశయం. అందులో తెలంగాణ కీలక పాత్ర పోషించాలని మా ఆకాంక్ష. 'నేషన్ ఫస్ట్ పీపుల్ ఫస్ట్'అన్న ప్రాధాన్యతతో ముందుకు వెళుతున్నాం.ఈ దేశం రాష్ట్రాల సమాఖ్య. కేంద్రం సహాయ సహకారం మద్దతు లేకుండా తెలంగాణ రైజింగ్ విజన్ అమలు చేయలేం. తెలంగాణ సమగ్రాభివృద్ధికి సహకరించండి,వికసిత భారత్ లక్ష్య సాధనలో తెలంగాణ మొదటి వరుసలో ఉంటుందని మాట ఇస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగాన్ని ముగించారు.ప్రసంగం ప్రారంభంలో పహల్గాంలో మారణకాండ సృష్టించిన ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ నిర్వహించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, భారత సైన్యానికి అభినందనలు తెలిపారు. 1971లో శ్రీమతి ఇందిరా గాంధీ నాయకత్వంలో పాకిస్థాన్ ను ఓడించి, ఆ దేశాన్ని రెండు ముక్కలుగా చీల్చిన చరిత్రను గుర్తు చేశారు.

## మనం, మనం.. టీమిండియా

>> అభివృద్ధిని వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. అభివృద్ధివేగం పుంజుకుంటేనే రాష్ట్రాలు స్వయంసమృద్ధితో ఉంటాయన్నారు. టీమిండియా తరహాలో కేంద్రరాష్ట్రాలుపనిచేయాల్సిన అవసరం మోడీ నొక్కిచెప్పారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలంటే వికసిత్ రాజ్య సాధన అవసరమని ఇదే ఈసారి నీతి ఆయోగ్ ప్రధాన ప్రచారసందేశంగా ఆయన అన్నారు. ప్రతి భారతీయుడి లక్ష్యం వికసిత్‌భారత్ అన్నారు. ప్రతిరాష్ట్ర అభివృద్ధిచెందితేనే భారత్ అభివృద్ధిచెందుతుందన్నారు. ఇదే 140 కోట్ల భారతీయులు కంటున్న కలలని మోడీ అన్నారు. అన్ని రాష్ట్రాలముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్ర మంత్రులు సభ్యులుగా ఉంటే ప్రధాని నీతి ఆయోగ్‌కు ఛైర్మన్‌గా ఉంటారు. ప్రతి రాష్ట్రం అభివృద్ధిచేయాలన్న లక్ష్యం కేంద్రానికి ఉందన్నారు. ప్రతి నగరపాలిక సంస్థ అభివృద్ధిచెందాలి. ప్రతి గ్రామం అభివృద్ధిలోకి రావాలి. మనం ఈ దారిలో ముందుకువెళితే 2047 నాటికి వికసిత్‌భారత్ లక్ష్యసాధన పూర్తవుతుందన్నారు. ప్రతిరాష్ట్రం కనీసం ఒక పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధిలోకి తీసుకురావాలని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధిచేయాలని, మౌలికవనరులు, సౌకర్యాలు ఆస్థాయిలో ఉండాలన్నారు. వన్‌స్టేట్ వన్ గ్లోబల్ డెస్టినేషన్ లక్ష్యంగా ముందుకు కదలాలని పిలుపునిచ్చారు. ఈ లక్ష్యంతో ముందుకువెళితే పరిసరాల్లోని నగరాలు పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధిలోకి వస్తాయన్నారు. భారత్ శరవేగంగా పట్టణీకరణ చెందుతోందని భవిష్యత్ నగరాలుగా ప్రస్తుత నగరాలను తీర్చిదిద్దాలన్నారు. సుస్థిరత, కొత్త ఒరవడులు, అభివృద్ధి అనేవి భారత నగరాలకు ఇంజిన్లుగా ఉంటాయన్నారు. ఇక ఉపాధివ్యవస్థలో మరింతమంది మహిళలను భాగస్వాములనుచేయాలన్నారు. అందుకు అనుగుణంగా చట్టాలు, విధానాలను రూపకల్పనచేయాలని దీనితో మహిళల భాగస్వామ్యంకూడా వర్క్‌ఫోర్స్ లో పెరుగుతుందన్నారు. దక్షిణాదినుంచి ఆంధ్రప్రదేశ్‌ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తెలంగాణ సీఎం ఎ రేవంత్‌రెడ్డి, తమిళనాడు సీఎం ఎంకెస్టాలిన్‌లు కీలకమైన నీతి ఆయోగ్‌సమావేశానికి హాజరయి తమతమ రాష్ట్రాల నివేదికలు ఇచ్చారు.

**ముగ్గురు దక్షిణాది సిఎంలు డుమ్మా**

అత్యంత కీలకమైన నీతి ఆయోగ్ సమావేశానికి ముగ్గురు దక్షిణాది ముఖ్యమంత్రులు డుమ్మాకొట్టారు. ఎన్డీయే పాలనలోనే ఉన్న పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగనాథన్ తోపాటు కాంగ్రెస్ పాలనలో ఉన్న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కేరల సీఎం పినరయి విజయన్‌లు సమావేశానికి రాలేదు. కర్ణాటక సీఎం ముందుగా ఉన్న కార్యక్రమాలవల్ల రాలేకపోయినట్లు తెలిపారు. మైసూరులో ప్రత్యేక కార్యక్రమం ఉందని అయితే బాయ్‌కాట్‌కాదన్నారు.కేరళలో మార్క్సిస్టు నేత ముఖ్యంమంత్రి పినరయి విజయన్ తనస్థానంలో ఆర్థిక మంత్రి కెఎన్ బాలగోపాల్‌నుపంపించారు. అయితే ముఖ్యమంత్రులు మాత్రమే రావాల్సి ఉన్న ఈ సమావేశానికి ఆర్థికమంత్రిని అనుమతించరని తెలుస్తోంది. అలాగే పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్ రంగస్వామి కూడా సమావేశానికి రాలేదు. అయితే ఆయన రాకపోవడానికి గల కారణాలుకూడా తెలియరాలేదు.



శనివారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కుమారస్వామితో భేటీ అయిన సిఎం రేవంత్

# మెట్రో-2కు అనుమతివ్వండి

>> రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను చర్చించారు.ఈ సందర్భంగా పలు ప్రాజెక్టులను ప్రస్తావించిన సిఎం వాటి నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ప్రధానమంత్రిని కోరారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్2 విస్తరణకు అనుమతులు ఇవ్వాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. నగరంలోని ఇతర ప్రాంతాలకు మెట్రోను తక్షణం విస్తరించాల్సిన అవసరం ఉందని, గత 10 ఏళ్లలో ఉన్న ప్రభుత్వం ఎలాంటి విస్తరణ చేపట్టలేదని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఫేజ్-2లో విస్తరణ కోసం కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించిందని పేర్కొన్నారు. ఫేజ్-2లో 5 కారిడార్లు ఉంటాయి - మొత్తం 76.4 కి.మీ.ఇది కేంద్రం, రాష్ట్రం కలిసి చేపట్టాల్సిన ప్రాజెక్ట్ (జేవీ ప్రాజెక్ట్) అని వివరించారు. మొత్తం ఖర్చు: రూ. 24,269 కోట్లు.ఇందులో కేంద్రం వాటా: 18శాతం (రూ.4,230 కోట్లు), రాష్ట్రం వాటా: 30శాతం (రూ.7,313 కోట్లు), రుణం: 48శాతం (రూ. 11,693 కోట్లు) అని వివరించారు. కాగా, 2024 అక్టోబరులో చెన్నై మెట్రో ఫేజ్-2కు (రూ. 63,246 కోట్లు),2021, ఏప్రిల్‌లో బెంగళూరు మెట్రో ఫేజ్-2 (రూ.14,788 కోట్లు), 2024, ఆగస్టులో బెంగళూర్ మెట్రో ఫేజ్-3(రూ. 15,611 కోట్లు)కి కేంద్రం ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం 2024, నవంబరు 4న కేంద్ర గృహ,పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు సమర్పించిందని, వాటిపై కేంద్రం కొన్ని స్పష్టీకరణలు కోరగా, వాటికి సమాధానాలు ఇచ్చామని చెప్పారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపాలని ప్రధానిని కోరారు.హైదరాబాద్ చుట్టూ రెండు జాతీయ రహదారులతో ప్రాంతీయ రింగు రోడ్డును (ఆర్‌ఆర్‌ఆర్) తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిందని ప్రధానికి గుర్తు చేశారు. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం: సంగారెడ్డి - నర్సాపూర్ - తూప్రాన్ - గజ్వేల్ - భువనగిరి - చౌటుప్పల్ (ఎన్‌హెచ్ 161), ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం: చౌటుప్పల్ - అమన్‌గల్ - షాద్‌నగర్ - సంగారెడ్డి (ఎన్‌హెచ్ 65), ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం: భూముల సేకరణకు 2022లోనే ప్రారంభమైందని తెలిపారు. భూ సేకరణ వ్యయంలో రాష్ట్రం 50 శాతం భరిస్తోంది.90శాతం భూముల ప్రపోజల్స్ ఎన్‌హెచ్‌ఏఐకి పంపామని తెలిపారు..ఎన్‌హెచ్‌ఏఐ టెండర్లు పిలిచింది. ఈ భాగానికి అవసరమైన ఆర్థిక, కేబినెట్ ఆమోదం ఇవ్వాలని కోరారు. ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం:ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగంతో పాటు ఈ భాగాన్ని ఏక కాలంలో చేపట్టాలని కోరారు.ఐటీ,ఫార్మా, లాజిస్టిక్స్ వృద్ధితో హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఇప్పుడున్న ఓఆర్‌ఆర్ రానున్న 5 సంవత్సరాల్లో సరిపోదు. ఇప్పటికే ఓఆర్‌ఆర్ పై రోజుకు లక్ష సీపీయూ ఉందని వివరించారు..ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం పూర్తయిన తర్వాత దక్షిణ భాగం నిర్మాణం చేపడితే భూ సేకరణ, నిర్మాణ వ్యయం భారీగా పెరిగే ప్రమాదం ఉంది, అందువలన రెండు భాగాలను కలిపి ఒకేసారి పూర్తి చేస్తేనే సరైన ఉపయోగం ఉంటుందని చెప్పారు. ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం భూ సేకరణకు అయ్యే వ్యయంలో 50 శాతం భరించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. రీజినల్ రింగు రోడ్డుకు సమాంతరంగా 370 కిమీ పరిధిలో రైల్వే లైన్ ప్రతిపాదించాం. ఇది రాష్ట్రాభివృద్ధికి కొత్త దిశలో మార్గం చూపుతుందని తెలిపారు.బందరు పోర్టు నుంచి హైదరాబాద్ డ్రైపోర్ట్ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరారు.హైదరాబాద్‌లో ప్రభుత్వ, ప్రభుత్వప్రైవేటు సంయుక్త భాగస్వామ్యంలో, ఎంఎస్‌ఎంఈల్లో ఉన్న రక్షణ రంగ ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.హైదరాబాద్‌లోని డిఆర్‌డిఓ, డిఫెన్స్ పిఎస్‌యులు ఉన్నత స్థాయిలో పని చేస్తున్నాయి. వాటి పరిధిలో 1,000కి పైగా ఎంఎస్‌ఎంఈలు - స్థానిక, అంతర్జాతీయ డిఫెన్స్ సంస్థలకు విడి భాగాలు తయారు చేస్తున్నాయని వివరించారు. లాక్‌హీడ్ మార్టిన్,బోయింగ్,జీఈ,సఫ్రాన్,హానివెల్ వంటి సంస్థలు హైదరాబాద్ పై ఆసక్తి చూపుతున్నాయని పేర్కొన్నారు. రక్షణ రంగంలోని జెవీస్ అండ్ ఆఫ్‌సెట్‌లకు కేంద్ర ఆర్డర్లు తక్షణ అవసరమని, వీటిని ఆమోదం తెలిపేందుకు ప్రత్యేకమైన వ్యవస్థ ఉండాలని పేర్కొన్నారు. హైదరాబాద్ - బెంగళూరు డిఫెన్స్ కారిడార్ ప్రతిపాదనను ప్రస్తావించారు. యుపి, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌కి ప్రోత్సాహం ఉంది, కానీ హైదరాబాద్‌కి లేదని ప్రధాని దృష్టికి తీసుకొచ్చారు. ఆయా రాష్ట్రాలతో సమానంగా తెలంగాణకు కేంద్రం మద్దతు ఇవ్వాలని ప్రధానిని కోరారు.రక్షణ రంగ పరికరాల తయారీలో ముందున్న హైదరాబాద్‌లో డిఫెన్స్ ఎక్స్‌పో నిర్వహించాలని, ఎంఎస్‌ఎంఈలకు ప్రోత్సాహకాలు, పీఎల్ఐ లాంటి మద్దతులు ఇవ్వాలని ప్రధాని కోరారు.

## కరోనా పంజా

>> గుర్తిస్తున్నారు. మూడేళ్లలో తొలిసారి ఢిల్లీలో 23మందికి వైరస్‌సోకిందని వైద్యఆరోగ్యవర్గాలు పేర్కొంటున్నాయి. కేసులు నమోదవుతున్నా తీవ్రత తక్కువేనని కేంద్ర ఆరోగ్యశాఖచ ఎపుతోంది. అయినాకూడా అప్రమత్తంగా ఉండాలని తెలిపింది. ఆసియా దేశాల్లో ముఖ్యంగా హాంకాంగ్, సింగపూర్, థాయిలాండ్‌తోపాటు చైనాలోనూ కొవిడ్19 వ్యాప్తి తీవ్రస్థాయిలో ఉంది. వారానికి వేల సంఖ్యలోకేసులు బయటపడుతున్నాయి. వైరస్ వ్యాప్తికి జెఎన్1 వేరియంట్, దాని ఉపకారకాలే ఎక్కువ ఉన్నట్లు అధికారులు చెపుతున్నారు. జ్వరం ముక్కుకారడం, గొంతునొప్పి, తలనొప్పి, నీరసం వంటి స్వల్పలక్షణాలు ఉన్నాయని బాధితులు నాలుగురోజుల్లోనే కోలుకుంటున్నారని వైద్యరంగనిపుణులు చెపుతున్నారు.

## వచ్చేశాయ్.. రుతుపవనాలు

>> తాకాయి. సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు భారతదేశంలో ప్రవేశిస్తాయి. అయితే 1918లో అత్యంత వేగంగా మే 11న కేరళను తాకి రికార్డు సృష్టించాయి. ఆలస్యంగా ప్రారంభమైన రికార్డు 1972లో నమోదైంది. ఆ ఏడాది రుతుపవనాలు జూన్ 18 నాటికి ప్రారంభమయ్యాయి. గత 25ఏళ్లలో 2016లో ఆలస్యంగా రుతుపవనాలు జూన్ 9న కేరళలోకి ప్రవేశించాయి.
ఈ సారి అన్నింటికంటే వేగంగా కేరళను తాకి 16 ఏళ్ల తర్వాత రికార్డు సృష్టించాయి. దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, దక్షిణ కర్ణాటక, కొంకణ్, గోవాలో అతి భారీ వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ అంచనా వేసింది. మే 29 వరకు కేరళ, తీరప్రాంత కర్ణాటకలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురుగాలులు గంటకు 4050 కి.మీ వేగంతో వీస్తాయని పేర్కొంది. తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లలో కూడా రాబోయే ఐదు రోజుల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.పశ్చిమ రాష్ట్రాల అంచనా. దక్షిణ కొంకణ్ తీరానికి సమీపంలో తూర్పుమధ్య అరేబియా సముద్రంలో అల్పపీడనం ఏర్పడి మే 24 ప్రారంభంలో రత్నగిరికి వాయువ్యంగా 40 కి.మీ దూరంలో కేంద్రీకృతమవుతుందని ఐఎండీ అంచనా వేసింది. ఇది తూర్పు వైపునకు కదిలి శనివారం రత్నగిరి, దపోలి మధ్య తీరం దాటే అవకాశం ఉందని పేర్కొంది. మహారాష్ట్ర తీరప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ శుక్రవారం మధ్యాహ్నం రెడ్ అలర్ట్ జారీ చేసింది. ముంబయిలో మెరుపులు, ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని, ఆ సమయంలో గంటకు 40నుంచి 50 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని అంచనా వేసింది. భారత వాతావరణ శాఖ గోవాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలో ఆదివారం వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ముందు జాగ్రత్త చర్యగా నదులు, జలపాతాల నుంచి దూరంగా ఉండాలని పేర్కొంది. గత 24 గంటల్లో గోవా తీరప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

**ఉత్తరాది రాష్ట్రాల అంచనా**

మే 24న ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, యూపీలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులుతో కూడిన వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. జమ్ముకశ్మీర్, లద్ధాఖ్, పంజాబ్, హరియాణా, చండీగఢ్, రాజస్థాన్ లోని కొన్ని ప్రాంతాల్లో కూడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.



## కాన్పూర్‌లో ఉగ్రదాడి బాధిత కుటుంబాన్ని పరామర్శించనున్న ప్రధాని మోడీ

**కాన్పూర్, మే 24:** పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన కాన్పూర్ బిజినెస్ మ్యాన్ శుభం ద్వివేది కుటుంబసభ్యులను ప్రధాని మోడీ ఈ నెల 30వ తేదీన కలుసుకోనున్నట్లు ఎంపి రమేష్ అవస్తి చెప్పారు. 30వ తేదీ కాన్పూర్‌వస్తున్న ప్రధాని శుభమ్ ద్వివేది కుటుంబసభ్యులను పరామర్శిస్తారని చెప్పారు. అయితే తమకేమీ సమాచారం లేదని కుటుంబీకులు చెపుతున్నారు. బిజినెస్ మ్యాన్ అయిన ద్వివేది (31) పహల్గాం విహార యాత్రలో ఉండగానే ఉగ్రతూటాలకు బలైపోయాడు. అప్పటి నుంచి ఆకుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. దీనిపై ఎంపి రమేష్ అవస్తి స్పందించి ప్రధానిమోడీకి లేఖరాసారు. కాన్పూర్‌లో ఆ కుటుంబాన్ని పరామర్శించాలని విజ్ఞప్తిచేసారు. అంతేకాకుండా శుభమ్‌కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. అలాగే సుభమ్ కుటుంబం కూడా ద్వివేది త్యాగానికిగాను ఆయనకు అమరవీరుల హోదా కల్పించాలని విజ్ఞప్తిచేస్తోంది. కేవలం హిందువు అయినందువల్లనే శుభమ్‌ని టార్గెట్‌చేసి చంపివేసారని ఆవేదన వ్యక్తంచేసారు. ఆతని త్యాగాన్ని గౌరవించడంతో న్యాయం చేయడమే కాదు అవసరం కూడా అని చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే శుభమ్ ద్వివేది వివాహం జరిగింది. తన భార్య, వదినలతో కలిసి విహారయాత్రగా పహ ల్గాంకు వచ్చారు. ఈ సందర్భంగా శుభం భార్య హింమాంశు మాట్లాడుతూ తన భర్తకు న్యాయం జరుగుతుందనే ఆశిస్తున్నట్లు తెలిపారు. తమకు అధికారిక సమాచారం ఏదీ లేదని అయితే కాన్పూర్‌కు ప్రధాని వస్తున్నట్లు మాత్రం సమాచారం ఉందని ఇప్పటికే ఎంపిలు, ఎమ్మెల్యేలు తమకు భరోసా ఇచ్చారని, అందువల్ల ప్రధాని మోడీ తమను కలుసుకోవచ్చనే భావిస్తున్నట్లు తెలిపారు.

## డిజిటల్ ట్విన్ టెక్నాలజీ సెంటర్‌కు హెచ్‌ఎఎల్ రూ.5 కోట్ల గ్రాంట్

**హైదరాబాద్ (శేరిలింగంపల్లి), మే 24, ప్రభాతవార్త:** డిజిటల్ ట్విన్ టెక్నాలజీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఒఇ) ఏర్పాటు కోసం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ రూ.5 కోట్ల గ్రాంట్‌ను మంజూరు చేసింది. హెచ్‌ఎఎల్ కార్పొరేట్ సోషల్ రెస్పా న్సిబిలిటీలో భాగంగా అందజేస్తున్న నిధులతో వర్సిటీలో పరిశోధన, ఆవిష్కరణ, సామర్థ్యాలకు పెద్దఎత్తున మేలు జరుగుతుందని వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు అన్నారు. ఈ ప్రతిపాదనకు నాయకత్వం వహిస్తున్న ప్రొఫెసర్లు సామ్రా ట్ సబత్, సిబ ఉద్గాట, ఘనశ్యాంకృష్ణ కృషితోనే గ్రాంట్ మంజూరైనట్లు తెలిపారు. సిఎస్‌ఆర్ నిధులను సమగ్ర పరిశోధన, మౌలిక సదుపాయాల ఏర్పాటుకు వినియోగిస్తామన్నారు. అత్యాధునిక డిజిటల్ ట్విన్ ల్యాబ్ ప్రాక్టిక్స్ డెవలప్‌మెంట్ కోసం శిక్షణ లాబ్స్ విద్యార్థులు, పరిశోధకుల నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో నిరంతరం శిక్షణ, వర్క్‌షాప్‌లు నిర్వహించేందుకు ఆడిటోరియం నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు.

## బిఆర్‌ఎస్ పాలనలో దోచుకున్నది కవిత లేఖతో బహిర్గతం

### ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్

**హైదరాబాద్,మే 24,ప్రభాతవార్త:** పదేళ్లపాటు అధికారంలో ఉండి బిఆర్‌ఎస్ చేసిన పాపాలను ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత బయటపెట్టారని ఎమ్మెల్సీ డా. బల్మూర్ వెంకట్ అన్నారు. గాంధీభవన్‌లో మాట్లాడుతూ దోచుకున్న సొమ్ము పంచుకోవడంలోనే కల్వకుంట్ల కుటుంబంలో పంచాయతీ మొదలైందని భాష్యం చెప్పారు. పదేళ్లపాటు రాష్ట్ర సంపద, ప్రజల కష్టాన్ని కల్వకుంట్ల కుటుంబమే దెయ్యాల దోచుకుతిన్నదని ఆవేదన చెందారు. కేసీఆర్ చూట్టూ ఉన్న ఆ దెయ్యాలు ఎవరో కవిత తెలంగాణ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా బిజెపిలో దెయ్యాలు, రాక్షసులు ఉన్నారని కవిత ఒప్పు కున్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలుచేసి, కల్వకుంట్ల కుటుంబం మాత్రం బంగారు కుటుంబం అయిందని అన్నారు. బిఆర్‌ఎస్ దోపిడి పాలనలో దోచుకున్నది కవిత లేఖతో బహిర్గతమైందని ఆయన తెలిపారు.

## మహారాష్ట్రలో వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచార ఘటనలో ముగ్గురు నిందితులకు రిమాండు

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** మహారాష్ట్రలోని సాంగ్లి జిల్లాలో 22 ఏళ్ల వైద్య విద్యార్థిపై జరిగిన సామూహిక అత్యాచార ఘటనలో ముగ్గురు నిందితులకు స్థానిక కోర్టు రిమాండు విధించింది. ఈ నెల 18వ తేదీన సాంగ్లి వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ మూడవ సంవత్సరం చదువున్న విద్యార్థి తన సహచరులైన ఇద్దరు విద్యార్థులతో కలిసి సినిమాకు వెళ్లేందుకు అంగీకరించింది. అయితే ఈ ఇద్దరు ఆ విద్యార్థినిని తమ ఫ్లాట్‌లో భోజనం కోసం పిలిచి కూల్ డ్రింక్‌లో మత్తు పదా ర్థం కలిపి స్పృహ కోల్పోయేలా చేశారు. అనంతరం ఇద్దరు విద్యార్థులతో పాటు వారి స్నేహితుడు మరో విద్యార్థితో కలిసి సదరు విద్యార్థినిపై సామూహికంగా అత్యాచారం చేశారు. దీని తరువాత ఈ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. రెండు గంటల తరువాత ఆ విద్యార్థిని స్పృహలోకి రాగా తనపై జరిగిన అఘా యిత్యం తెలుసుకుని వారిని నిల దీసింది. దీంతో ముగ్గురు విద్యార్థులు ఈ విషయం ఎవరికైనా చెబితే అత్యాచారం దృశ్యాలను సోషల్ మీడియాలో వుంచుతా మని బెదిరించారు. దీంతో ఆ విద్యార్థిని రెండు రోజుల పాటు మౌనంగా వుండి చివరకు ధైర్యం చేసి శుక్రవారం నాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యా దు మేరకు ముగ్గురు నిందితులపై పోలీసులు అత్యాచారం కేసు నమోదు చేసి, వైద్యపరీక్షలు నిర్వహించారు. అత్యాచారానికి గురైన విద్యార్థినికి కూడా వైద్యపరీక్షలు నిర్వహించారు. ముగ్గురు నిందితులను శనివారం నాడు రిమాండుకు తరలించారు. నిందితులు షోలాపూర్, పుణే, సాంగ్లికి చెందిన వారుగా 20 నుం చి 22 ఏళ్ల వయస్సు వారుగా తేలింది.

## ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు బిసి గురుకుల విద్యార్థులు

### శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులను సత్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కి రాష్ట్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బిసి గురుకుల విద్యార్థులు వెళ్లనున్నారు. శిక్షణ పూర్తి చేసుకుని బేస్ క్యాంప్‌కి వెళ్ళే విద్యార్థులకు బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం ఘనంగా సత్కరించారు. ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కి వెళ్ళే విద్యార్థులకు భువనగిరిలోని రాక్ క్లైంబింగ్ స్కూల్‌లో 2 రోజులపాటు 200 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో ప్రతిభ, శక్తి సామర్థ్యాలు కనబరిచిన వారి నుండి 20 మందిని ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కి ఎంపిక చేశారు. మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌లోని అడ్వెంచర్ క్యాంప్‌కు ఎంపికైన 20 విద్యార్థిని విద్యార్థులు ఈనెల 25 నుండి జూన్ 10 వరకు ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వద్ద ట్రెక్కింగ్ చేయనున్నారు. ఎవరెస్ట్ బేస్ క్యాంప్ సెలక్షన్స్ కోసం కోరుకుల పాఠశాల నుండి 100 మంది బాలికలు 100 మంది బాలురలను ఎంపిక చేసి రెండు రోజుల పాటు భువనగిరి లోనీ రాక్ క్లైంబింగ్ స్కూల్‌లో శిక్షణ ఇచ్చారు. వారికి సెక్రటేరియట్‌లో రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, గురుకుల సొసైటీ సెక్రటరీ సైదులు మెడల్స్‌తో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. చిన్న వయసులోనే ఎవరెస్ట్ అధిరోహించిన మాలవత్ పూర్ణ, రాకేష్‌ల ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్నారు. ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ట్రెక్కింగ్ ద్వారా విద్యార్థులు మనుగడ పద్ధతులను, ఈ ప్రాంత సంస్కృతిని నేర్చుకుంటారని.. ఈ శిబిరం శారీరక,దృఢత్వం మానసిక స్థితిస్థాపత ప్రోత్సహిస్తుందని మంత్రి తెలిపారు. ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కి వెళ్ళే విద్యార్థిని విద్యార్థులకు మంత్రి మెడల్స్, శాలువాలతో సత్కరించారు. ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కి ఆదివారం ఉదయం వెళ్తున్న విద్యార్థులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. విజయం సాధించాలంటే జాగ్రత్తలు పాటిస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. బిసి గురుకులాలకు, తల్లి దండ్రులకు, ప్రాంతానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. వచ్చిన అవకాశాన్ని ఉపయోగించి రికార్డు క్రియేట్ చేయాలని తెలిపారు. కలలు కనడం తప్పు కాదని.. భవిషత్‌లో మంచి తెచ్చుకోవడానికి కష్టపడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ట్రెక్కింగ్ చేస్తున్న విద్యార్థులకు సూచించారు.

## కెసిఆర్‌కు పట్టిన దెయ్యం కెటిఆరే!

### కవిత ఇచ్చిన ఝలక్‌తో కెటిఆర్‌కు మతిభ్రమించి రేవంత్‌పై విమర్శలు

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** కెసిఆర్‌కు పట్టిన దెయ్యం కెటిఆరే అని కల్వకుంట్ల కవిత చెప్పకనే చెప్పిందని, కెటిఆర్‌కేమో అధికార దెయ్యం పట్టిందని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ ఒక ప్రకటనలో విమర్శించారు. కవిత ఇచ్చిన ఝులక్ తోమతిభ్రమించిన కెటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం స్కామ్‌లో కెసిఆర్‌కు, హరీశ్‌రావుకు నోటీసులు అందడంతో షాక్ తిన్న కెటిఆర్ నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు.

అవినీతిపై కెటిఆర్ మాట్లాడుతుంటే, అధికారం దెయ్యం పట్టిన కెటిఆర్ వేదాలు వల్లించినట్లు ఉందని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రతిస్పందించారు. బిఆర్‌ఎస్ మూడు ముక్కలాటలో ఓ ముక్క కవిత విడిపోవడం ఖాయం అని జోస్యం చెప్పారు. బిజెపి బిఆర్‌ఎస్ కలిసే ఉన్నట్లు బిఆర్‌ఎస్ నేతల మాటగా కవిత లేఖలో స్పష్టంగా చెప్పుకొచ్చారని గౌడ్ వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బిజెపి నేతలు కేసిఆర్ పై పొగడ్తలు, సానుభూతి తెలుపుతున్నారు.. బిజెపి బిఆర్‌ఎస్ మైత్రికి ఇంతకంటే నిదర్శనం ఏం ఉంటుందని ప్రశ్నిం చారు. పదేళ్ల పాలనలో మీ కుటుంబం చేసిన అవినీతి బయట పడకుండా ఉండేందుకు నరేంద్ర మోదీ, అమిత్ షా కాళ్లు పట్టుకుంది ఎవరో ప్రజలకు తెలుసని ఆయన అపహాస్యం చేశారు.

లిక్కర్ స్కాంలో కవితను బెయిల్ కోసం బిజెపి కాళ్లు పట్టుకుంది ఎవరో కెటిఆర్‌కు తెలియదా? రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో కోమటిరెడ్డి ఒక సీనియర్ మంత్రి. కాంగ్రెస్‌లో ఇప్పుడు అంతా బాగుండడంతో తట్టుకోలేని కెటిఆర్ అనవసర విషయాలను ప్రస్తావిస్తున్నారని అన్నారు. నేషనల్ హెరాల్డ్ ఈడీ కేసు బిజెపి కక్షపూరితంగా కాంగ్రెస్‌పై సృష్టించిన కేసు. కాంగ్రెస్ సొంత పత్రికకు ఆ పార్టీ వారు నిధులు ఇవ్వడం అవినీతి ఎట్లా అవుతుంది..?అని ఆయన పత్రికా ప్రకటనలో నిలదీశారు. బిఆర్‌ఎస్ అవినీతి చాంతాడంత ఉందని మేడిగడ్డ, విద్యుత్ ఒప్పందాలు, ఫార్ములా రేస్ ఇలా ఒకటేమిటి మీ అవినీతి జాబితాకు అంతే ఉండదు. మీరు చేసిన కాంట్రాక్టులు, దందాలు మరిచి కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం విడ్డూరం. ఒకవైపు కవిత, మరోవైపు కాళేశ్వరం కేసుతో ఉక్కిరి బిక్కిరవుతున్న కెటిఆర్ ఎటూ పాలుపోక చివరికి మీడియాపై కూడా విమర్శలు చేయడం వారి దిగజారుడు తనానికి నిదర్శనం అని అన్నారు.

## ఐడిబిఐ బ్యాంకుకు టోకరా కేసులో ముంబయి బ్యాంకు మేనేజర్ అరెస్టు

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ఐడిబిఐ బ్యాంకు నుంచి తప్పుడు పట్టాదార్ పాస్ పుస్తకాలు తనఖా పెట్టి రైతుల పేరిట 2.61 కోట్ల రూపాయల రుణంతో పాటు కిసాన్ క్రెడిట్ కార్డుల పేరిట భోగస్ పత్రాలతో 25 లక్షల రూపాయల రుణాలు పొందిన కేసులో సిఐడి అధికారులు ముం బాయిలో ఇదే బ్యాంకుకు మేనేజర్‌గా పనిచేస్తున్న బుక్యా సురేష్ (37)ను అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సిఐడి చీఫ్ శిఖా గోయల్ శనివారం మీడియాకు వెల్లడించారు. సత్తుపల్లి ఐడిబిఐ బ్యాంకులో 2015..2016 మధ్యన ఏడాది కాలంలో ఈ గోల్‌మాల్ జరిగింది. 279 రైతుల పట్టాదార్ పాస్ పుస్త కాలు తనఖా పెట్టడంతో 2.61 కోట్ల రూపాయల రుణం అప్పట్లో మంజూరయ్యింది. ఇదే సమయంలో మరో 26 మందికి కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా 25 ల క్షల రూపాయల రుణం ఇచ్చారు. అయితే రైతుల పేరిట బ్యాంకులో తనఖా పెట్టిన పట్టాదార్ పాస్ పుస్తకాలు తప్పుడువని, కిసాన్ క్రెడిట్ కార్డు లబ్దిదారులు భోగస్‌గా తేలింది. ఈ గోల్‌మాల్ 2018లో వెలుగు చూసింది. దీనిపై ఐడిబిఐ బ్యాంకు ఉన్నతాధికారుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు మొదట సత్తుపల్లి పో లీసు స్టేషన్‌లో కేసు నమోదవగా అనంతరం ఈ కేసు విచారణను సిఐడికి బదలాయించారు. ఈ కేసులో ఆరు నెలల క్రితం నాటి ఐడిబిఐ స్థానిక బ్రాంచి మేనే జర్ రమేష్‌తోపాటు భోగస్ కార్యకలాపాలు నిర్వహణలో సహకరించిన స్థానికుడు సురేష్‌లను అరెస్టు చేశారు. ఈ గోల్‌మాల్‌లో పాలు పంచుకున్న కొత్తగూడెంకు చెందిన బి.వెంగళరావు, బి.జగన్నాధం, వై.హరిబాబు, ఎం.రాజశేఖర్, పి. కొండబాబులను ఈ నెల పదవ తేదీన అరెస్టు చేయగా తాజాగా శుక్రవారం నాడు ముంబాయి ఐడిబిఐ బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్న బుక్యా సురేష్‌ను అరెస్టు చేశారు. ఈ స్కాం జరిగినపుడు సురేష్ సత్తుపల్లి ఐడిబిఐ బ్యాంకులో అసెట్స్ ఆఫీసర్‌గా పనిచేసేవాడు. నాటి గోల్‌మాల్‌లో ఇతని పాత్ర నిర్ధారణ అవ డంతో అరెస్టు చేసి శనివారం నాడు రిమాండుకు తరలించారు. ఈ కేసులో తప్పించుకు తిరుగుతున్న మిగతా నిందితుల కోసం గాలిస్తున్నారు.


## బిఆర్‌ఎస్, బిజెపి రెండూ ఒక్కటే

### రేవంత్‌ను వేధించడానికి ఇడి చార్జీషీటులో చేర్చారు

### వనపర్తి, దేవరకద్ర ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** బిఆర్‌ఎస్ బిజెపి రెండు ఒక్కటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వేధించడానికి ఇడి చార్జీషీటులో చేర్చారని వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆరోపించారు. సీఎల్పీ ఆఫీస్‌లో శనివారం విలేకరుల సమావేశం ఇరువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ అక్రమంగా సంపాదించిన పైసల బలుపుతో విర్రవీగుతూ ముఖ్యమంత్రి పై ఇష్టమొచ్చినట్టు కెటిఆర్ వాగుతున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డిపొ మరోసారి అడ్డగోలుగా, పిచ్చిపిచ్చిగా మాట్లాడితే కేటీఆర్ ఖబర్దార్, తాటా తీస్తాం అనిహెచ్చరించారు. 2009 కంటే ముందు కెటిఆర్ నువ్వు ఎవరో, ఎవరికి తెలియదు. బిజెపి, బిఆర్‌ఎస్ రెండూ ఒకటేనని తాము ముందు నుంచీ చెబుతున్నాం, కవిత లేఖతో ఈ విషయం బట్టబయలైందని వివరించారు. కేటీఆర్ తన చెల్లిపై ఉన్న ఫ్రస్టేషన్ ను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చూపిస్తున్నారు. కేసీఆర్, బీజేపీపై విమర్శలు చేయకపోవడాన్ని కవిత తప్పు పట్టారని వారు అన్నారు. కవిత లెటర్‌పై బిఆర్‌ఎస్, బిజెపి పార్టీలు సమాధానమివ్వాలి. బిఆర్‌ఎస్ పార్టీలో దయ్యాలు ఎవరో మీది, మీరు తేల్చుకోవాలి అని ఆయన కెటిఆర్‌కు సలహా ఇచ్చారు. కెటిఆర్ నీ డైవర్టింగ్ పాలిటిక్స్ చూసి ప్రజలు నవ్వుతున్నారు. బిఆర్‌ఎస్ పార్టీ అంతర్గత కలహాలను కవిత లేఖలో రాసారు. రజతోత్సవ సభలో మీ తండ్రి కేసీఆర్ మాట్లాడిన అంశాలను సైతం మీ చెల్లి కవిత విమర్శించారని గుర్తుచేశారు. కెసిఆర్ అసెంబ్లీకి రాడు, అపద ఉన్నా రాడు. కెటిఆర్ ఒక పిచ్చి కుక్క లాగా వ్యవహరిస్తున్నారని అన్నారు. రాజశేఖర్ రెడ్డి ఉన్నప్పుడు వర్షాలు ఎలా పడ్డాయో, రేవంత్ రెడ్డి పాలనలో కూడా అలాగే పడుతున్నాయిఅని తెలిపారు. రేవంత్ రెడ్డి ఏదో కేసులో ఇరికించాలన్న ఉద్దేశంతోనే ఇడి ఛార్జ్ షీట్‌లో రేవంత్ రెడ్డి పేరు చేర్చారు. రేవంత్ రెడ్డి రబ్బరు బంతి లాంటి వారు, ఎంత తొక్కితే అంత పైకి లేస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. మీ చెల్లిపై ఇడి కేసు పెడితే రాజకీయ కక్ష సాధింపు, రేవంత్ రెడ్డి పై ఇడి కేసు పెడితే మాత్రం తప్పు చేస్తే పెట్టినట్లా అని నిలదీశారు. డికె అరుణ ఎవరి ఓట్లతో గెలిచారో, మహబూబ్ నగర్ జిల్లా ప్రజలకు తెలుసు. బిఆర్‌ఎస్ ఓట్లతో డికె అరుణ గెలిచింది. కూతురు తండ్రికి లేఖ రాస్తే, అందులో కాంగ్రెస్ ప్రమేయం ఏముంది.?బిజెపి ఎందుకు విమర్శలు చేయడం లేదని కవిత అడిగినందుకు కాంగ్రెస్ ను బద్నాం చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బీఆర్‌ఎస్‌ను సరెండర్ చేయడంతోనే బీజేపీకి ఎనిమిది ఎంపీ సీట్లు వచ్చాయి. రాహుల్ గాంధీ సోనియా గాంధీ గార్లది త్యాగాల కుటుంబం. అలాంటి కుటుంబంపై కక్ష సాధింపుతో కేసుల్లో ఇరికించాలని చూస్తే, రాబోయే రోజుల్లో ప్రజలే మీకు గుణపాఠం చెబుతారని అన్నారు.

## ఇపిఎఫ్ఓ వడ్డీరేటు 8.25% గా ఖరారు



### ఏడుకోట్ల మంది పిఎఫ్ చందాదారులకు భారీ ఊరట

**న్యూఢిల్లీ, మే 24:** ఇపిఎఫ్ నిల్వలపై వడ్డీరేటును కేంద్రం ఖరారుచేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 8.25 శాతంగా నోటిఫైచేసింది. ఉద్యోగ భవిష్యనిధి సంస్థ సెంట్రల్ బోర్డ్ ఆఫ్‌ట్రస్టీస్ కొన్ని రోజుల క్రితం ప్రతిపాదించిన వడ్డీరేటును యధాతథంగా కేంద్రం ఆమోదించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికికూడా ఇదే వడ్డీని చెల్లించింది. దీనితో ఏడు కోట్లమంది చందాదారుల ఖాతాల్లో వడ్డీ జమఅవుతుంది.

పిఎఫ్ వడ్డీ మీ ఖాతాలోజమ అయిందో లేదో చెక్‌చేసుకోవడంతోపాటు ఖాతాలో నిల్వల వివరాలకోసం ఉమాంగ్‌యాప్‌ను కూడా వినియోగించుకోవచ్చు.

రిజిస్టరు అయిన మొబైల్ నంబరుతో లాగిన్ అయ్యాక యాప్‌లో ఇపిఎఫ్ఒ సర్వీసెస్ విభాగంలోకి వెళితేయుఎఎన్ ఒటిపి ఎంటర్‌చేయాలి. ఆపై బ్యాలెన్స్ పాస్‌బుక్ వంటి వివరాలు వస్తాయి. ఇపిఎఫ్ఒ పోర్టల్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి యుఎఎన్, పాస్‌వర్డ్ ఎంటర్ చేయాలి. తర్వాత సభ్యుడి పాస్‌బుక్‌ను ఎంపికచేసుకుని వివరాలు పొందవచ్చు. చందాదారులు రిజిస్టరుచేసుకున్న మొబైల్‌నంబరునుంచి 9966044425 నంబర్‌కు మిస్‌కాల్ ఇవ్వడం ద్వారాకూడా పిఎఫ్ బ్యాలెన్స్ వివరాలు తెలుసుకోవచ్చు.

ఈ నంబరుకు కాల్‌చేయగానే ఆటోమేటిక్‌గా కాల్ డిస్కనెక్ట్ అవుతుంది. కొద్దిసేపటి తర్వాత పిఎఫ్ బ్యాలెన్స్ ఎస్ఎంఎస్‌రూపంలో వస్తుంది. ఎస్ఎంఎస్‌రూపంలో వివరాలుపొందేందుకు యుఎఎన్‌తో లింక్ అయిన మొబైల్‌నుంచి 7738299899నంబరుకు ఇపిఎఫ్ఒహెచ్ఒ 'యుఎఎన్' అని సందేశం ఇవ్వడంద్వారాకూడా పిఎఫ్ బ్యాలెన్స్‌ను తెలుసుకోవచ్చు.

## నిర్మాణ సంస్థలో డాటా చోరీ.. నలుగురి అరెస్టు

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** ప్రముఖ నిర్మాణ సంస్థకు సంబంధించిన డాటాను సంస్థలో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులతో పాటు మరో మాజీ ఉద్యోగి కలిసి చోరీ చేసిన ఉదంతం ఇది. తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టిన చందాన కంపెనీలో పనిచేస్తూ ఆ సంస్థనే మోసం చేసిన వ్యవహారంలో నలుగురిని తెలంగా ణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) అరెస్టు చేసింది. దీనికి సంబంధించిన వివరాలను టిజిసిఎస్‌బి డిజి శిఖా గోయల్ శనివారం మీడియాకు వెల్లడించారు. హైదరాబాద్ కేంద్రంగా క్రాఫ్ట్‌మెన్ ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ అనే కంపెనీ కొనసాగుతోంది. ఈ కంపెనీకి చెందిన కీలక ప్రాజెక్టుల డాటా కొంతకాలంగా చోరీ అవుతోంది. దీనిని కంపెనీ యాజమాన్యం మూడురోజుల క్రితం గుర్తించి నేరుగా టిజిసిఎస్‌బిలో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై రంగంలో దిగి విచార ణ చేబట్టిన టిజిసిఎస్‌బి ఎస్‌పి కెవిఎం ప్రసాద్ కంపెనీ ఉద్యోగులతో పాటు మాజీ ఉద్యోగులను విచారించగా సంచలన విషయాలు వెలుగు చూశాయి. ఈ గోల్‌మాల్‌కు కంపెనీలో పనిచేసి మానేసిన లాలాపేట్‌కు చెందిన పట్టి దుర్గాప్రసాద్ (29), ప్రస్తుతం పనిచేస్తున్న వెంగళరావు నగర్‌కు చెందిన జాలెం చంద్రశేఖర్ ప్రసాద్ (29), ఉప్పల్‌కు చెందిన మరో ఉద్యోగి పసల ప్రవీణ్ కుమార్ (29), ఎర్రగడ్డకు చెందిన ఇంకో ఉద్యోగి పరవలి అనిల్ కుమార్ (29)లు నిందితులుగా తేలింది. ఇందులో జాలెం చంద్రశేఖర్ ప్రసాద్ తండ్రి సొంతంగా స్థాపించిన ఓ నిర్మాణ సంస్థకు ఈ కంపెనీ ప్రాజెక్టు వివరాలు వీరు అందజేశారు. దీనివల్ల క్రా ఫ్ట్‌మెన్ ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్టక్చర్‌కు భారీ నష్టం వాటిల్లింది. వీరిపై డాటా చోరీ కేసు నమోదు చేసి నలుగురిని అరెస్టు చేశారు. నిందితుల వద్ద ఒక లాప్ టాప్, నాలుగు సెల్‌ఫోన్లు, ఐదు సిమ్ కార్డులు జప్తు చేశారు. నిందితులను రిమాండుకు తరలించారు.



## ట్రాఫిక్‌జామ్‌తో పుష్కర భక్తుల తిప్పలు

### 10 కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు

**కాళేశ్వరం, మే 24, ప్రభాతవార్త:** కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు పదవరోజు చేరుకున్నాయి. వికెండ్ కావడంతో శనివారం భక్త జనం పుష్కర స్నానానికి పోటెత్తారు. దీంతో శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ పూర్ మండలం మద్దులపల్లి కాళేశ్వరం మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. కాళేశ్వరానికి సమీపంలో 10కిలోమీటర్ల మేర వాహనాలు స్తంభించాయి. 4గంటలుగా ట్రాఫిక్ జామ్ కావడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాగునీరు సౌకర్యం లేక అవస్థలు పడ్డారు. ట్రాఫిక్ లో స్తంభించడంతో కొంతమంది ప్రయాణికులు కాలినడకన పుష్కర ఘాట్లకు చేరుకుంటున్నారు. దీంతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే క్షేత్రస్థాయిలో పాల్గొని ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు వాహనాల రద్దీని నియంత్రిస్తున్నారు.

## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో 9 మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు

### మొదటి సంవత్సరంలో 94 శాతం.. ద్వితీయలో 91 శాతం హాజరు

### ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 22 నుంచి ప్రారంభమైన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మూడో రోజైన శనివారం జరిగిన పరీక్షల్లో మొదటి సంవత్సరం పరీక్షల్లో 5 మాల్‌ప్రాక్టీస్ కేసులు, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 4 కేసులు నమోదైనట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ఫెయిలైన వారికి.. మొదటి సంవత్సరంలో ఇంప్రూవ్‌మెంట్ కోసం పరీక్షలు రాసే వారికోసం నిర్వహించే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 22 రాష్ట్ర వ్యాప్తంగా 892 పరీక్షా కేంద్రాల్లో కొనసాగుతున్నాయి. ఉదయం మొదటి సంవత్సరం పరీక్షలు.. మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతున్నాయి. మూడోరోజైన శనివారం ఉదయం జరిగిన మొదటి సంవత్సరం గణితం పేపర్-1ఏ, బోటనీ పేపర్-1, పొలిటికల్ సైన్స్ పేపర్-1కి సెట్ సిని ఎంపిక చేశారు. పరీక్షలకి 2,16,274 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 2,04,185 మంది(94.41 శాతం) పరీక్షకు హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి. మధ్యాహ్నం జరిగిన సెకండియర్ గణితం పేపర్-2ఏ, బోటనీ పేపర్-2, పొలిటికల్ సైన్స్ పేపర్-2కి కూడా సెట్ సిని ఎంపిక చేశారు. పరీక్షలకి 55,948 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 51,360 మంది(91.79 శాతం) పరీక్షకు హాజరయ్యారు. సెకండియర్‌లో 4 మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదైనట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఒక ప్రకటనలో తెలిపారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 వరకు కొనసాగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు జరగనుండగా.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు కొనసాగుతున్నాయి.

తెలంగాణ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనముల శాఖ
ఎగ్జిక్యూటివ్ (R&B) డివిజన్ కార్యాలయం : సిద్దిపేట

నిట్ నెం. PA/DB/T1/01/2025-26 తేది: 24.05.2025

క్ర.సం.1. పనిపేరు: సిద్ధిపేట జిల్లాలో (పుల్లూరు గ్రామ పరిధిలో) కి.మీ 15/600 నుండి 15/800 R/s బుస్సాపూర్ -తిమ్మాయపల్లి రోడ్‌పై వరదనీటి డ్రైన్‌ల నిర్మాణం. అంచనా విలువ : రూ.22.00 లక్షలు. 1) బిడ్ దాఖలు ముగింపు తేది: 04.06.2025 సా.4.00గం. 2) సంబంధిత EE యొక్క పేరు & చిరునామా : ది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) డివిజన్ : సిద్దిపేట, సిద్దిపేట జిల్లా : ఫోన్ : 9440818096. 3) తదుపరి వివరాలు ఇ ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.

సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) డివిజన్, సిద్దిపేట.

DIPR.NO. 2451-PP/CL/ADVT/1/2025-26 తేది: 24.05.2025

संस्कृति मंत्रालय
भारत सरकार

సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ మరియు ట్రైనింగ్
(భారత ప్రభుత్వ, సాంస్కృతిక మంత్రిత్వశాఖ అధీనం క్రింద)

కల్చరల్ ట్యాలెంట్ సెర్చ్ స్కాలర్‌షిప్ స్కీమ్ - 2025-26

CCRT సంస్థ సాంస్కృతిక ప్రతిభా పరిశోధన ఉపకారవేతన పథకం అమలు ద్వారా 10 నుంచి 14 సంవత్సరాల వయస్సు గ్రూప్‌లోని అసాధారణ ప్రతిభావంతులైన పిల్లలకు (కట్ ఆఫ్ అర్హత తేదీల ప్రకారం) గుర్తింపు గల పాఠశాలలలో గానీ లేదా సంప్రదాయ వృత్తి కళల రూపాలైన వివిధ సాంస్కృతిక రంగాల కుటుంబాలకు చెందిన వారికిగానీ మ్యూజిక్, డ్యాన్స్, డ్రామా, పెయింటింగ్, శిల్పం, వృత్తి నైపుణ్యం మరియు సారస్వత కళలు వంటి అపురూపమైన కళా రూపాలకు ప్రత్యేక ప్రాధాన్యతతో అంతరించి పోతున్న దశలోని కళలకు సౌకర్యాల ప్రోత్సాహం నిమిత్తం వారు ప్రత్యేక శిక్షణ పొందడానికి పథకం చేపట్టింది. ఈ పథకం క్రింద ఒకేసారి రెండు సంవత్సరాలకు ఇచ్చే స్కాలర్‌షిప్, చదువు యొక్క మొదటి యూనివర్సిటీ డిగ్రీ స్థాయి పూర్తి వరకు లేదా 20 సంవత్సరాల వయస్సు వరకు సంతృప్తికరమైన అభివృద్ధి సాధించటం బట్టి ఏది ముందో దాని ప్రకారం ప్రతీ రెండు సంవత్సరాల తర్వాత రెన్యూ చేయబడుతుంది.
ఈ క్రింది వివరాల ప్రకారం ప్రతీ సంవత్సరం 650 స్కాలర్‌షిప్‌లు ఇవ్వబడతాయి.

| | |
|---|---|
| జనరల్ కేటగిరీలు మరియు ఇతరులకు 375 స్కాలర్‌షిప్‌లు | సంప్రదాయ కళాకారుల కుటుంబాల కొరకు 125 స్కాలర్‌షిప్‌లు |
| ST/గిరిజన సంస్కృతి కొరకు 100 స్కాలర్‌షిప్‌లు | వ్యత్యాస సామర్థ్యం (దివ్యాంగజన్)ల కొరకు 20 స్కాలర్‌షిప్‌లు |
| సృజనాత్మక రచనలు/సాహిత్య కళల కొరకు 30 స్కాలర్‌షిప్‌లు | |

ప్రతీ సంవత్సరానికి స్కాలర్‌షిప్ యొక్క విలువ రూ.3,600/- (రూపాయలు మూడు వేల ఆరు వందలు) మరియు ప్రత్యేక శిక్షణ కొరకు చెల్లించే ప్రతీ సంవత్సరానికి అసలు ట్యూషన్ ఫీజు రూ.9000/- (రూపాయలు తొమ్మిది వేలు) వరకు కూడా తిరిగి చెల్లించబడుతుంది. 2025-26 సంవత్సరానికి స్కాలర్‌షిప్‌ల దరఖాస్తుకు 01.07.2011 మరియు 30.06.2015 మధ్య (రెండు రోజులూ కలుపుకొని) పుట్టిన తేదీ గల పిల్లలు అర్హులు. దరఖాస్తు మరియు ఇతర వివరాలు CCRT వెబ్‌సైట్ : www.ccrtindia.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును లేదా ఈ క్రింది చిరునామాలలో దేని నుండైనా పోస్ట్ ద్వారా/వ్యక్తిగతంగా ఉచితంగా పొందవచ్చును.

| | |
|---|---|
| సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్, 15A, సెక్టార్-7, ద్వారక, న్యూఢిల్లీ - 110075, ఫోన్ నం: 011-25088638 ఇమెయిల్ : ddsch.ccrt@nic.in వెబ్‌సైట్ : www.ccrtindia.gov.in | CCRT రీజినల్ సెంటర్, 1-118/ CCRT, సర్వే నం. 64, గూగుల్ కార్యాలయం దగ్గర, మాదాపూర్, హైదరాబాద్ - 500 084 ఫోన్ నం : (040) 23117050 and 23111910 ఇమెయిల్: rchyd.ccrt@nic.in |
| CCRT రీజినల్ సెంటర్, హవాలా ఖుర్ద్, బడ్‌గావ్, ఉదయ్‌పూర్ రాజస్థాన్ - 313001 ఫోన్ నం : (0294) 2430764, 2430771 ఇమెయిల్ : rcud.ccrt@nic.in | CCRT రీజినల్ సెంటర్, 58, జరిపార్, పంజాబారి రోడ్డు, గౌహతి అస్సాం - 781037 ఫోన్ నం. 0361-2330152, ఇమెయిల్ : rcgwt.ccrt@nic.in |
| CCRT రీజినల్ సెంటర్ పాత కలెక్టరేట్ బిల్డింగ్, డిస్ట్రిక్ట్ కోర్ట్ దగ్గర, దామోహ్, మధ్యప్రదేశ్ - 470661 ఫోన్ నం. 07812299187 • ఇమెయిల్ : rcdamoh-ccrt@gov.in | |

సక్రమంగా నింపబడిన దరఖాస్తు ఫారం సంబంధిత డాక్యుమెంట్‌లతో సహా CCRT, న్యూఢిల్లీ-110075కు 30వ జూన్ 2025 సోమవారంన లేదా ముందు చేరవలెను. CCRT ఏవైనా పోస్టల్ ఆలస్యానికి బాధ్యత వహించదు మరియు చివరి తేదీ తర్వాత అందిన దరఖాస్తులు పరిగణించబడవు.

CBC 09127/12/0001/2526

# భూభారతి సదస్సులతో రైతు సమస్యలు తీరేనా?

**అమరవాది సంపత్‌కుమార్**

ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి తాము అధికారంలోకి వస్తే ధరణిని బంగాఖాతంలో కలిపేస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన అనంతరం సిఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ధరణిని రద్దు చేశారు. దాని స్థానంలో భూభారతి పేరుతో మరో చట్టాన్ని తీసుకువచ్చి దాన్ని అమలు చేసే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సేవలను విస్తరించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. భూ భారతి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు.. రాష్ట్ర ప్రభుత్వం భూ చట్టాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక రెవెన్యూ సదస్సులను కూడా నిర్వహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఈ సదస్సులకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. భూ భారతి చట్టం గురించిన ముఖ్యమైన అంశాలపై అవగాహన పొందుతున్నారు. అంతేకాకుండా.. రైతులు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు అక్కడికక్కడే దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. వాటికి త్వరితగతిన పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తున్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి పోర్టల్‌లో వివిధ రకాల భూ సంబంధిత సేవలను రెండు ప్రధాన విభాగాలుగా వర్గీకరించారు. ఇందులో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ (ఖాతా మార్పిడి), రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్ఓఆర్) కరెక్షన్, నాలా (వ్యవసాయేతర భూమి మార్పిడి), అప్పీల్ (సమీక్ష), భూములకు సంబంధించిన సమగ్ర వివరాలు, భూముల మార్కెట్ విలువ, నిషేధిత భూముల జాబితా, ఈచలాన్ అప్లికేషన్ స్టేటస్, రిజిస్ట్రేషన్‌డాక్యుమెంట్స్ వంటి ముఖ్యమైన సమాచారాన్ని తెలుసుకునేందుకు ప్రత్యేక మాడ్యూల్స్‌ను రూపొందించారు. ఈ సేవలు భూ వివరాలను మరింత సులభంగా పొందేందుకు ఉపకరిస్తాయి. అంతేకాకుండా భవిష్యత్తుల భూమిత్ర అనే ఒక ప్రత్యేకమైన ఆప్షన్‌ను కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది ప్రస్తుతం.. భూ భారతి పోర్టల్ పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతంగా కొనసాగుతోంది. ఇందుకోసం ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి మండలం, కామారెడ్డి జిల్లాలోని లింగంపేట మండలం, ములుగు జిల్లాలోని వెంకటాపురం మండలం నారాయణపేట జిల్లాలోని మద్దూరు మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ నాలుగు మండలాల్లో ప్రస్తుతం భూముల క్రయవిక్రయాలు పూర్తిగా భూ భారతి పోర్టల్ ద్వారానే నిర్వహిస్తున్నారు. ఈ పైలెట్ ప్రాజెక్ట్ ఫలితాలను సమీక్షించిన అనంతరం త్వరలోనే రాష్ట్ర వ్యాపంగా దీన్ని జూన్ 2 నుంచి అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. టోల్ ఫ్రీనంబర్ ఏర్పాటు తెలంగాణ ప్రభుత్వం భూముల వ్యవహారాల కోసం ధరణి స్థానంలో భూ భారతి పేరుతో కొత్త పోర్టల్ అందుబాటులోకి వచ్చింది. అయిత ఈ పోర్టల్




మీద చాలా మందికి చాలా సందేహాలు వస్తున్నాయి. అవి ఎవరిని అడగాలో తెలియక ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం.. టోల్‌ఫ్రీ నెంబర్ కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా.. భూమి సమస్యల పరిష్కారంతో పాటు, చాలా సందేహాలను సులభంగా నివృత్తి చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భూముల నిర్వహణ, రిజిస్ట్రేషన్ ప్రక్రియలను మరింత సులభతరం చేసే లక్ష్యంతో కీలకమైన మార్పులు చేపట్టింది. గతంలో ఉన్న ధరణి పోర్టల్‌ను పూర్తిగా మార్చేస్తూ.. కొత్తగా "భూ భారతి' పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈమేరకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించగా.. ఏప్రిల్ 14వ తేదీ నుంచి రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌గా ఈ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ నూతన పోర్టల్ సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో.. భూ భారతి పోర్టల్ వినియోగదారుల సౌలభ్యం కోసం ప్రభుత్వం తాజాగా ఒక టోల్ ఫ్రీ నెంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. పోర్టల్‌ను వినియోగించే సమయంలో ఎదురయ్యే సమస్యలను లేదా విచారణలను ప్రభుత్వం దృష్టికి నేరుగా తీసుకువెళ్లేందుకు వీలుగా 9140 29313999 నెంబర్‌ను ప్రారంభించింది. ఈ టోల్ ఫ్రీ ధరణి.. భూ భారతి తేడాలు ధరణి పోర్టల్‌లో భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవడానికి 33 మాడ్యూళ్లు ఉండేవి. ఒక్కో సమస్యకు ఒక్కో మాడ్యూల్‌ను ఏర్పాటు చేశారు. అయితే అవగాహన లేకపోవటం వల్ల చాలా మంది రైతులు ఒకదానికి బదులు మరో మాడ్యూల్లో అప్లికేషన్ పెట్టుకునేవారు. అధికారులు వాటిని రిజక్ట్ చేసేవారు. దీంతో ప్రతిసారీ రూ.1,200 వెచ్చించి పదేపదే దరఖాస్తు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ మాడ్యూళ్ల సంఖ్యను 6కు తగ్గించారు. భూ భారతి పోర్టల్లో దరఖాస్తు చేస్తే ఇకపై భూ యజమాని ఫోన్ నంబరుకు ఎస్ఎంఎస్‌లు వస్తాయి. రైతుల అప్లికేషన్ స్టేటస్ చూసుకునేలా ట్రాకింగ్ వ్యవస్థ ఉంటుంది. ధరణి పోర్టల్లో భూదస్త్రాలు కనిపించేవి కావు. 2020కి ముందు 32 కాలమ్‌లతో పహాణీ ఉండేది. అందులో భూ యజమాని పేరు, భూ ఖాతా, సర్వే నంబరు ఇలా 32 కాలమ్‌లు ఉండేవి. ధరణిపోర్టల్ ద్వారా రైతు పేరు మాత్రమే ఉండేలా పహాణీని అమలు చేసింది. ఈ క్రమంలో భూముల వివరాల లభ్యత లేక రైతులుఇబ్బందులు పడేవారు. ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా భూ భారతిలో 11 కాలమ్‌లతో కొత్త పహాణీని ఏర్పాటు చేశారు. ఎమ్మార్వో స్థాయిలో భూ సమస్య పరిష్కారం కాకపోతే ఆపైన ఆర్డీవోకు, అక్కడి నుంచికలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చు. కలెక్టర్ ఇచ్చే ఉత్తర్వులతో విభేదిస్తే 30 రోజుల్లో భూ పరిపాలనా ట్రెబ్యునల్‌లో సవాల్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. లీగల్ ఇష్యూస్ పరిష్కారానికి ల్యాండ్ ట్రెబ్యునళ్లు సైతం ఏర్పాటు చేస్తారు. భూ పరిపాలన ట్రెబ్యునల్ కమిషన్‌ను ప్రభుత్వం నియమిస్తుంది. భూ సమస్యల విషయాల్లో రైతులకు న్యాయసలహాలు, సూచనలు ఇచ్చేందుకు సర్కార్‌మండల స్థాయిలో వాలంటీర్లను ఏర్పాటు చేయనుంది. పేదలకు పైసా ఖర్చులేకుండా ఉచితంగా న్యాయ సలహాలు అందిస్తారు. 2017–18లో నాటిప్రభుత్వం చేపట్టిన భూ దస్త్రాల ప్రక్షాళన సందర్భంగా చిన్నచిన్న సమస్య లతో పక్కన పెట్టిన 18 లక్షలఎకరాల భూములకు స్పష్టత తీసుకురానున్నారు. హక్కుల జారీకి భూభారతి చట్టంద్వారా అవకాశం కల్పించనున్నారు. భూ భారతి చట్టంలోని 4(1) సెక్షన్‌ను అనుసరించి రాష్ట్రంలోని గ్రామాల్లో ఉన్న అన్నిరకాల భూముల హక్కుల రికార్డులను రూపొందిస్తారు. డ్రోన్ సాంకేతికతను ఉపయోగించి భూ భాగాలను మ్యాపింగ్ చేయనున్నారు. తెల్లకాగితాలపై ఒప్పందాల ద్వారా (సాదాబైనామా) 2014, జూన్ 2కు ముందు జరిగిన కొనుగోళ్లను క్రమబద్ధీకరిం చాలని ఆర్వోఆర్2024 చట్టం సెక్షన్ 6(1) ద్వారా నిర్ణయించారు. ఆర్డీవో స్థాయిలో విచారణ నిర్వహించి క్రమబద్ధీకరణ ప్రక్రియను నిర్వహిస్తారు. గత ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణి మార్గదర్శకాలే దిక్కు అయిందనే విమర్శలు వస్తున్నాయి. నాడు ధరణిలో పొందుపరిచిన అంశాలనే భూభారతిలో యథాతథంగా ఎత్తిపోసిందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. 33 మాడ్యూల్స్‌ను 6కు తగ్గించామంటూ గొప్పగా ప్రకటిం చిందని, ఇందులోనూ మాయ చేసి ప్రస్తుతం ఉన్న33మాడ్యూ ల్స్‌లోని వివిధ అంశాలన్నింటిని కలిపేసి ఆరు మాడ్యూల్స్‌లో పొందుపరిచిందని,. అన్నీ కలిపేసి మాడ్యూల్స్ తగ్గించామంటూ ప్రకటించేసిందనే విమర్శలు వస్తున్నాయి. ఇందులో ఒకటి రెండు మినహా సర్కారు కొత్తగా చేసిందేమీ లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భూభారతి అమలుకు సంబంధించి మాజీరెవెన్యూ అధికారులు ధరణికి, భూ భారతికి పెద్ద తేడా లేదని కేవలం పేరు మాత్రమేమారిం దనే అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. భూభారతి చట్టంపేరుతో ప్రభుత్వం రైతులపై భారంమోపుతుందనే విమర్శలు వస్తున్నా యి. మ్యుటేషన్ కోసం ఎకరాకు రూ.2,500వసూలు చేయనున్నది. కొత్త పాస్ పుస్తకం కోసం రూ.300 చెల్లించాల్సిందే. ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా తెచ్చిన రికార్డు మార్పులు, ఇతర అప్పీళ్ల కోసం రూ.1,000 ఫీజు సమర్పించుకోవాల్సిందే. అమలుకు ఆలస్యమెందుకు? ●

భూభారతి అంతా సవ్యంగా ఉంటే.. పూర్తిస్థాయిలో అమలు చేయకుండా, ఎందుకు ఆసల్యం చేస్తున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. తొలుత నాలుగు మండలాల్లో మాత్రమే అమలు చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. జూన్ 2వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో అమలు చేస్తామని సర్కారు ప్రకటించింది. అయితే అప్పటి నుంచైనా పూర్తి స్థాయిలో అమలు చేస్తారా, లేదా? అనే సందేహాలు రెవెన్యూ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. రెండు నెలల పాటు అవగాహన సదస్సులు పెట్టాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. దీంతోపాటు గత డిసెంబర్‌లో సర్కారు అసెంబ్లీలోభూభారతి చట్టంచేసింది. తాజాగా పోర్టల్‌ను ప్రారంభించడంతోపాటు మార్గదర్శకాలు విడుదల చేసింది. అంటే చట్టం చేసిన తర్వాత నాలుగు నెలలు అమలులో ఎందుకు జాప్యం చేసిందనే ప్రశ్న వినిపిస్తు న్నది. అదేవిధంగా గ్రామస్థాయిలో రెవెన్యూ సేవలు అందించేందుకు 10,954 మంది గ్రామ పాలన అధికారులను(జీపీవో) నియమి స్తామని సర్కారు ప్రకటించింది. కానీ, వీరి నియామకం పూర్తికాకుండానే పైలట్ ప్రాజెక్టు ను అమలు చేస్తున్నది. అస్తవ్యస్తంగా ఉన్న ధరణిని బంగాళాఖాతంలో కలిపి రైతులకు మేలు చేసేందుకు భూ వివాదాలు లేని తెలంగాణ కోసం భూభారతి చట్టాన్నిఅమలు చేస్తు న్నట్టు కాంగ్రెస్‌సర్కారు గొప్పగా ప్రకటించింది. అయితే సర్కారు పెద్దలు చెప్పే మాటలకు.. చేసే పనులకు పొంతనలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తొలుత నాలుగు మండలాల్లో మాత్రమే అమలు చేయాలని నిర్ణయిం చిన విషయం తెలిసిందే. జూన్ 2వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో అమలు చేస్తామని సర్కారు ప్రకటించింది. అయితే అప్పటి నుంచైనా పూర్తిస్థాయిలో అమలు చేస్తారా, లేదా? అనే సందేహాలు రెవెన్యూ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని భూభారతిలోనూ అమలు చేస్తున్నారు.

# 'సత్యా'నికి పరీక్ష!

జమ్ము కాశ్మీర్

**ఎ.వి.వి ప్రసాద్**

పదవి నుంచి, అధికారం నుంచి వైదొలగిన తర్వాత కూడా 'మిస్టర్ క్లీన్' గా మిగిలే వారు అరుదుగానే కనిపిస్తారు. ముఖ్యంగా గవర్నర్ వంటి ఉన్నత స్థాయి రాజ్యాంగ పదవిలో ఉండి వివాద రహితంగా బయటికొచ్చేవారు ఇప్పుడు మరింత అరుదుగా కనిపిస్తున్నారనే చెప్పాలి. అధికారంలో ఉన్న సమయంలో ఏదో ఒక దశలో ఆరోపణలకు గురికావడం సహజమే అయినా వాటినుంచి కడిగిన ముత్యంలా కొందరే బయటకు రాగలుగుతారు. తాజాగా అటువంటి తీవ్ర ఆరోపణలకు గురై, వాటినుంచి బయటపడలేక ఆసుపత్రిలో పడి ఊపిరందక కొట్టుమిట్టాడుతున్నవారు జమ్ముకాశ్మీర్ (జెకె) మాజీగవర్నర్ సత్యపాల్ మాలిక్. 2018 ఆగస్టు నుంచి2019 అక్టోబర్ వరకు అంటే దాదాపు 14నెలలేఆయన జెకె గవర్నర్‌గా ఉన్నా, ఆ కొద్ది సమయంలోనే ఆయన చాలా తీవ్రమైన అవినీతి ఆరోపణలకు గురికావడం పరిశీలించవలసిన అంశం. ఆ అవినీతితో ఆయనకు సంబంధం ఉన్నదా, లేదా అనేది విచారణ జరుపుతున్న ప్రత్యేక కోర్టు తేల్చవలసి ఉంది. దాదాపు మూడు సంవత్సరాలు క్షుణ్ణంగా, లోతుగా దర్యాప్తు జరిపి గత గురువారం ( 22, మే ) సిబిఐ తన చార్జిషీటును ప్రత్యేక కోర్టుకు సమర్పించింది. దానిలో ప్రధానంగా మాలిక్‌తో పాటు మరో ఆరుగురిపై సిబిఐ తీవ్రమైన దోషారోపణలే చేసింది. 'కిరు' జల విద్యుత్ కేంద్రం టెండర్ల అనుమతి సందర్భంగా కొన్ని వందల కోట్లు చేతులు మారాయనీ, ఆ వ్యవహారంతో మాలిక్‌కు ప్రత్యక్ష సంబంధం ఉన్నదనీ సిబిఐ ఆరోపణ. మూడు సంవత్సరాల పాటు విస్తృతంగా సోదాలు, విచారణలు జరిపి సిబిఐ ఈ చార్జిషీటును రూపొందించింది గనుక దానిలో వాస్తవాలే ఉండవచ్చని చాలామంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆ చార్జిషీటులో చేసిన ఆరోపణలన్నీ అవాస్తవమనీ, వాటితో తనకు ఎలాంటి సంబంధం లేదనీ మాలిక్ అంటున్నారు. ఈ రెండు కోణాల్లో ఏది నిజమన్నది కోర్టు విచారణతర్వాత గానీ చెప్పలేం. అయితే పరిశీలించవలసినఅంశాలు కొన్ని ఉన్నాయి. మాలిక్‌కు ఇప్పుడు 78 యేళ్లు. 2019 అక్టోబర్‌లో జెకె గవర్నర్‌గా పదవీ విరమణ తర్వాత మరో రెండు రాష్ట్రాలకు కూడా ఆయన గవర్నర్ అయ్యారు. దానికి ముందు ఆయనకు సుదీర్ఘ రాజకీయ జీవితమే ఉంది. 1974 నుంచి ఎమ్మెల్యే, ఎంపీ సీట్లకు ఎన్నికవడమే గాక మొత్తం ఐదుసార్లు గవర్నర్‌గాకూడా ఉన్నారు. బీహార్, ఒడిశా, జెకె, గోవా మేఘాలయకు గవర్నర్‌గా చేసినా అన్నీ స్వల్ప కాలమే. యేడాది, రెండేళ్లకు మించి గవర్నర్ పదవిలో ఆయన కొనసాగినట్లు లేదు. ఆయా రాష్ట్రాలకు ఆయన గవర్నర్‌గా ఉన్నప్పుడు కొన్ని వివాదాలలో చిక్కుకున్నా, అవినీతి ఆరోపణలైతే లేవు. కానీ జెకె గవర్నరుగా బయటకు వచ్చిన తర్వాతే కిరు ప్రాజెక్టు కుంభకోణం గురించి వెలుగులోకి రావడం, దానిపై సిబిఐ దర్యాప్తు జరపడం మొదలైంది. నిజానికి దానికి కారణం కూడా ఒకరకంగా ఆయనే అని చెప్పాలి. కిరు జలవిద్యుత్ ప్రాజెక్టుకుసంబంధించిన రెండు ఫైల్స్ అనుమతికోసం తనవద్దకు వచ్చాయనీ, ఆ ప్రాజెక్ట్ కు చెందిన ఓ ముఖ్య వ్యక్తి తనకు రూ.300కోట్ల లంచం ఆఫర్ చేశారనీ, తాను తిరస్కరించినా చివరకు ఆ ప్రైవేటు కంపెనీకే ప్రాజెక్టు దక్కిందనీ తన సత్యసంధత తను నిరూపించుకోడానికో ఏమో! ఆయన ఓ ప్రకటన చేశారు. దానితో 2022 ఏప్రిల్‌లో సిబిఐ దర్యాప్తు మొదలై పలువురు కీలకవ్యక్తులు కొన్ని కంపెనీలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఆతర్వాత విస్తృతంగా జరిపిన దర్యాప్తులో మాలిక్ నివాసం, బంధువుల నివా సాల్లో కూడా సిబిఐ సోదాలు జరిపింది. అప్పటి చీనాబ్ వ్యాలీ పవర్ ప్రాజెక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ చైర్మన్ నవీన్ కుమార్ చౌదరి, ఎంఎస్ బాబు, ఎంకె మిట్టల్, అరుణ్ కుమార్ మిశ్రాతో పాటు కొందరు అధికారులు, నిర్మాణ సంస్థ పటేల్ ఇంజినీరింగ్ పై కూడా కేసు నమోదు చేసింది. తర్వాత అనేక కోణాల నుంచి దర్యాప్తు కొనసాగింది. 2022 అక్టోబర్‌లో మేఘాలయ గవర్నర్‌గా మాలిక్‌పదవీ విరమణ చేసిన తర్వాత సిబిఐ తన దర్యాప్తును ఉధృతం చేసి 2024 ఫిబ్రవరిలో ఢిల్లీ, జెకెలోని ఆయన నివాసాలలో విస్తృతంగా సోదాలు జరిపింది. మాలిక్ సహచరులు, చీనాబ్ వ్యాలీ సంస్థ అధికారులు లక్ష్యంగా ప్రధానంగా సోదాలు జరగడంతో వారికి కీలక ఆధారాలే లభించి ఉంటాయి. గతవారం చార్జిషీటు దాఖలుచేసింది. రీటెండరింగ్ ద్వారా ప్రాజెక్టుకు తిరిగి టెండర్లు పిలవాలని నిర్ణయం తీసుకున్నా అది అమలు కాలేదనీ, చివరికి కాంట్రాక్టును పటేల్ ఇంజినీరింగ్ లిమిటెడ్‌కు అప్పగించారనీ, ఆ క్రమంలోనే అనేక అవకతవకలు జరిగాయనీ సిబిఐ ఆరోపిస్తోంది. మొత్తం రూ.2,200 కోట్ల కుంభకోణమనీ, కిరు ప్రాజెక్టు కాంట్రాక్టును ఒక ప్రైవేటు సంస్థకు అప్పగించడంలో పెద్ద మొత్తంలో డబ్బు చేతులు మారిందని సిబిఐ అంటోంది. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న ప్రకారం, తొలుత గల టెండర్‌ను రద్దు చేసి ఇ టెండరింగ్, రివర్స్ వేలం ద్వారా ప్రక్రియను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించారనీ, చివరికి కాంట్రాక్టును పటేల్ ఇంజినీరింగ్‌కు అప్పగించారనీ, ఆక్రమంలోనే కోటానుకోట్లు చేతులు మారాయనీ దర్యాప్తులో తేలినట్లు సిబిఐపేర్కొంటోంది. ప్రస్తుతం మాలిక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కిడ్నీ డయాలసిస్ జరుగుతున్నదని కూడా తెలుస్తోంది. గతంలో కొందరు గవర్నర్లపై ఇలాంటి అవినీతి ఆరోపణలే వచ్చినా సిబిఐ చార్జిషీట్ దాఖలు చేసిన సందర్భాలు లేవనే చెప్పాలి. ఐదు సార్లు గవర్నర్ పదవిలో ఉన్న మాలిక్ పై సిబిఐ చార్జిషీట్ దాఖలు చేసిందంటే దర్యాప్తు సంస్థ వద్ద తగినన్ని ఆధారాలు ఉండి ఉంటాయనే అనుకోవాలి. మాలిక్ నిజాయితీకి ఇదొక పరీక్ష వంటిదే. ఆయన వయసు రీత్యా కూడా విచారణను త్వరగా పూర్తి చేయవలసిన అవసరం ఉంది. తన నిజాయితీని ఆయన నిరూపించుకోలేక పోతే గవర్నర్‌ఊ వ్యవస్థకే మచ్చ తెచ్చిన వారుగా మిగిలిపోతారు. ●



సత్యపాల్ మాలిక్

# డ్యుటెర్టీకి తప్పని పదవీచ్యుతి

ఫిలిప్పీన్స్

**గన్ని మోహన్**

ఆగ్నేయాసియా దేశంలో ఇప్పుడు కల్లోలం తీవ్ర రూపందాల్చింది. పశ్చిమ పసిఫిక్ మహాసముద్రం వెంబడి ఉన్న ఈ ద్వీపదేశంలో వంశ పారంపర్యంగా వస్తున్న అధికారాలకు కత్తెరపడుతోంది. అవినీతి, ఆశ్రిత పక్షపాతం, నిధుల దుర్వినియోగం వంటి వాటిపై ఇప్పుడున్న ఉపాధ్యక్షురాలు మాజీ అధ్యక్షుడు రోడ్రిగో డ్యుటెర్టీ కుమార్తె సారా జిమ్మర్ మ్యాన్ డ్యుటర్టీకి పదవీగండం ముంచుకొస్తోంది. వచ్చేనెల 3వ తేదీ సారా డ్యుటెర్టీని పదవీచ్యుతి చేసేందుకు అవసరమైన రంగంసిద్ధంఅవుతోంది. వచ్చేనెలలోనే ఈ ఆగ్రహావేశాలు అధికంగా ఉన్న సారా డ్యుటెర్టీ భవిష్యత్తు తేలిపోయే తరుణం వచ్చింది. ఫిలిప్పీన్స్ ఉపాధ్యక్షురాలిగా 2021లో పదవిని స్వీకరించిన సారా తదనంతరం రక్షణ శాఖను తీసుకోవాలని ప్రాధాన్యతచూపిస్తే సంకీర్ణ కూటమిలో ఆమెకు విద్యాశాఖ దక్కింది. అయితే చట్టనిబంధనలను అతిక్రమించి ఇష్టానుసారంగా నిధులు వ్యయంచేసి దుబారా చేసారన్న అభియోగాలతోపాటు అవినీతి, బంధుప్రీతి వంటి అభియోగాలు ఆమెపై లెక్కకు మించి నమోదయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే డ్యూటెర్టీని 316 మంది సభ్యులున్న ప్రతినిధుల సభలో తీవ్రస్థాయి నేరాలకుగాను పదవినుంచి దింపేసారు. మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సంకీర్ణ మిత్రుడు ఫెర్డినాండ్ మార్కోస్‌ను హత్యచేసేందుకు కుట్రచేసారని, అనూహ్యంగా అవినీతికి పాల్పడినట్లు ఆమెపై అభియోగాలున్నాయి. సెనేట్ అధ్యక్షుడు ఫ్రాన్సిస్ ఎస్క్యూడెరో పదవీచ్యుతికి సంబంధించిన విచారణ కొత్తసెనేటర్లు వారి సీట్లలోకి వచ్చినతర్వాత విచారణను ప్రారంభిస్తామని ప్రకటించారు. ఒపక్క మధ్యంతర ఎన్నికలకు వస్తున్న తరుణంలో ఎగువసభ 24 మంది సెనేటర్లు సారా భవిష్యత్తును నిర్దేశించనున్నారు. సెనేట్ అధ్యక్షుడు ఎస్క్యూడెరో స్పీకర్ మార్టిన్ రోమ్యుల్‌డెజ్‌కు ఇప్పటికే విచారణకు సంబంధించిన వివరాలు అందచేసారు. ఎగువసభలో జూన్ రెండున ఆమెపై అభియోగాలు విచారించేందుకు సిద్ధమేనని సంసిద్ధతను కూడా తెలిపారు. ఎగువ సభలో అయితే మెజార్టీ సభ్యులు ఏడు అభియోగాలున్నందున వెంటనే ఆమెను ప్రాసిక్యూట్‌చేసి పదవినుంచి దింపేయాలని కోరుతున్నారు. విచారణ అనంతరం సెనేట్ ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించి పదవీచ్యుతి కోర్టును ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభిస్తుంది. ఇదే సమావేశంలో జూన్3వ తేదీ ఆమెకు సమన్లుజారీచేయాలని నిర్ణయించారు. 24మందిసభ్యులున్న సెనేట్‌లో ఉపాధ్యక్షురాలిగా ఉన్న సారాకు తొమ్మిది ఓట్లు అదనంగా అవసరం అవుతాయి. అవిలేని పక్షంలో ఆమెను తొలగించడం, ఇక ఎన్నికల్లో మరెప్పుడూ పోటీచేయకుండా నిషేధం విధించడం జరుగుతుంది. ఇప్పటికే ఆమె తండ్రి మాజీ అధ్యక్షుడు రోడ్రిగో డ్యుటెర్టీని హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానం అరెస్టుచేసింది. డ్రగ్ మాఫియాను అంతం చేస్తామని ప్రకటించిన ఆనాటి అధ్యక్షుడు రోడ్రిగో డ్రగ్ మాఫియా బృందాలను ఎక్కడికక్కడఅంతం చేసారు. దీనితో ఆయనపై అంతర్జాతీయ న్యాయస్థానం అరెస్టువారంటు జారీచేసి వెంటనే అదుపులోకి తీసుకుంది. ప్రస్తుతం ఆయన జైలులో ఉన్నారు. ఇక వంశపారంపర్య రాజకీయాల్లో వచ్చిన సారా ఉపాధ్యక్షురాలి నుంచి 2028లో జరిగే అధ్యక్ష ఎన్నికలకు సంసిద్ధం అవుతున్న తరుణంలో ఆమెపై వచ్చిన ఈఅవినీతి, హత్యకు కుట్రఅభియోగాలు ఆమె భవిష్యత్తుకు ప్రతిబంధకం కానున్నాయి. 2022లో అధికారంలోకి వచ్చిన సారా మాజీ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్‌తో చేతులు కలిపి ప్రభుత్వం నడుపుతున్నారు. మార్కోస్ ఏకైక కుమారుడు బాంగ్‌బాంగ్ మార్కోస్ ప్రస్తుత అధ్యక్షుడు కావడంతో పాలన సజావుగానే సాగుతుందనుకుంటున్న తరుణంలో విచ్చలవిడి నిధుల దుర్వినియోగం, హత్యకు కుట్రలు వంటి అభియోగాలు ఈసారాను వెంటాడాయి. ఆగ్నేయాసియాలో కేవలం ద్వీప దేశంగా ఉన్న ఈ ఫిలిప్పైన్స్‌కు తైవాన్, జపాన్, పాలావు, ఇండోనేసియా, మలేసియా, వియత్నాం, చైనా వంటి దేశాలు సరిహద్దుల్లో ఉన్నాయి. ఈ దేశానికి భూసరిహద్దులంటూ ఏమీలేవు. దక్షిణ చైనాతోను, వియత్నాం తోను అత్యంత చేరువగా ఉంటుంది. అయితే ఈ దేశంలో నిరంతరం ఉత్తరకొరియా తరహాలోనే వంశపారంపర్య పాలన కొనసాగుతోంది. తండ్రి రోడ్రిగో డ్యూటెర్టీ తర్వాత అధికార వారసత్వం కొనసాగించేందుకు సారా తహతహలాడుతోంది. న్యాయవిద్యను పూర్తిచేసిన తర్వాత 2007లో రాజకీయాల్లోకి వచ్చిన సారా తొలుత ఆమె స్వస్థలం దావోకు వైస్‌మేయర్‌గా ఎన్నికయ్యారు. రోడ్రిగోకు మానస పుత్రికగా కొనసాగిన సారా 2011లోనే కోర్టు సిబ్బంది ఒకరిని మొఖంపై గుద్ది గాయపరిచి వార్తల్లోకి వచ్చారు. తనతండ్రి లాగే అత్యంత కఠినమైన మహిళ అని అప్పటి నుంచే ఆమెపై విశ్లేషణలు కొనసాగాయి. రోడ్రిగో మొదటిభార్య ఎలిజబెత్ జిమ్మర్‌మాన్ కుమార్తె అయిన సారా 1978లో జన్మించింది. అందువల్లనే ఆమె పూర్తి పేరు సారా జిమ్మర్‌మాన్ డ్యుటెర్టీగా రికార్డుల్లో ఉంటుంది. 32ఏళ్ల వయసులో మేయర్‌గా ఆమె గెలిచిన స్థానంలో అప్పటి వరకూ ఉన్న ఆమె తండ్రి రోడ్రిగో ఫిలిప్పీన్స్ అధ్యక్షుడిగా రావడంతో మేయర్ పగ్గాలుసారాకు దక్కాయి. ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్న సారా దేశ ఉపాధ్యక్షురాలిగా వచ్చారు. మరో అనువంశిక పాలకుడు ఫెర్డినాండ్ మార్కోస్ సాయంతో ఆమె పాలనా పగ్గాలు చేపట్టింది. మార్కోస్ జూనియర్ అధ్యక్షుడుగాను, ఆమె ఉపాధ్యక్షురాలిగా పాలన చేపట్టిన మొత్తం సారా చేతుల్లోనే నడిచింది. అప్పటికే డ్రగ్స్‌పై యుద్ధం ప్రకటించిన రోడ్రిగో అరెస్టు అయి జైలులో ఉండటంతో ఇప్పుడు సారా భవిష్యత్తుకు రక్షణ లేకుండాపోయింది. జూన్ మొదటివారంలో ఆమెపై అభియోగాలను ధృవీకరిస్తే ఆమెకు పదవీచ్యుతి అనేది తప్పదు. అదే జరిగితే ఇక డ్యూటెర్టీ కుటుంబం రాజకీయాలకు దూరం అయి తెరవెనుక రాజకీయాలకే పరిమితం అవుతారనడంలో ఎలాంటి సందేహంలేదు. ●




డ్యుటెర్టీ

# ఆరవతరం ఇంకెంత దూరంలో ఉంది?

**డి. జె. మోహనరావు**

ప్రపంచం ఇంకా 5జి టెక్నాలజీ గొప్పతనం, దాని విస్తరణ గురించే చర్చించుకుంటోంది. వేగవంతమైన ఇంటర్నెట్, తక్కువ జాప్యం, మెరుగైన కనెక్టివిటీ అందిస్తోన్న 5జి ఒక విప్లవం. అయినా, ప్రపంచం చూపు ఇప్పటికే తర్వాతి తరం వైపు మళ్లింది. అదే 6జి. ఈ రాబోయే మొబైల్ కమ్యూనికేషన్ టెక్నాలజీ డిజిటల్ అనుభవాలను పూర్తిగా మార్చేస్తుంది. 5జి అందించే దానికంటే చాలా ఎక్కువ సామర్థ్యం దీనికి ఉంది. భారతదేశం లాంటి వేగంగా డిజిటల్ అవుతున్న దేశానికి, 6జిలో మన స్థానం, ఆశయాలు, ముందున్న దారిని అర్థం చేసుకోవడం చాలా కీలకం. భారతదేశం 6జికి ఎంత సిద్ధంగా ఉందో అంచనా వేసే ముందు, అసలు 6జి అంటే ఏమిటో తెలుసుకోవాలి. 5జి సెకనుకు 10 గిగాబిట్ల వేగం, 1 మిల్లీసెకను జాప్యం లక్ష్యంగా పెట్టుకుంది. కానీ 6జి సెకనుకు 1 టెరాబిట్ వేగం –అంటే 5జి గరిష్ఠవేగం కంటే వంద రెట్లు ఎక్కువ – లక్ష్యంగా పెట్టుకుంది. జాప్యం మైక్రోసెకన్లకు పడిపోతుందని అంచనా, అంటే దాదాపు నిజసమయ కమ్యూనికేషన్. 6జి కేవలం వేగం గురించేకాదు, ఇది ఒక సరికొత్తమార్పు. ఇది భౌతిక, డిజిటల్, జీవ ప్రపంచాలను లోతుగా కలిపేస్తుంది. ఎక్కడ చూసినా, దేనికైనా తెలివైన కనెక్టివిటీ దీనితో సాధ్యమవుతుంది. దీని ముఖ్య లక్షణాలు, సంభావ్య ఉపయోగాలు ఇలా ఉంటాయి. అత్యంత వేగం – ఎక్కువ డేటా అవసరమయ్యే పనులకు దాదాపు తక్షణ డేటాబదలీ, అతి తక్కువ జాప్యం – నిజసమయ ఇంటరాక్టివ్ పనులకు, దూరం నుండి శస్త్రచికిత్సలకు, స్వయంప్రతిపత్త వ్యవస్థలకు, వాస్తవిక అనుభవాలకు ఇది కీలకం. అపారమైన కనెక్టివిటీ సాంద్రత – ప్రతి చదరపు కిలోమీటరుకు అద్భుతమైన సంఖ్యలో పరికరాలను కలుపుతుంది, 'ఇంటర్నెట్ ఆఫ్ ఎవ్రీథింగ్' కి ఇది చాలా అవసరం. కృత్రిమ మేధతో కూడిన నెట్‌వర్క్ – 6జి నెట్‌వర్క్‌లు సహజంగా తెలివైనవి, ఇవి తమను తాము మెరుగుపరచుకోవడానికి, వనరులను నిర్వహించడానికి, భద్రతకు, మెషీన్ లెర్నింగ్ వాడతాయి. సెన్సింగ్, ఇమేజింగ్‌తో అనుసంధానం – నెట్‌వర్క్ ఒక పెద్ద సెన్సార్‌లా పనిచేస్తుంది. పర్యావరణ పర్యవేక్షణ, ఆరోగ్య ట్రాకింగ్, స్థానం ఆధారిత సేవలకు ఇది కొత్త మార్గాలను తెరుస్తుంది. కొత్త స్పెక్ట్రమ్ బ్యాండ్‌లు – ఇంతకు ముందు కమ్యూనికేషన్ కోసం వాడని సబ్ టెరాహెర్ట్జ్ , టెరాహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీ బ్యాండ్‌లను వాడతారు. విప్లవాత్మక అప్లికేషన్లు – ఇంటర్నెట్ ద్వారా స్పర్శ అనుభూతి, హోలోగ్రాఫిక్ టెలిప్రెజెన్స్, నిజంగా లీనమయ్యే ఎక్స్‌టెండెడ్ రియాలిటీ, పరిశ్రమలకు, నగరాలకు డిజిటల్ ట్విన్స్, ఎక్కడైనా సెన్సింగ్, మనిషియంత్రం మధ్య అతుకులు లేని సంబంధాలు. ఈ సామర్థ్యాలు ఆరోగ్య సంరక్షణ (దూరం నుండి రోగ నిర్ధారణ, రోబోటిక్ శస్త్రచికిత్స), విద్య (హోలోగ్రాఫిక్ తరగతి గదులు), తయారీ (పూర్తిగా ఆటోమేటెడ్, తెలివైన కర్మాగారాలు), రవాణా (అధిక స్వయం ప్రతిపత్త వాహనాలు), వ్యవసాయం (సూక్ష్మ వ్యవసాయం), వినోదం వంటి రంగాల్లో అద్భుతమైన మార్పులు తెస్తాయి. భారత్ 6జి ఆశయం ఈ సాంకేతిక విప్లవంలో ముందుండటం ఎంత ముఖ్యమో గుర్తించిన భారతదేశం, 6జి కోసం స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. టెలికమ్యూనికేషన్స్ విభాగం 'భారత్ 6జి విజన్' పత్రాన్ని విడుదల చేసింది. ఇది దేశ లక్ష్యాలను, ప్రణాళికను వివరిస్తుంది. ఇతర దేశాల్లో అభివృద్ధి చేసిన 6జి టెక్నాలజీని కేవలం వాడే దేశంగా కాకుండా, దాని రూపకల్పన, ప్రమాణీకరణ, విస్తరణలో గణనీయమైన పాత్ర పోషించడం, కొన్ని రంగాల్లో ప్రపంచ నాయకుడిగా ఎదగడం దీని ప్రధాన లక్ష్యం. ఈ లక్ష్యం అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ ఆమోదించిన 2030 ఫ్రేమ్‌వర్క్ ఆధారంగా రూపొందింది. ఇది ప్రపంచ వ్యాప్తంగా 6జి పరిశోధన, ప్రమాణీకరణకు వేదిక. భారతదేశం ఈ అంతర్జాతీయ ఫోరమ్‌లలో చురుకుగా పాల్గొని, మొబైల్ కమ్యూనికేషన్ ప్రమాణాల భవిష్యత్తును రూపొందించడంలో పాలుపంచుకుంటోంది. 2023లో ప్రారంభమైన ఈ అలయన్స్ టెలికమ్యూనికేషన్ సర్వీస్ ప్రొవైడర్‌లు,



పరిశ్రమ ప్రముఖులు, పరిశోధనా సంస్థలు, విద్యావేత్తలు, ప్రమాణీకరణ సంస్థలను ఒకచోట చేర్చింది. భారతదేశంలో 6జి టెక్నాలజీల పరిశోధన, అభివృద్ధి ప్రాధాన్యతలను గుర్తించడం, సహకారం పెంచడం, వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడం, ఏకాభిప్రాయం సాధించడం, మార్కెట్లో 6జి ని ప్రోత్సహించడం దీని లక్ష్యం. 6జి లక్ష్యం వైపు వివిధ వాటాదారుల ప్రయత్నాలను కలిపే ఒక వేదికగా ఈ అలయన్స్ పనిచేస్తుంది. ప్రభుత్వం పరిశోధన అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమకూరుస్తోంది. 6జికి కీలకమైన కొత్త వేవ్‌ఫార్మ్ టెక్నాలజీలు, అధునాతన యాంటెన్నా డిజైన్ తెలివైన రిఫ్లెక్టింగ్ సర్ఫేస్‌లు, నెట్‌వర్క్ ఆప్టిమైజేషన్ కోసం కృత్రిమ మేధ నెట్‌వర్క్ స్లైసింగ్ పురోగతులు, భద్రతా ప్రోటోకాల్‌లు వంటి రంగాల్లో ప్రాథమిక పరిశోధన చేపట్టడానికి ఐఐటీలు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఇతర ఇంజనీరింగ్ కళాశాలలు, పరిశోధనా కేంద్రాలకు ప్రోత్సాహం, మద్దతు అందిస్తున్నారు. దేశీయంగా 6జి స్టాక్‌ను – భారతదేశంలో అభివృద్ధి చేసిన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ – రూపొందించడంపై కూడా దృష్టిపెట్టారు. ఇది 'ఆత్మనిర్భర్ భారత్' (స్వయం సమృద్ధ భారత్) కార్యక్రమంతో ఏకీభవిస్తుంది. క్లిష్టమైన నెట్‌వర్క్ మౌలిక సదుపాయాల కోసం విదేశీ విక్రేతలపై ఆధారపడటాన్ని తగ్గించడం, జాతీయ భద్రతను పెంచడం, దేశీయ తయారీ అవకాశాలను సృష్టించడం దీని లక్ష్యం. 2025 ప్రారంభం నుండి మధ్యకాలం వరకు చూస్తే, 6జి టెక్నాలజీ ప్రపంచవ్యాప్తంగా ఇంకా పరిశోధన, ఆలోచనల దశలోనే ఉందని అర్థం చేసుకోవడం ముఖ్యం. ప్రపంచంలో ఎక్కడా పెద్దఎత్తున వాణిజ్య విస్తరణలు లేదా పెద్ద ఎత్తున పరీక్షలు కూడా ఇంకా జరగలేదు. భారతదేశంలో పరిస్థితి ఈ ప్రపంచ వాస్తవికతకు అద్దం పడుతోంది. ప్రస్తుతం దృష్టి దీనిపై ఉంది. ప్రాథమిక పరిశోధన – సంభావ్య 6జి టెక్నాలజీల సైద్ధాంతిక భావనలను అన్వేషించడం, సిమ్యులేషన్‌లను అమలు చేయడం, ప్రారంభ ప్రయోగశాల ప్రయోగాలు చేయడం, నైపుణ్యం అభివృద్ధికి అవసరమైన అధునాతన రంగాలలో పరిశోధకులకు, ఇంజనీర్లకు శిక్షణ ఇవ్వడం, సహకారం, అలయన్స్ లాంటి వేదికల ద్వారా విద్యావేత్తలు, పరిశ్రమ, ప్రభుత్వ సంస్థల మధ్య పరస్పర చర్యలను సులభతరం చేయడం, వినియోగ సందర్భాలను గుర్తించడం – భారతదేశానికి ప్రత్యేకంగా ప్రయోజనకరమైన 6జి ఉపయోగాలను అన్వేషించడం. భారతదేశం ఇంకా 5జి విస్తరణలో చాలా కష్టపడుతోంది. ఇది దేశవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోంది. వివిధ భౌగోళిక, జనాభా పరిస్థితులలో 5జి నెట్‌వర్క్‌లను విస్తరించి, ఆప్టిమైజ్ చేయడంలో పొందిన అనుభవం, భవిష్యత్తులో 6జికి మారడానికి విలువైన పాఠాలు నేర్పుతుంది. కాబట్టి, 'భారతదేశంలో 6జి ఎంత దూరంలో ఉంది?' అనే ప్రశ్నకు నేరుగా సమాధానం విస్తృత విస్తరణ లేదా పెద్ద ఎత్తున పరీక్షలు కూడా ఇంకా చాలా సంవత్సరాల దూరంలో ఉన్నాయి. భారతదేశం ప్రస్తుతం క్రియాశీల ప్రణాళిక, ప్రారంభ దశ పరిశోధనలో ఉంది. ప్రపంచ పరిశోధన అభివృద్ధి ప్రణాళికలకు అనుగుణంగా తన ప్రయత్నాలను సమన్వయం చేసుకుంటోంది. స్పష్టమైన లక్ష్యం, క్రియాశీల చర్యలు ఉన్నప్పటికీ, భారతదేశం 6జి మార్గంలో గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. అధునాతన మౌలిక సదుపాయాలు, ఫ్రీక్వెన్సీలు, అధునాతన అనుసంధానంతో పనిచేయగల అత్యాధునిక పరిశోధనా సదుపాయాలను అభివృద్ధి చేయడానికి భారీ పెట్టుబడులు అవసరం. నైపుణ్యం కలిగిన మానవశక్తి – 6జికి అవసరమైన అత్యంత ప్రత్యేక రంగాలలో నైపుణ్యం కలిగిన పరిశోధకులు, ఇంజనీర్లకు ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంలో కూడా గణనీయ మైన కొరత ఉంది. దా అప్లికేషన్ అభివృద్ధిలో కొన్ని ప్రాంతాల్లో భారతదేశం నాయకత్వం వహించే అవకాశం ఉంది. 6జి కొత్త పరిశ్రమలను ప్రారంభిస్తుంది, లక్షలాది ఉద్యోగాలను సృష్టిస్తుంది, అన్నిరంగాలలో డిజిటల్ మార్పును నడిపిస్తుంది, భారతదేశ ఆర్థికవ్యవస్థను గణనీయంగా పెంచుతుంది. మెరుగైన డిజిటల్ కనెక్టివిటీ – మరింత సరసమైన, ఎక్కడైనా ఉండే కనెక్టివిటీ డిజిటల్ అంతరాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది, మారుమూల ప్రాంతాలు, అట్టడుగు వర్గాలను డిజిటల్ ప్రపంచంలోకి తీసుకువస్తుంది. వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి –స్వదేశీ సామర్థ్యాలనుఅభివృద్ధిచేయడం విదేశీ టెక్నాలజీలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. ●

# సింధుజలాల ఒప్పందంపై పాక్ విషప్రచారం

## ఐక్యరాజ్యసమితిలో దాయాది తీరును ఎండగట్టిన భారత్ ప్రతినిధి

**న్యూయార్క్, మే 24:** సింధు నదీజలాల ఒప్పందంపై పాకిస్తాన్ తప్పుడు ప్రచారం చేస్తోందని శనివారం ఐక్యరాజ్యసమితిలో భారత్ ధ్వజమెత్తింది. జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంవ్‌లో ఉగ్రదాడి తర్వాత సింధుజలాల ఒప్పందంనుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించిన భారత్ నదీజలాలను నిలిపివేసింది. సమితిలో భారత శాశ్వత రాయబారి పర్వతనేని హరీష్ మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని వీడేంతవరకూ ఈ నదీ జలాలు రద్దు ఒప్పందం అలాగే కొనసాగుతుందని తెలిపారు. పాకిస్తాన్‌ప్రతినిధి నదీజలాల ఒప్పందంపై భారత్‌ను విమర్శించడంతో వెంటనే స్పందించిన హరీష్ పాక్ వైఖరిని ఎండగట్టారు. పాకిస్తాన్ ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదం వల్ల భారత్‌లో ఇప్పటివరకూ 20 వేల మంది అమాయకపౌరులు చనిపోయారన్నారు. గతనెలలోనే 26 మంది అమాయక పర్యాటకులను పొట్టన పెట్టుకున్నారని వీరంతా పాకిస్తాన్ ప్రాయోజిత తీవ్రవాదులేనని ఆయన ఆరోపించారు. 65 ఏళ్లక్రితం మంచి నమ్మకంతో నదీజలాల ఒప్పందంలోకి వచ్చిందని, స్నేహపూర్వక వాతావరణంలోనే జరుగుతుందని ఆనాడుభావించామన్నారు. 65 ఏళ్లుగా పాకిస్థాన్ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, మూడు యుద్ధాలుచేసి ఓడినా, వేలాదిగా ఉగ్రదాడులు భారత్‌పై జరుపుతూనే ఉందని ఆరోపించారు. గడచిన నాలుగు దశాబ్దాల్లో ఉగ్రదాడుల వల్ల 20 వేలమంది ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. భారత్‌ఎంతో ఓర్పు సంయమనంతో వ్యవహరించిందని, పాకిస్థాన్ ప్రాయోజిత సరిహద్దు ఉగ్రవాదం భారత్‌లో అమాయక పౌరులను బలితీసుకుంటున్నదని, మతసామరస్యాన్ని దెబ్బతీస్తోందని, ఆర్థిక అభ్యున్నతికి గండంగా మారిందని అన్నారు. దీనివల్ల స్వచ్ఛ ఇంధన ఉత్పత్తి, వాతావరణంలో మార్పులు, భౌగోళిక మార్పులు అనేకం సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసారు. పాతబడిన డ్యామ్‌లకు తక్షణ మరమ్మతులు అవసరమని, కొన్నింటినీ భద్రత రీత్యా పునర్నిర్మించాల్సిన అవసరంఎంతో ఉందని అయినా కూడా పాకిస్తాన్ ఈమార్పులను అడ్డుకుంటూ వస్తోందని ఆరోపించారు. మౌలికవనరుల కల్పనలోనూ పాకిస్తాన్ భారత్‌కు వ్యతిరేకంగానే స్పందించిందన్నారు. 2012లో ఉగ్రవాదులు తుల్బుల్ నేవిగేషన్ ప్రాజెక్టుపై దాడిచేసారన్నారు. ఇలాంటి ఈర్ష్యపూరిత దాడులు పౌరులు, విలువైన ప్రాజెక్టుల భద్రతకు ముప్పు తెస్తాయన్నారు. గతరెండేళ్లుగా కొన్ని మార్పులు అవసరమని పాకిస్తాన్‌తో సంప్రదిస్తూనే ఉన్నామని పాకిస్తాన్ వ్యతిరేకిస్తూ వచ్చిందని, నిరంతరం అడ్డుకునే వైఖరితోనే ఉన్న పాకిస్తాన్‌కు సింధుజలాలను వినియోగించుకునే హక్కు ఉండదని ఆయన వాదించారు. దీనికితోడు ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్తాన్ ఉగ్రనిర్మూలన పూర్తిగా చేసినపుడే సింధుజలాల ఒప్పంద అమలుకు తెస్తామని అప్పటివరకూ పెండింగ్‌లోనే ఉంటుందని అన్నారు. సరిహద్దు ఉగ్రవాదానికి పెట్టింది పేరుగా పాకిస్తాన్ నిలుస్తోందని హరీష్ ఆరోపించారు.





### సరిహద్దుల్లోని పూంచ్ జిల్లాలో
# పర్యటించిన రాహుల్‌గాంధీ

**పూంచ్, మే 24:** పాకిస్తాన్ రేంజర్లు, ఉగ్రదాడులకు పూర్తిస్థాయిలో ధ్వంసం అయిన సరిహద్దు గ్రామాల్లో ఎఐసిసి నాయకుడు రాయ్‌బరేలి ఎంపి రాహుల్‌గాంధీ పర్యటించారు. ఇదొక పెద్ద విషాదమని సరిహద్దు గ్రామాలప్రజల దీనగాథలను దేశవ్యాప్తంగా ప్రజలకు తెలియజెప్పాల్సిన అసరం ఉందన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ పూంచ్ పట్టణంలో పర్యటించి ఒక గంటసేపు అక్కడిప్రజలతో ముచ్చటించారు. ఈనెల ఏడునుంచి పదితేదీల మధ్యలో బాంబులు, తుపాకి బుల్లెట్లకు దెబ్బతిన్న ఇళ్ల యజమానులతోనే ఆయన ఎక్కువసేపు గడిపారు. ఎంతోమంది ప్రజలు తమ ప్రాణాలు కోల్పోయారు. పాకిస్తాన్ ఆర్మీ పౌర నివాసాలనే ఎక్కువ టార్గెట్‌చేసుకుందని ఆయన విమర్శించారు. జాతీయ స్థాయిలో అంటే పార్లమెంటులో కూడా తమకు జరిగిన నష్టం, సమస్యలను ప్రస్తావించాలని తనను కోరినట్లు రాహుల్ చెప్పారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబసభ్యులు, దెబ్బతిన్న ఇళ్లు, చెల్లాచెదురయిన విలువైనవస్తువుల దృశ్యాలు తనను కలిచివేసాయన్నారు. నాలుగురోజుల యుద్ధం తరహా దాడిలో ఎంతో ధైర్యసాహసాలు చూపించిన ఈగ్రామాల ప్రజలకు ఆయనసెల్యూట్‌చేస్తున్నానన్నారు. బాధిత కుటుంబాలతరపున నిలబడతామని, వారి పునరుజ్జీవనానికి పూర్తి అండగా నిలుస్తామని అన్నారు. జమ్ముకాశ్మీర్‌యూనిట్ అధ్యక్షుడు తరిఖ్ హమీద్ కర్రా, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జిఎ మీర్ఇతర సీనియర్లు వెంటరాగా ఆయన పూంచ్‌గ్రామాలనుపరనయటించారు. గతనెల 25వ తేదీ కూడా గాంధీ శ్రీనగర్‌లో పర్యటించారు. జమ్ముకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్‌సిన్హాను కూడా కలిసి చర్చలుజరిపారు. అలాగే ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఇతర కీలక ప్రభుత్వ మంత్రులను కూడా కలిసి చర్చలుజరిపారు. జమ్ముఎయిర్‌పోర్టునుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో సరిహద్దుగ్రామం అయిన పూంచ్‌ప్రాంతానికి వెళ్లారు. ఆపరేషన్ సింధూర్ దాడులతో పాకిస్తాన్ సరిహద్దు గ్రామాల ప్రజల ఇళ్లు, ప్రార్థనా మందిరాలే లక్ష్యంగా దాడులు జరిపిన సంగతి తెలిసిందే. పాకిస్తాన్ జరిపిన కాల్పులవల్ల సరిహద్దుల్లో 28 మంది చనిపోయారు. ఒక్క పూంచ్ జిల్లాలోనే 13 మంది చనిపోయారని, 70 మందికిపైగా తీవ్రగాయాల పాలయ్యారని రాహుల్ చెప్పారు. వాస్తవాధీన రేఖ, సరిహద్దుగ్రామాలవెంబడి ఉన్న అనేక కుటుంబాలు ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు. మూడురోజుల దాడుల తర్వాత పాకిస్తాన్ కాల్పుల విరమణకు ముందుకురావడంతో ప్రస్తుతం వాతావరణం స్తబ్దుగా ఉంది. పిసిసి చీఫ్ కర్రా మాట్లాడుతూ గురుద్వారా, దేవాలయం, మదర్సా, క్రైస్తవ మిషనరీ స్కూలును కూడా రాహుల్ సందర్శించారని బాధిత కుటుంబాలు, ఇతర పౌర సంఘాలప్రతినిధులతో మాట్లాడినట్లు తెలిపారు. దెబ్బతిన్న సరిహద్దుగ్రామాల్లో ఆపరేషన్ సింధూర్ తర్వాత పర్యటించిన మొదటి జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ. గతనెలలో పర్యటనలోనే రాహుల్ మాట్లాడుతూ ఉగ్రదాడులతో దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారని, ఇలాంటి విపత్కర తరుణంలోనే దేశం మొత్తం సమైక్యంగా నిలిచి ఉగ్రవాద నిర్మూలనకు అండగా నిలుస్తుదని ప్రకటించిన సంగతి తెలిసిందే.



## బాలికపై లైంగికదాడి చేసిన సాధువు అరెస్టు

**బెలగావి, మే 24:** కర్ణాటకలోని బెలగావి జిల్లాలో ఉన్న రామ్‌మందిర సాధువును పోలీసులు అరెస్టుచేసారు. 17 ఏళ్ల బాలికను ప్రలోభపెట్టి తన కారులో ఇంటివద్ద వదిలిపెడతానని నమ్మించి ఆపై ప్రైవేటు లాడ్జికి తీసుకెళ్లి బలవంతంగా లైంగిక దాడిచేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలు మొత్తం వివరాలను తల్లితండ్రులకు చెప్పడంతో ఈసాధువుపై పోలీసులకు ఫిర్యాదుచేసారు. నిందితుడు లోకేశ్వర మహరాజ్‌గా గుర్తించారు. మేఖాలి గ్రామంలోని రామ్‌మందిరంలో ఉంటున్నట్లు తెలిపారు. బెంగళూరుకు 500 కిలోమీటర్ల దూరంలో ఈ మందిరం ఉంది. బాలికను ప్రలోభపెట్టి బాగల్‌కోట్‌లోని ఒక లాడ్జికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు తేలింది. ఆ తర్వాత ఆమెను రాయ్‌చూపర్‌కు తీసుకెళ్లి మళ్లీ లైంగిక దాడిచేసినట్లు పోలీసులు తెలిపారు. తర్వాత ఆమెను బాగల్‌కోట్‌జిల్లాలోని మహాలింగపూర్ బస్టాండ్‌లో దించివెళ్లిపోయాడని బెలగావి ఎస్పీ డా.భీమశంకర్ ఎస్ గులేద్ తెలిపారు. పోక్సో చట్టం కింద నవానగర్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదుచేసారు. బాధితురాలు జరిగినఘోరాన్ని తల్లితండ్రులకు వివరించింది. దీనితో వెంటనే బాగల్‌కోట్ పోలీసులకు ఫిర్యాదుచేసారు. అయితే ఈప్రాంతం తమ పరిధిలో లేకపోవడంతో కేసును బెలగావికి బదలాయించి నిందితుడిని అరెస్టు చేసారు. చివరకు ఈకేసును మూదలాగి పోలీస్‌స్టేషన్‌కు బదిలీచేసినట్లు ఎస్పీతెలిపారు. నిందితుడిని అరెస్టుచేసిన ప్రాంతం అయినందున ఆస్టేషన్ లోనే కేసును రిజిస్టరు చేసామన్నారు.

## ఎయిర్‌ఫోర్స్,బిఎస్‌ఎఫ్ సమాచారం పాక్‌కు చేరవేస్తున్న యువకుడి అరెస్టు



**అమ్మదాబాద్, మే 24:** భారత వాయుసేన, సరిహద్దుభద్రతా దళాలకు సంబంధించిన కీలకసమాచారం పాకిస్తాన్ నిఘా సంస్థలకు చేరవేస్తున్నాడన్న అభియోగాలతో గుజరాత్‌కు చెందిన సహదేవ్‌సింగ్ గోహిల్‌ను పోలీసులు అరెస్టుచేసారు. గుజరాత్ యాంటి టెర్రరిజమ్ స్క్వాడ్ అధికారి కె సిద్ధార్థ్ మాట్లాడుతూ భారత్ భద్రతా బలగాలకు సంబంధించిన సున్నిత రహస్య సమాచారాన్ని పాక్ వేగులకు చేరవేస్తున్నట్లు గుర్తించామన్నారు. 28 ఏళ్ల గోహిల్‌ను ఒక ఏజెండ్ సంప్రదించిందని, అదితి భరద్వాజ్ అనే ఆమె 2023లో వాట్సాప్‌ద్వారా పరిచయం అయిందన్నారు. ఐఎఎఫ్; బిఎస్‌ఎఫ్ సైట్లకు సంబంధించిన కొన్ని ఫోటోలను విడియోలను ఆమెకు పంపించాడు. కొన్ని నిర్మాణం పూర్తి అయినవి, నిర్మాణంలో ఉనన కట్టడాలను కూడా ఫోటోలు విడియోలు పంపించినట్లు నిందితుడు అంగీకరించాడు. పాకిస్తానీ ఏజెంట్‌తో కీలకమైన సమాచారాన్ని పంచుకుంటున్నట్లు తెలిపారు. ఈనెల ఒకటవ తేదీ ప్రాథమిక దర్యాప్తుకోసం పిలిపించారు. ఎస్‌టిఎఫ్ పాకిస్థానీ ఏజెంట్ ఆతడిని ఐఎఎఫ్, బిఎస్‌ఎఫ్ నిరానమణాల ఫోటోలు విడియోలు కోరినట్లు అంగీకరించాడు. 2025 ప్రారంభంలోనే ఆధార్‌కార్డుసాయంతో సిమ్‌కార్డు కొనుగోలుచేసి వాట్సాప్ యాక్టివేట్ చేసాడని అదితి భరద్వాజ్‌కోసం ఒటిపి సాయంతో చేసినట్లు తేలింది. ఆ తర్వాత అన్ని ఫోటోలు, విడియోలు పంపించడం ప్రారంభించినట్లు ఎటిఎఫ్ అధికారి సిద్ధార్థ్ తెలిపారు. గోహిల్ తరచూ చేసిన నంబర్లు పాకిస్తాన్ కేంద్రంగా ఉన్నట్లు గుర్తించామని, అంతేకాకుండా గోహిల్‌కు 40 వేల నగదును గుర్తుతెలియని వ్యక్తినుంచి అందాయని తెలిపారు. పహల్గాంవ్‌లో దాడి జరిగిన తర్వాతనుంచే ఈ సంప్రదింపులు, సంభాషణలు పెరిగాయని అధికారులు గుర్తించారు. ఇప్పటివరకూ ఇదే తరహాలో పాక్‌కు సమాచారం చేరవేసిన పదిమందిలో గోహిల్ కూడా ఒకడు.

# ఆర్మీచీఫ్‌కు వ్యతిరేకంగా యూనస్ మద్దతుదారుల ర్యాలీలు


## ఇస్లామిస్టు, విద్యార్థినేతల మద్దతు కూడగట్టే పనిలో యూనస్

**ఢాకా, మే 23:** బంగ్లాదేశ్‌లో మళ్లీ రాజకీయ సంక్షోభం రాజుకుంటున్నది. తన పదవికి రాజీనామా చేస్తానని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మొహమ్మద్ యూనస్ హెచ్చరించినట్లు వినవస్తున్న నేపథ్యంలో దీనికి నిరసనగా రాజధాని ఢాకాలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన మద్దతుదారులు ప్రకటించారు. యూనస్‌ను ఐదేళ్లపాటు పదవిలో ఉంచాలి, ముందు సంస్కరణలుతర్వాతే ఎన్నికలు అంటూ నిరసనకారులు తమ పోస్టర్లలో డిమాండు చేశారు. ఈ ఏడాది డిసెంబర్‌లోగా దేశంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ వకార్‌ఉజ్ జమాన్ పిలుపునిస్తూ దేశ భవిష్యత్తును నిర్ణయించే అధికారం ప్రజా ప్రభుత్వానికి మాత్రమే ఉంటుందని పునరుద్ఘాటించిన నేపథ్యంలో తన పదవికి రాజీనామా చేస్తానని యూనస్ హెచ్చరించినట్లు ప్రచారం జరిగింది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా బంగ్లాదేశ్ అనధికార ప్రధానమంత్రిగా కొనసాగుతున్న యూనస్ పదవీకాలం ముగిసిపోతుంది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో శనివారం యూనస్ మద్దతుదారులు ఆర్మీ కంటోన్మెంట్ వరకు నిర్వహించే ర్యాలీ ఎటువంటి హింసాత్మక ఘటనలకు దారితీస్తుందోనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతున్నది. విద్యార్థుల ఉద్యమం హింసాత్మకంగా మారిన దరిమిలా సైన్యం నుంచి వచ్చిన ఒత్తిళ్లకు తలొగ్గి రాజీనామా చేసిన ప్రధాని షేక్ హసీనా గత ఏడాది ఆగస్టు 5న దేశం విడిచి భారత్‌కి పారిపోయారు. ఆర్మీ చీఫ్‌కి వ్యతిరేకంగా మరో ఉద్యమాన్ని నిర్వహించాలన్న ఆలోచనతోనే యూనస్ రాజీనామా బెదిరింపులు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ప్రస్తుత రాజకీయ వాతావరణం, నిరసనల మధ్య తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేకపోతున్న కారణంగానే రాజీనామా చేయాలని యూనస్ యోచిస్తున్నట్లు విద్యార్థులు ఏర్పాటు చేసుకున్న నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్‌సీపీ) కన్వీనర్, విద్యార్థి ఉద్యమ నాయకులలో ఒకరైన నహీద్ ఇస్లామ్ తెలిపారు. ఎన్‌సీపీకి సారథ్యం వహించేందుకు నహీద్ ఫిబ్రవరిలో యూనస్ క్యాబినెట్‌కి రాజీనామా చేశారు. గురువారం సాయంత్రం ప్రభుత్వ అతిథి గృహం జమునలో యూనస్‌తో సమావేశమైన నహీద్ పదవిలో కొనసాగవలసిందిగా అభ్యర్థించారని సమావేశానికి హాజరైన మరో ఎన్‌సీపీ నాయకుడు అరిఫుల్ ఇస్లాం అదీబ్ తెలిపారు. తాను పదవిలో కొనసాగలేనని, మరో ఆపద్ధర్మ ప్రభుత్వాన్ని విద్యార్థి నాయకులే ఏర్పాటు చేసుకోవాలని యూనస్ కోరినట్లు తెలుస్తోంది. విద్యార్థులు, ఇస్లామిస్టు మూకలను తన సొంత సైన్యంగా వాడుకుంటున్న యూనస్ ఎన్నికలు నిర్వహించకుండా అధికారంలో కొనసాగాలని ప్రయత్నిస్తున్నట్లు జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి. 2026 జూన్‌లోగా ఎన్నికలు జరుగుతాయని యూనస్ చెబుతున్నప్పటికీ బీఎన్‌పీతోసహా వివిధ రాజకీయ పార్టీలు సత్వర ఎన్నికలను కోరుతున్నాయి.



## రాహుల్‌పై జార్ఖండ్ కోర్టు నాన్‌బెయిలబుల్ వారంట్ జారీ

**రాంచి, మే 24:** లోక్‌సభలో ప్రతిపక్షనేత రాయ్‌బరేలి ఎంపి రాహుల్‌గాంధీకి జార్ఖండ్‌లోని చాయ్‌బాసా ఎంపి ఎమ్మెల్యే కోర్టు నాన్‌బెయిలబుల్ వారంట్ జారీచేసింది. 2018లో నమోదయిన పరువునష్టం కేసుకు సంబంధించి ఈ వారంట్లు జారీచేసింది. వచ్చేనెల 26వ తేదీ జరిగే వాయిదాకు విధిగా రాహుల్ హాజరుకావాలని ఆదేశించింది. రాహుల్‌గాంధీ లీగల్‌టీమ్ దాఖలుచేసిన హాజరు మినహాయింపు పిటిషన్‌ను జడ్జి తిరస్కరించారు. 2018 కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాల్లో రాహుల్ గాంధ్యీ వ్యాఖ్యలపై ఈ పిటిషన్ దాఖలయింది. బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాగురించి మాట్లాడుతూ హత్యచేసిన అభియోగాలు ఎదుర్కొంటున్న అందరూ కూడా బిజెపి అధ్యక్షుడు అవుతున్నారని తీవ్రస్థాయిలో చేసారు. దీనితో బిజెపి నాయకుడు ప్రతాప్ కటియార్ పరువునష్టం పిటిషన్‌ను దాఖలుచేసారు. 2018 జులై 9న చాయ్‌బాసా చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో దాఖలయింది. ఆ తర్వాత జార్ఖండ్‌హైకోర్టు ఈ కేసును ఎంపిఎమ్మెల్యే కోర్టుకు బదలాయించింది. ఆటుపిమ్మట అక్కడి నుంచి చాయ్‌బాసా ఎంపి ఎమ్మెల్యే కోర్టుకు బదిలీచేసారు. కేసు విచారణకు అంగీకరించిన తర్వాత మేజిస్ట్రేట్ రాహుల్ గాంధీకి సమన్లు జారీచేసారు. అనేకసార్లు సమన్లు జారీ అయినా రాహుల్ కోర్టుకు రాలేదు. దీనితో నాన్‌బెయిలబుల్ వారంట్ జారీచేసారు. జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించిన రాహుల్ లీగల్ టీమ్ వారంట్‌పై స్టే కోరింది. అయితే గత ఏడాది మార్చిలోనే 20వ తేదీ హైకోర్టు పిటిషన్ డిస్మిస్‌చేసింది. అలాగే చాయ్‌బాసాకోర్టుకూడా తీవ్రంగా వ్యతిరేకించింది. ఇపుడు ఎంపి ఎమ్మెల్యేలకేసుల విచారణ ప్రత్యేక కోర్టుకూడా కఠిన వైఖరిని అవలంభించి రాహుల్ జూన్ 26వ తేదీ విచారణకు హాజరుకావాలని నాన్‌బెయిలబుల్ వారంట్లు జారీచేసింది.



## బాలీవుడ్ నటుడు ముకుల్‌దేవ్ కన్నుమూత


**ముంబయి, మే 24:** ప్రముఖ సినీ, టీవీ నటుడు ముకుల్ దేవ్ కన్నుమూశారు. అనారోగ్యంతో ఆయన తుది శ్వాస విడిచినట్లు సన్నిహితులు, కుటుంబ సభ్యులు శనివారం తెలిపారు. ఆయన కొంతకాలంగా ఆనారోగ్యంతో బాధడుతున్నట్లు సన్ ఆఫ్ సర్దార్2 చిత్రంలో ముకుల్ దేవ్‌తో కలిసి పనిచేసిన నటుడు విందు దారా సింగ్ పేర్కొన్నారు. ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం అర్థరాత్రి పరిస్థితి విషమించి చనిపోయిటన్లు వైద్యులు ధృవీకరించారు. ముకుల్ దేవ్ హిందీ, తెలుగు, కన్నడ, పంజాబీ సహా పలుభారతీయ భాషల్లో నటించారు. తెలుగులో ఆయన ఎక్కువగా విలన్ పాత్రలు పోషించారు. కృష్ణ, ఏక్ నిరంజన్, భాయ్, మనీ మనీ మోర్ మనీ, సిద్ధం, కేడీ, అదుర్స్ లాంటి చిత్రాల్లో ఆయన కీలక పాత్రల్లో నటించారు. అలాగే, ఆయన తన కెరీర్‌ను టెలివిజన్ ద్వారా ప్రారంభించారు. ఆయన టెలివిజన్ రంగంలోనూ చాలా పాపులర్. ముకుల్ దేవ్ మరణంతో సినీ, టీవీ వర్గాల్లో విషాదం నెలకొంది. ముకుల్ దేవ్ మరణంపై విందు దారా సింగ్ మాట్లాడుతూ తన తల్లిదండ్రుల మరణంతర్వాత ఆయన డిప్రెషన్‌లోకి వెళ్లాడని, ఇంటి నుంచి బయటకు రాలేదని, ఎవరినీ కలవలేదని చెప్పారు. గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నట్లు వివరించారు.

# 'సిందూర్' దాడిలో 200 మంది మృతి

## పాక్‌లో మరణించిన వారి వివరాలు తెలిపిన భారత్ రక్షణ అధికారులు

**న్యూఢిల్లీ, మే 24:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో గతనెల 22న పర్యటకులపై జరిగిన ఉగ్రదాడికి, ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైంది. అయితే దీనికి సంబంధించి రక్షణ శాఖ ఉన్నత వర్గాలు తాజా వివరాలను వెల్లడించాయి. భారత్ పాకిస్థాన్ పై మే7న జరిపిన దాడిలో 200 మందికి పైగా మరణించారని, పాక్‌లోని కీలక ఉగ్రస్థావరాలు, బహవల్‌పుర్ ధ్వంసమైందని పేర్కొన్నాయి. ఈ దాడిలో 170 మందికి పైగా ఉగ్రవాదులు మరణించారు. ఈ దాడిలో ఏడుగురు భారత సైనికులు ప్రాణాలు కోల్పోగా, 42 మంది పాక్ సైనికులు మరణించారు. భారత్ చేసిన వైమానిక దాడికి ప్రతిచర్యగా పాక్ డ్రోన్లు, క్షిపణులతో దాడి చేయగా, ఇరుదేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో భారత్ గొప్ప విజయాన్ని సాధించిందని రక్షణ శాఖ వర్గాలు పేర్కొన్నాయి. పాక్ వైమానిక స్థావరాలపై విరుచుకుపడి దాయాది దేశ ఉగ్రస్థావరాలను మట్టికురిపించాయి. జైషే మహ్మద్ ఉగ్రముఠా ప్రధాన కేంద్రం ధ్వంసమైంది. ఈ దాడిలో భారత మహిళా పైలెట్లు కీలక పాత్ర పోషించారు. అయితే ఈ వైమానిక దాడిలో భారత బ్రహ్మోస్ క్షిపణులు ప్రధాన పాత్ర పోషించాయని రక్షణ వర్గాలు తెలిపాయి. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని తాత్కాలికంగా నిలిపివేశామని సదరు వర్గాలు తెలిపాయి. అయితే, ఆపరేషన్ సిందూర్ విజయం పాక్‌ను తీవ్రంగా భంగపాటుకు గురిచేసిందని, దీనికి ప్రతికారంగా భారత్‌పై ఎప్పుడైనా దాడులు జరపవచ్చునని పేర్కొన్నాయి. అందుకని ముందస్తు చర్యగా భారత రక్షణ దళాలు హైఅలర్ట్‌లో ఉన్నాయని వెల్లడించాయి. భారత్, చైనా సరిహద్దు వివాదానికి సంబంధించి 2017లో డోక్లామ్‌లో తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాలే, సిందూర్ విజయానికి కారణం అని సదరు వర్గాలు తెలిపాయి. అయితే ఈ ఉగ్ర దాడిలో పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌కు ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి కల్పించాలని పాకిస్థాన్ నిర్ణయించింది. ఇది తనకు జరిగిన అవమానాన్ని కప్పిబుచ్చుకునే పాక్ చేసే ప్రయత్నంగా అభివర్ణించాయి.





జర్మనీలో రైల్వే ప్లాట్‌ఫామ్‌పై నిలుచున్న

## 12 మందికి కత్తిపోట్లు: ముగ్గురి పరిస్థితి విషమం

**హామ్‌బర్గ్, మే 24:** జర్మనీలోని హామ్‌బర్గ్ సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో దారుణం చోటుచేసుకుంది. ప్లాట్‌పాంపై నిలుచున్న వారిపై ఓ దుండగుడు విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో 12 మందికి గాయాలయ్యాయి. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మరికొంత మందికి స్వల్పంగా గాయాలైనట్లు స్థానిక మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఇది పెద్ద ఘటన అని జర్మనీ పోలీసులు ప్రకటించారు. అక్కడి స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. తొలుత ఎనిమిది మందికి గాయాలైనట్లు వార్తలు వచ్చాయి. తర్వాత ఆ సంఖ్య 12కు పెరిగినట్లు స్థానిక మీడియా వర్గాలు తెలిపాయి. పోలీసులు నిందితుడిని అరెస్టుచేశారు. దాడికి గల కారణాలు తెలియరాలేదు. దాడి ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు హామ్‌బర్గ్ పోలీసులు ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ఒక్కరే ఈ దాడిలో పాల్గొన్నట్లు సమాచారం.

# హార్వర్డ్‌పై ట్రంప్ నిర్ణయంతో బెల్జియం యూత్ క్వీన్‌కు కష్టాలు



**బ్రసెల్స్, మే 24:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హార్వర్డ్ యూనివర్సిటీలో చదువుతున్న విదేశీ విద్యార్థులపై ఫోకస్ పెట్టిన విషయం తెలిసిందే. ఫస్ట్ ఇయర్ పరీక్షలు పూర్తి చేసుకుని ప్రస్తుతం సమ్మర్ సెలవుల్లో ఉన్న ఆ వర్సిటీ విదేశీ విద్యార్థులకు ఇప్పుడు టెన్షన్ పట్టుకున్నది. విదేశీ విద్యార్థులకు హార్వర్డ్‌లో ఎంట్రీపై నిషేధం విధిస్తూ ట్రంప్ ఇచ్చిన ఆదేశాలు బెల్జియం యువరాణి ఎలిజబెత్‌కు కూడా కష్టాలు తెచ్చిపెట్టాయి. రెండో సారి దేశాధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత హార్వర్డ్ వర్సిటీలో జరుగుతున్న ఆందోళనలపై ట్రంప్ ఆగ్ర హంగా ఉన్నా రు. విద్యార్థుల్ని అదుపులో పెట్టలేకపోతున్న వర్సిటీకి ఫెడరల్ ఫండ్ లో కోతలు కూడా విధించారు. ట్రంప్ సర్కారుకు, హార్వర్డ్ వర్సిటీకి సంబంధాలు సరిగా లేకుండా పోయాయి. తాజాగా విదేశీ విద్యార్థుల నమోదు అంశంలో ట్రంప్ ఇచ్చిన కొత్త ఆదేశాలు మరింత సమస్యాత్మకంగా మారాయి. ఆ వర్సిటీలో చదువుతున్న విదేశీయుల్లో భారతీయులు, చైనీయులు,ఇతర సంపన్నుల పిల్లలు కూడా ఉన్నారు. వర్సిటీ డేటా ప్రకారం సుమారు 6800 మంది విదేశీస్టూడెంట్స్ చదువుతున్నట్లు హార్వర్డ్ పేర్కొన్నది. దీంట్లో అయిదో వంత విద్యార్థులు చైనీయులు ఉన్నట్లు తెలుస్తోంది. ఆ ప్రతిష్టాత్మక వర్సిటీలో విద్యను అభ్యసిస్తున్న వారిలో బెల్జియం యువరాణి కూడా ఉన్నారు. 23 ఏళ్ల ప్రిన్సెస్ ఎలిసబెత్ ఇప్పుడు ఆ వర్సిటీలో ఫస్ట్ ఇయర్ పూర్తి చేసింది. ఇతర కాలేజీలకు తమ స్టేటస్‌ను మార్చుకోవాలని ట్రంప్ సర్కారు హార్వర్డ్ విద్యార్థులపై వత్తిడి తెస్తున్న నేపథ్యంలో యువరాణి భవిష్యత్తు కూడా గందరగోళంగా మారింది. అయితే అమెరికా ప్రభుత్వ నిర్ణయంపై త్వరలో తమ వివరణ ప్రకటించనున్నట్లు బెల్జియం రాయల్ ప్యాలెస్ ప్రతినిధి లోర్ వాండోర్నీ తెలిపారు. ప్రిన్సెస్ ఎలిసబెత్ హార్వర్డ్ వర్సిటీలో పబ్లిక్ పాలసీ చదుతువున్నారు. అది రెండేళ్ల మాస్టర్స్ డిగ్రీకోర్సు. పబ్లిక్ సర్వీస్‌లో విజయవంతమైన కెరీర్‌ను కొనసాగించేందుకు ఆ సబ్జెక్టును నేర్పుతారు. ఆ కోర్సు వల్ల విద్యార్థుల ఆలోచన సరళిని, నైపుణ్యాన్ని పెంచనున్నారు. బెల్జియం చక్రవర్తి ఫిలిప్, రాణి మాథిల్డే పెద్ద కుమార్తె ప్రిన్సెస్‌ఎలిసబెత్. అయితే హార్వర్డ్‌లో చేరడానికి ముందు ఆమె బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో హిస్టరీ,పాలిటిక్స్‌లో డిగ్రీచదివారు. విదేశీ విద్యార్థులఎన్‌రోల్మెంట్‌పై ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని హార్వర్డ్ వర్సిటీ వ్యతిరేకిస్తున్నది. ఆ అక్రమ నిర్ణయం వల్ల వేల మంది విద్యార్థుల భవిష్యత్తు ఇబ్బందుల్లో పడినట్లు వర్సిటీ పేర్కొన్నది.



మయన్మార్ తీరంలో మునిగిన రెండు నౌకలు..

## 427 మంది రోహింగ్యాలు మృతి?

**నేపయిడా, మే 24:** మయన్మార్ తీరంలో రెండు ఓడలు మునిగిపోవడంతో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. 427 మంది రోహింగ్యాలు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. మే 9, 10వ తేదీల్లో ఈ ఘోర ప్రమాదాలు జరిగినట్లు ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. ఈ విషయం నిర్ధారణ అయితే 'సముద్రంలో చోటుచేసుకున్న అత్యంత విషాదకర ఘటన'గా ఇది మిగిలిపోతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఓడల ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తున్నట్లు ఐరాస అనుబంధ శరణార్థి విభాగం అంచనా వేస్తోంది. తొలి ప్రమాదం మే 9న చోటుచేసుకోగా 267 మందిలో 66 మంది బతికి బయటపడినట్లు ప్రాథమికంగా వెల్లడించింది. మే 10న రెండో నౌక ప్రమాదానికి గురికాగా 21 మంది బతికి బయటపడినట్లు సమాచారం. వాస్తవానికి రోహింగ్యాలు.. మయన్మార్‌లో నివసిస్తుంటారు. కానీ, సైన్యం మారణహోమం నుంచి తప్పించుకునేందుకుగానూ లక్షలాది రోహింగ్యాలు 2017లో బంగ్లాదేశ్‌కు తరలిపోయారు. మయన్మార్‌లో గతేడాది సైనిక తిరుగుబాటు తర్వాత వారి వలసలు మరింత పెరిగాయి. దీంతో దక్షిణ బంగ్లాదేశ్‌లోని శరణార్థి శిబిరాలు కిక్కిరిసిపోయాయి. అక్కడి పరిస్థితులూ క్షీణించడంతో వారంతా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు వలసబాట పడుతున్నారు. ఈ క్రమంలోనే ప్రమాదకర సముద్ర ప్రయాణాలను ఎంచుకుంటున్నారు.

# కొవిడ్‌పై ఆందోళన వద్దు

## కరోనా, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

## టెస్టింగ్ కిట్స్, మెడిసిన్ అందుబాటులో ఉంచుకోవాలి

## కరోనాపై మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నతస్థాయి సమీక్ష



**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** దేశంలో కొవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో కరోనా కేసులు, టెస్టింగ్‌పై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నతస్థాయి సమీక్షను నిర్వహించారు. కరోనా వైరస్ వ్యాప్తి, సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణపై మంత్రి దామోదర రాజనర్సింహ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. సమీక్ష సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్ర రెడ్డి, డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్, డీహెచ్ డాక్టర్ రవీందర్ నాయక్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, ఎపిడమాలజిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాలు, దేశాల్లో పరిస్థితిని నిశితంగా గమనిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. కొవిడ్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజలకు మంత్రి సూచించారు. వర్షాకాలంలో సీజనల్ డిసీజ్‌ల భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జలుబు, దగ్గులాగే కొవిడ్ కూడా ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుందని.. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం, దగ్గు, జలుబు ఉన్నప్పుడు మాస్కు ధరించడం వల్ల ఒకరి నుంచి ఒకరికి వైరస్‌లు వ్యాపించకుండా ఉంటాయన్నారు. ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణపై పంచాయతీరాజ్, మునిసిపల్, ఇతర శాఖలతో కలిసి పని చేయాలన్నారు.

అన్ని హాస్పిటళ్లలో సరిపడా మెడిసిన్, ఇతర రీఏజెంట్స్ సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కొవిడ్, డెంగీ పేరిట ప్రజలను ఆందోళనకు గురిచేసి, దోచుకునే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇండియా, ఇతర దేశాల్లో ఉన్న కొవిడ్ పరిస్థితులను అధికారులు, ఎపిడమా లజిస్టులు మంత్రికి వివరించారు. కొన్ని దేశాల్లో కోవిడ్ కేసులు స్వల్పం గా పెరిగినప్పటికి, హాస్పిటలైజేషన్ చాలా తక్కు వగా ఉందన్నారు.

ఇండియాలో పరిస్థితి నార్మల్‌గా ఉందని, జేఎన్1 వేరియంట్ కేసులు కొన్ని నమోదయ్యా యని.. ఈ వేరియంట్ 2023 నుంచే ఇండియాలో వ్యాప్తిలో ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆందోళనకర పరిస్థితులేమీ లేవ న్నారు. ఇతర దీర్ఘకాలిక జబ్బులు ఉన్నవారికి తప్పితే, ఇతరులెవరికీ హాస్పి టలైజేషన్ అవసరం లేదన్నారు. కేంద్ర ఆరోగ్యశాఖ నుంచి రాష్ట్రాలకు ఇప్పటివరకూ అడ్వైజరీలు, గైడ్‌లైన్స్ ఏమీ రాలేదు అని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో అక్కడక్కడ నమోదయ్యే కోవిడ్ కేసులను మేనేజ్ చేయ డానికి అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నామని అధికారులు మంత్రికి తెలిపారు. టెస్టింగ్ కిట్స్, మెడిసిన్ సహా అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.



## ఎంవిఐలకు నియామకపత్రాలు అందజేత

### విధుల్లో నిజాయితీగా ఉండాలి: మంత్రి పొన్నం

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త** రాష్ట్రంలో కోర్టు కేసుల మూలంగా పెండింగ్‌లో ఉన్న అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్(ఏఎంవిఐ)లకు నియామక పత్రాలను రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం అందజేశారు. గతంలో 96 మంది ఏఎంవిఐలకు నియామక పత్రాలు అందజేసిన విషయం తెలిసిందే. పలు కోర్టు కేసుల మూలంగా పెండింగ్‌లో ఉండడంతో ఆలస్యం అవడంతో కోర్టు కేసులు క్లియర్ చేసుకొని మిగిలిన ఏఎంవిఐలకు నియామక పత్రాలను శనివారం అందజేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు మంత్రి పొన్నం ప్రభాకర్. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విధుల్లో సక్రమంగా నిజాయితీగా పని చేయాలని విధిగా శిక్షణ తీసుకొని, రవాణా శాఖకు మంచి పేరు తీసుకురావాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్, సిఎం సెక్రటరీ శ్రీనివాస్ రాజు, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, జేటీసీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఆ దెయ్యాలెవరో కెటిఆర్ చెప్పాలి: మంత్రి పొన్నం

**హైదరాబాద్,మే 23,ప్రభాతవార్త:** బిఆర్ఎస్‌లో కెసిఆర్ చుట్టు ఉన్న ఆ దెయ్యాలు ఎవరో కెటిఆర్ చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కెటిఆర్ కాంగ్రెస్ పార్టీ మీద మాట్లాడడం కంటే ముందు వారి పార్టీ అంతర్గతంగా జరుగుతున్న అంశంలో ఆత్మపరిశీలనచేసుకోవాలని సలహా ఇచ్చారు. స్వయంగా కవిత మాట్లాడుతూ కెసిఆర్ దేవుడు ఆయన చుట్టూ దెయ్యాలు చేరారు అని మాట్లాడారు ఆ దయ్యాలు ఎవరో కెటిఆర్ జవాబు చెప్పాలి అని ఆయన కోరారు. కవిత మీడియా కవరేజ్, ప్రెస్ కాన్ఫరెన్స్ లు లీకుతో ఫీలై ఎదో ఒకటి గట్టిగా మాపై అంటే మళ్ళీ కవిత పోయి కెటిఆర్ ముందు వస్తుందనో ఎందుకు చెప్పారు తెలియదని అన్నారు. కెటిఆర్ మా నాయకుడిపై చేసిన బేస్ లెస్ ఆరోపణలపై స్పందించము కాంగ్రెస్ పార్టీని విమర్శించే ముందు మీ పార్టీలో మీ కుటుంబ సభ్యురాలు కెసిఆర్ దేవుడు ఆయన పక్కన దయ్యాలు ఉన్నాయి అని అన్నారు దానికి సమాధానం చెప్పాలని కోరారు. దెయ్యల కారణంగానే లేఖ లీక్ కావడమే నిదర్శనం అని స్వయంగా కవిత చెప్పారని దానికి జవాబు చెప్పి కాంగ్రెస్ పార్టీని ప్రశ్నిస్తే తరువాత మా నాయకునిపై మేము జవాబు చెప్తాం అని అన్నారు. 17 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వంపై వక్రబుద్ధితో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రతి విషయానికి రాజకీయ రంగు పులుముతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నేషనల్‌హెరాల్డ్ కేసుతో సిఎం రేవంత్‌రెడ్డికి సంబంధంలేదు పిసిసి అధికార ప్రతినిధి గాంధీభవన్‌లోనే విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి కెసిఆర్ ఇంట్లో నాలుగు స్థంబాల ఆట ఎన్ని ఆడినా తెలంగాణలో కాంగ్రెస్ మరో పదేళ్ల అధికారంలో ఉంటుందని జోస్యంచెప్పారు.

## బిసి గురుకుల జూనియర్ కాలేజీల అడ్మిషన్ల ఫలితాలు విడుదల

### 22,080 సీట్లకు 61,119 మంది విద్యార్థులు దరఖాస్తు

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బిసి గురుకుల జూనియర్ కాలేజీల అడ్మిషన్ల ఫలితాలను విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర బిసి గురుకుల విద్యా సంస్థ ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు సంబంధించి ఫలితాలను విడుదల చేసినట్టు గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు. గత ఏడాది వరకు ప్రవేశ పరీక్ష ఆధారంగా సీట్లు కేటాయించబడగా, ఈ ఏడాది నుండి ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా.. 10వ తరగతిలో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందని శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో మొత్తం 130 బాలుర కాలేజీల్లో 11,360 సీట్లు ఉండగా, 127 బాలికల కాలేజీల్లో 10,720 సీట్లు కలిపి మొత్తం 22,080 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా 61,119 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. వారిలో 22,080 మంది విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులు తగిన డాక్యుమెంట్లు సిద్ధం చేసుకొని, సంబంధిత కాలేజీల్లో అడ్మిషన్ తీసుకోవాలని సొసైటీ కార్యదర్శి సైదులు స్పష్టం చేశారు.

## ఎసిబి వలలో జగద్గిరిగుట్ట ఎస్ఐ

**హైదరాబాద్ (జగద్గిరిగుట్ట), మే 24, ప్రభాతవార్త:** లంచం తీసుకుంటూ జగద్గిరిగుట్ట ఎస్సై అవినీతి నిరోధక శాఖకు చిక్కారు. ఎసిబి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం బల్కంపేటకి చెందిన జారీ కమల్ బ్యాండ్ సిబ్బంది జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ శుభకార్యానికి వచ్చి బ్యాండ్ వాయించారు. శబ్ధ కాలుష్యానికి పాల్పడుతున్నారని ఆ బ్యాండ్‌కు చెందిన వాహనాన్ని, సామాగ్రిని ఎస్సై శంకర్ సీజ్ చేశారు. తన సామాగ్రి తమకు ఇవ్వవలసిందిగా బ్యాండ్ సిబ్బంది కోరారు. వాహనం సామాగ్రి తిరిగి ఇవ్వాలంటే రూ.15,000 డిమాండ్ చేశారు. ఇందుకు జగద్గిరిగుట్టకు చెందిన నాగేం దర్‌ను మధ్యవర్తిగా పెట్టుకొన్నాడు ఎస్సై. వారి వేధింపులు తాళలేక బాధితుడు రూ. 15,000 నగదును నాగేందర్‌కు ముట్టచెప్పాడు. నాగేందర్ ఆ మొత్తాన్ని ఎస్సై శంకర్ కు అందజేస్తుండగా ఎసిబి అధికారులు వలపన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టు కున్నారు. అవినీతికి అరికట్టాల్సిన ఎస్సై శంకర్‌ను, అతనికి సహకరించిన నాగేందర్‌పై ఎసిబి అధికారులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.




ఎసిబికి పట్టుబడిన ఎస్సై శంకర్

## ఇంజినీరింగ్ కళాశాలల విచ్చలవిడి డొనేషన్లను అరికట్టాలి : ఆర్.కృష్ణయ్య

### సిఎంకు లేఖ రాసిన 14 బిసి సంఘాలు

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలలు విచ్చల విడిగా డొనేషన్లను వసూలు చేస్తున్నాయని, ఈ అక్రమ వసూళ్లను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలని బిసి సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం 14.బిసి సంఘాల ప్రతినిధుల బృందం ఈ అక్రమ వసూళ్లను అడ్డుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో 40.శాతం సీట్లు యాజమాన్యపు కోటా కింద భర్తీ చేసుకునే అవకాశంను ప్రభుత్వం కల్పించిందని, దీన్ని యాజమాన్యాలు తమకు అనుకూలంగా మలుసుకొని విద్యార్థుల నుంచి అడ్డూ అదుపు లేకుండా రూ.10.నుంచి రూ.30.లక్షల వరకు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. యాజమాన్య కోటాను కళాశాలలకు వదిలేయడం వలన పేరున్న టాప్ 25.కళాశాలల్లో రూ.10,15,20,25,30.లక్షల వరకు వసూలు చేసుకుంటున్నారన్నారు. ఈ కారణంగా సీట్లన్నీ డబ్బున్నోళ్లకే ఇస్తుండడంతో మెరిట్ ఉండీ కూడా పేదవిద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న కళాశాలలపై కొరడా ఝుళిపించి మెరిట్ విద్యార్థులకు న్యాయం జరిగేలా సర్కారు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

## ఫార్మసీ కాలేజీల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

### నాలుగేళ్ల బకాయిలు రూ. 550 కోట్లు

### ట్యూషన్ ఫీజులను నేరుగా కాలేజీలకు చెల్లించాలి

### ఫార్మసీ కళాశాలల యాజమాన్యాల సంఘం విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఫార్మసీ కాలేజీల్లో చదివే విద్యార్థులకి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఫార్మసీ కాలేజీల యాజమాన్యాల సంఘం డిమాండ్ చేసింది. సుమారు 550 కోట్ల బకాయిలు ఉన్నాయని.. బకాయిల మూలంగా కాలేజీలను కొనసాగించలేకపోతున్నామని అసోసియేషన్ నేతలు తెలిపారు. ఇందుకు సంబంధించిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కళాశాలల యాజమాన్యాల సంఘం శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ కె రాందాస్, జనరల్ సెక్రటరీ పుల్ల రమేష్ బాబు, వైస్‌ప్రెసిడెంట్ ఎం నరసింహారెడ్డి, జాయింట్ సెక్రటరీ కడియాల సతీష్, అసోసియేషన్ నాయకులు బొమ్మ శ్రీధర్, సిద్ధార్థ రెడ్డి, ఎం మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రంలో 7 ప్రభుత్వ ఫార్మసీ కాలేజీలు, 113 ప్రైవేటు ఫార్మసీ కళాశాలలు ఉన్నాయన్నారు. వాటిలో ప్రభుత్వ కళాశాలల్లో 1500 మంది విద్యార్థులు చదువుతుంటే.. ప్రైవేట్ ఫార్మసీ కాలేజీల్లో 70 వేల మంది విద్యార్థులు, బిఫార్మసి, ఎంఫార్మసి, ఫార్మా డి కోర్సులు చదువుతున్నారని తెలిపారు. సుమారు 98 శాతం విద్యార్థులు ప్రైవేటు ఫార్మసీ కాలేజీల్లోనే చదువుతున్నారని తెలిపారు. వారిలో సుమారు 55 వేల మందికి పైగా రాష్ట్ర ప్రభుత్వం అందించే ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పొందుతున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వానికి సంవత్సరానికి రూ. 200 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఫార్మసీ కోర్సులకు బాగా డిమాండ్ ఉందని... ఉత్పత్తి రంగంలోనే కాకుండా క్లినికల్ రంగం వైపు కూడా ఫార్మసీ విద్యార్థులకు ఆరోగ్య సంరక్షణ రంగంలో భారీ డిమాండ్ ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని ఫార్మసీ కాలేజీలకు గత 4 సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులు రాకపోవడంతో సుమారు రూ. 550 కోట్లు ట్యూషన్ ఫీజు బకాయిలు పేరుకుపోయాయని రాందాస్ అన్నారు. దీని వల్ల తాము సకాలంలో బోధనా, బోధనేతర సిబ్బందికి జీతాలు చెల్లించలేక పోతున్నామన్నారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రభుత్వానికి ఫార్మసీ కళాశాలలు ఈ విద్యాసంవత్సరం నుంచి నేరుగా విద్యార్థి నుండి ట్యూషన్ ఫీజు వసూలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించేలా చూడాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం మొదట ఉద్దేశించిన విధంగా ఫీజు రీయింబర్స్‌మెంటును కాలేజీలకు కాకుండా నేరుగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు చెల్లించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో హామీ ఇచ్చినట్లుగా.. గత 4 సంవత్సరాల పెండింగ్ ఫీజు బకాయిలను రెండు, మూడు విడతల్లో విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

## హుజూర్‌నగర్‌ను అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతాం

### జూన్ చివరి నాటికి 2,160 ఇళ్లు పూర్తి చేయాలి

### రోడ్లు, భవనాల నిర్మాణంలో నాణ్యత లేకుంటే చర్యలు : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హుజూర్‌నగర్‌టౌన్, మే 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శంగా తీర్చిదిద్ది సాటిలేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మం త్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని ఫణిగిరి రామస్వామిగుట్టు వద్ద నిర్మిస్తున్న 2, 160 ఇండ్ల అభివృద్ధి పనులు, అలాగే రూ.30 కోట్లతో నిర్మిస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, రూ.6 కోట్లతో నిర్మిస్తున్న ఐటిఐ కళాశాల భవన నిర్మాణం, రూ. 8 కోట్లతో నిర్మించే ఆర్ అండ్‌బి అతిధిగృహంతోపాటు హుజూర్‌నగర్ ఔటర్ రింగ్‌రోడ్డు, రూ.4.05 కోట్లతో నిర్మించే డిగ్రీ కళాశాల అదనపు తరగతుల భవనం, రూ. 8.05 కోట్లతో జూనియర్ కళాశాల తరగతి గదుల నిర్మాణ పనులను ఆర్ అండ్‌బి, హౌజింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా నియోజకవర్గ కేంద్రంలో ఫణిగిరి రామస్వామి గట్టు వద్ద పేదలకు సొంత ఇంటిని నిర్మించి ఇచ్చే సింగిల్ బెడ్‌రూం ఇండ్ల పనులను వేగవంతం చేసి జూన్ చివరి నాటికి పూర్తి చేయాలని నాణ్యతతో ఇండ్ల నిర్మాణం చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అలాగే అక్కడే నిర్మిస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఈ ప్రాంతంలో సాంకేతిక విద్యను విద్యార్థులకు అందుబాటు లోకితెచ్చి తొందరగా ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా నూతన అడ్వాన్స్ స్కిల్స్, రోబో టెక్నాలజీ, ఎలక్ట్రికల్ వెహికల్ రిపేర్, ప్రాసెసింగ్ టెక్నాలజీ వంటి నూతన కోర్సులను 170 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఈ నిర్మాణ పనులు జూన్ చివరి వరకు పూర్తి చేసి జూలైలో ఇక్కడ శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆర్‌అండ్‌బి, డిఎం ఎఫ్‌టి, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి నియోజ కవర్గంలో ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ రహదారుల పనులు ఎక్కడెక్కడ ప్రారంభించారు, వాటి ప్రగతితోపాటు నిర్మాణ పనులు చేపట్టని వాటికి వెంటనే నిర్మాణం చేపట్టాలని, రహదారులు నిర్మించేటప్పుడు అడ్డుగా ఉన్న విద్యుత్ స్థంభాలను విద్యుత్ అధికారులతో మాట్లాడి వాటిని పక్కకు జరిపి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యతతో నిర్మించేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డీవో సూర్య నారాయణ, ఆర్‌అండ్‌బి ఎస్ఈ సీతారామయ్య, పిఆర్ఈఈ వెంకటయ్య, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, హౌజింగ్ ఎస్ఇ వెంకటదాసురెడ్డి, డిఇ జగన్, ఎఇ సాయిరాంరెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మోడల్ కాలనీ ఇళ్లను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

## నీలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్‌పై వేటు

**హైదరాబాద్ (మెహదీపట్నం), మే 24, ప్రభాతవార్త :** నీలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. కొద్దిరోజుల క్రితం ఆస్పత్రి ప్రాంగణంలో ప్రైవేట్ మెడికల్ షాప్ కోసం ఓ గది నిర్మాణం చేప ట్టగా దానికి అనుమతులు లేవంటూ అధికారులు కూల్చి వేశారు. ఈ విషయంలో ఆరోపణలు ఎదు ర్కొంటున్న డాక్టర్ రవికుమార్‌ను సస్పెండ్ చేస్తు న్నట్లు హెల్త్ సెక్రటరీ క్రిస్టినా ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా ఆస్ప త్రిలో పీడియాట్రిక్ హెచ్‌ఒడిగా ఉన్న డాక్టర్ జి.విజయ్‌కుమార్‌ను ఇన్‌చార్జ్ సూపరింటెం డెంట్‌గా నియమించినట్లు వెల్లడించారు.



డాక్టర్ రవి కుమార్

## ఆదిలాబాద్‌లో ఎసిబికి చిక్కిన మండల సర్వేయర్

**హైదరాబాద్ మే 24, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లాలో మండల సర్వేయర్ రైతు వద్ద నుంచి 20 వేల రూపాయలు లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కాడు. వివరాలు ఇలా వున్నాయి. జిల్లాలోని కడెం మండల సర్వేయర్ ఉమాజి గంగాపూర్ గ్రామానికి చెందిన గూగులావత్ ప్రభాకర్ అనే రైతు సరిహద్దులను సరిచేసి పట్టా ఇచ్చేందుకు 20 వేల రూపాయల లంచం అడిగాడు. తన తండ్రి నుంచి తనకు వచ్చిన వారసత్వ ఆస్తికి పట్టా ఇచ్చేందుకు లంచం ఎందు కు ఇవ్వాలని ప్రభాకర్ కోరగా ఈ విషయంలో లంచం ఇస్తేకానీ పని జరగదని సర్వేయర్ ఖరా కండిగా చెప్పాడు. దీంతో రైతు దీనిపై ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసిన ఎసిబి అధికారులు మండల కార్యాలయంలో సర్వేయర్ ఉమాజికి రైతు ప్రభాకర్ చేత 20 వేల రూపాయలు లంచంగా ఇచ్చేలా చేశారు. రైతు నుంచి సర్వేయర్ లం చం తీసుకున్న తరువాత సమీపంలోనే మాటువేసిన ఎసిబి అధికారులు ఒక్కసారిగా దాడిచేసి అతన్ని పట్టుకున్నారు. అనంతరం నిందితుడి నుంచి లంచం డబ్బులను స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించారు.

## ఆంధ్రప్రదేశ్ 10వ తరగతి ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** 2024-25 విద్యా సంవత్సరానికి ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 10వ తరగతి పరీక్షా రీవాల్యుయేషన్, రీవెరిఫికేషన్ ఫలితాల్లో ఇద్దరు విద్యార్థులు అత్యధిక మార్కులు 599 సాధించి విజయకేతనం ఎగురవేశామని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. అదేవిధంగా 598 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు ఏడుగురు, 597 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు 42 మంది, 596 ఆ పైన మార్కులు మార్కులు సాధించిన విద్యార్థులు 109 మంది, 595 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు 201 మంది, 590 ఆ పైన మార్కులు 1184 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. అదేవిధంగా మొత్తం 24261 మంది విద్యార్థులకుగాను శ్రీచైతన్య స్కూల్ సగటు మార్కు 600కు గాను 528. ఓవరాల్ పాస్ పర్సంటేజ్ 99.2 శాతం. సుమారు 80 శాతం బ్రాంచ్లు నూటికి నూరుశాతం ఫలితాలు సాధించాయని ఆమె తెలిపారు. ప్రస్తుతానికి రీవెరిఫికేషన్ ఆధారంగా పైన తెలిపిన సంఖ్యలు ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం తెలియజేయడం జరిగిందన్నారు. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 1వ ర్యాంకుతోపాటు 100 లోపు ర్యాంకులు 19 మంది శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు సాధించారని ఆమె తెలిపారు. శ్రీచైతన్య సాధించిన ఇంతటి ఘనవిజయాలకు దరిదాపుల్లో దేశంలోగాని, రాష్ట్రంలోగాని మరే ఇతర విద్యాసంస్థ లేదని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, రీసెర్చ్ ఓరియెంటెడ్ టీచింగ్ మెథడాలజీ, సిఐ ఐపియల్, సిఐపియల్, యమ్.పి. యల్., ఐకాన్, సిబ్యాచ్, యస్‌బ్యాచ్, టెక్నో వంటి పటిష్టమైన అకడమిక్ ప్రోగ్రామ్స్, మైక్రో లెవల్ టీచింగ్ సిస్టమ్, అంకిత భావంతో పనిచేసే అధ్యాపకులు వలన మాత్రమే ఇలాంటి అద్భుత ఫలితాలు సాధ్యమవుతున్నాయని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. ఇంతటి అనితర సాధ్యమైన విజయానికి కారణమైన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి శ్రీచైతన్య విద్యాసంస్థల మరొక డైరెక్టర్ నాగేంద్ర అభినందనలు తెలియజేశారు.




గాంధీభవన్‌లో శనివారం మీడడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ మీడియా సెల్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి

## కవిత సస్పెన్షన్‌కే దెయ్యాల స్కెచ్

### జయలలిత తరహాలో కెసిఆర్ పరిస్థితి

### కాంగ్రెస్ మీడియా సెల్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి

హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త: కవిత చెప్పిన దెయ్యం సంతోష్‌రావు, కెటిఆర్, హరీశ్‌లు ఆమెను సస్పెండ్ చేసేందుకు స్కెచ్ వేశారని కాంగ్రెస్ మీడియా సెల్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి జోస్యం చెప్పారు. గాంధీభవన్‌లో శనివారం విలేఖరులతో మాట్లాడుతూ కవిత లేఖ గురించి పది రోజుల ముందే చెప్పానని ఆయన వివరించారు. నేడో, రేపో కవితను సస్పెండ్ చేస్తారని వెల్లడించారు. సంతోష్‌ను పార్టీ ప్రెసిడెంట్ చేసే అవకాశముందని వివరించారు. కెసిఆర్ పరిస్థితి జయలలిత లాగా తయారైందని అపహాస్యంచేశారు. కవితపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటే ఆమె సొంత పార్టీ పెట్టుకుంటుందని చెప్పారు. కవితతో మాట్లాడి సమస్య పరిష్కరించుకునే ఆలోచన కెటిఆర్ కి లేదు. సొంత మనుషులే కెసిఆర్‌ను వెన్నుపోటు పొడుస్తారు. కుటుంబాన్ని విచ్చిన్నం చేసినా కెసిఆర్ నిస్సహాయుడిగా ఉన్నారనిఆవేదన చెందారు. పార్టీ అంతర్గత విషయాలను బయట మాట్లాడితే గతంలో అనేకమందిపై కెసిఆర్ చర్యలు తీసుకున్నారు. కెసిఆర్‌తో కవిత మాట్లాడతా అంటే సంతోష్ అడ్డుకున్నాడని ఆయన తెలిపారు. కెసిఆర్ ఏం చేయాలో, ఎవర్ని కలవాలో సంతోష్ డిసైడ్ చేస్తున్నారు.

# భారీగా గంజాయిని పట్టుకున్న పోలీసులు

## వాహన తనిఖీల్లో రూ.3.49 కోట్ల విలువైన సరకు స్వాధీనం



పట్టుబడిన గంజాయితో పోలీసులు

**కొత్తగూడెం క్రైం, మే 24,ప్రభాతవార్త:** విశ్వసనీయ సమాచారం మేరకు టేకులపల్లి పోలీసులు, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా శనివారం టేకులపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్ సమీపంలో గల సులానగర్ మినిస్ట్రీ చర్చ్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీలలో ఎస్కార్ట్‌గా వస్తున్న కారు నెంబర్, ఐచర్ వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా 698 కిలోల ప్రభుత్వ నిషేధిత గంజాయిని గుర్తించడం జరిగింది. సుమారుగా 3,49,00,000 రూపాయల విలువ గల ఇట్టి గంజాయిని పోలీసులు స్వాదీనం చేసుకోవడమైనది. ఐచర్ వ్యానులో ఉన్న ముగ్గురు వ్యక్తులను కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టడం జరిగింది. ఇట్టి నిషేధిత గంజాయిని అమ్మిన వ్యక్తులపైన, కొనుగోలు చేసిన వ్యక్తులు, రవాణా చేస్తున్న వ్యక్తులందరిపై కేసు నమోదు చేసి అట్టి రవాణాకు ఉపయోగించిన ఐచర్ మరియు కారును, 5 మొబైల్ ఫోన్లను కూడా సీజ్ చేయడం జరిగినది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సీలేరు అటవీ ప్రాంతం నుండి హర్యానా రాష్ట్రం, కురుక్షేత్ర ప్రాంతానికి అక్రమంగా ఇట్టి గంజాయిని రవాణా చేస్తున్నట్లు విచారణలో తేలింది. పట్టుబడిన నిందితులం దరూ కురుక్షేత్ర జిల్లాకు చెందిన ప్రిన్స్ కుమార్ ఆదేశాలతో పార్సిల్ సర్వీస్ మాటున ఇట్టి గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డారు.

### పట్టుబడిన ఆరుగురు వ్యక్తుల వివరాలు

హర్యానా రాష్ట్రం కురుక్షేత్ర జిల్లాకు చెందిన సందీప్ కుమార్ అలియాస్ రింకు లక్వీందర్, అమర్ నాథ్ కుమార్ అలియాస్ అమర్ నాథ్, పవన్ కుమార్, రాజ్ కుమార్ అలియాస్ వినోద్, కృషన్ కుమార్ అలియాస్ కాలే ను పట్టుకున్నారు. వీరికి గంజాయి అమ్మిన వ్యక్తులు హరి ఖారా, ప్రిన్స్ కుమార్ (హర్యానా రాష్ట్రం). ఈ రోజు పట్టుబడిన ఆరుగురు వ్యక్తులను జ్యుడిషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టునకు తరలించడం జరిగినది. నిషేధిత గంజాయి అక్రమ రవాణాను సమర్థవంతంగా అడ్డుకుని నిందితులను చాకచక్యంగా పట్టుకున్న టేకులపల్లి సిఐ టి.సురేష్, ఎస్సై తి.రాజేందర్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు, సిబ్బందిని ఎస్పి రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.

# జూన్ 2 నుంచి విత్తన వారోత్సవాలు

## వ్యవసాయ్యూ వర్సిటీ విసి జానయ్య

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** తెలంగాణలో వానాకాలం పంటల సాగు సీజను మరో వారం రోజుల్లో ప్రారంభమవుతున్న నేపథ్యంలో విత్తనాల పంపిణీని ప్రారంభంకానుంది. తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విత్తన వారోత్స వాలను నిర్వహించాలని నిర్ణయించిది. రాష్ట్రంలో జూన్ 2న విత్తనాలను పంపిణీ ప్రారంభించనున్నట్టు వ్యవసాయ విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. ఈ మేరకు దీనికి సంబంధించి శనివారం ఒక ప్రకటనలో ఇందుకు అనుగుణంగా విత్తన పంపిణీకి రంగం సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రతీ గ్రామం నుంచి ముగ్గురి నుంచి ఐదుగురు అభ్యుదయ రైతులకు నాణ్యమైన విత్తన సంచులను పంపిణీ చేయనున్నట్టు వెల్లడించారు. అలాగే జూన్ 3వ తేదీ నుంచి వ్యవసాయ విశ్వవిద్యాలయ కేంద్రాల్లో వరి, కంది, మక్క, పెసర, మినుము, ఆముదం, చిరుధాన్యాలకు సంబంధించిన 8,500 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీకి సిద్ధంగా ఉంచినట్టు వివరించారు.



# గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో ఎల్ఐసి

## సంస్థ సిఎండి సిద్ధార్థ మొహంతి

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** అత్యధిక బీమా పాలసీలు అమ్ముడయిన సంస్థగా ఎల్ఐసీ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ కెక్కింది. 24 గంటల్లో అత్యధిక జీవిత బీమా పాలసీలు అమ్ముడు కావడంతో గిన్నిస్ బుక్‌కు ఎక్కినట్లు ఎల్ఐసీ ప్రకటించింది. ఈ చారిత్రాత్మక విజయం కార్పొరేషన్ యొక్క అంకితమైన ఏజెన్సీ నెట్‌వర్క్ యొక్క అసాధారణ పనితీరును గుర్తిస్తుందని సంస్థ సిఎండి సిద్ధార్థ మొహంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జనవరి 20న ఎస్ఐసీ మొత్తం 4,52,839 ఏజెంట్లు దేశమంతటా 5,88,107 జీవిత బీమా పాలసీలను విజయవంతంగా పూర్తి చేశారన్నారు. ఈ ప్రయత్నం జీవిత బీమా పరిశ్రమలో ఏజెంట్ ఉత్పాదకతకు కొత్త ప్రమాణాన్ని స్థాపించిందని చెప్పారు. ఈ ప్రతిష్టాత్మక గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ బిరుదును ఎల్ఐసీ బృందం అందుకున్నందుకు సంతోషంగా ఉందని తెలిపారు. ప్రతి ఏజెంట్ "మ్యాడ్ మిలియన్ డే" నాడు అంటే జనవరి 20 న కనీసం ఒక పాలసీని పూర్తి చేయాలని చేసిన విజ్ఞప్తికి స్పందించడంతో ఈ రికార్డ్ సాధ్యపడిందన్నారు. ఇది మా ఏజెంట్ల అవిశ్రాంత అంకితభావం, నైపుణ్యం, అవిశ్రాంత పని నీతికి శక్తివంతమైన ధృవీకరణగా పేర్కొన్నారు. ఈ విజయం మా కస్టమర్లకు మరియు వారి కుటుంబాలకు కీలకమైన ఆర్థిక రక్షణను అందించాలనే మా లక్ష్యం పట్ల మా లోతైన నిబద్ధతను ప్రతిబింబిస్తుందని వెల్లడించారు.

# పంజాబ్ కింగ్స్‌పై ఢిల్లీ కేపిటల్స్ గెలుపు

## ఆరు వికెట్ల తేడాతో పంజాబ్ ఓటమి

**జైపూర్, మే 24:** ఐపిఎల్ 18వ సీజన్‌లో పంజాబ్‌కింగ్స్, ఢిల్లీకేపిటల్స్ మధ్య జరిగిన మ్యాచ్ చివరివరకూ ఉత్కంఠగానే సాగింది. తొలుత బ్యాటింగ్‌చేసిన పంజాబ్‌కింగ్స్ భారీస్కోరుచేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 206 పరుగులుచేసి ఢిల్లీజట్టుకు 207 పరుగుల లక్ష్యం విధించింది. తదనంతరం లక్ష్యఛేదనకు వచ్చిన ఢిల్లీకేపిటల్స్ మూడు బంతులు మిగిలి ఉండగానే నాలుగు వికెట్ల నష్టానికిగాను 208 పరుగులుచేసి ఆరువికెట్ల తేడాతో విజయం సొంతంచేసుకుంది. చివరి మూడు బంతులు మిగిలి ఉండగా ఢిల్లీకేపిటల్స్




విజయం సాధ్యమేనన్న నమ్మకంతో ముందుకుసాగింది. పాయిట్ల పట్టికలో ఉన్న టాప్ మూడు జట్లకు కూడా వరుసగా షాక్‌లు తగిలాయి. ఇప్పటివరకూ గుజరాత్‌పై లక్నో, ఆర్సీబీపై సన్‌రైజర్స్ విజయం సాధిస్తే శనివారం పంజాబ్‌కింగ్స్ జట్టుకూడా ఢిల్లీ కేపిటల్స్ చేతిలో ఓటమి పాలయింది. సమీర్ రిజ్వీ 58 పరుగులు, కరుణ్‌నాయక్44, కెఎల్‌రాహుల్ 35, ఫాఫ్ డుప్లెసిస్23, అటల్ 22, ట్రిస్టన్ స్టబ్స్ 18 పరుగులుచేసి జట్టు విజయానికి దోహదపడ్డారు. 22 బంతుల్లోనే అర్ధసెంచరీ సాధించి సమీర్‌రిజ్వీ రికార్డుసాధించాడు. ఐపిఎల్‌కెరీర్‌లో తనకు తొలి అర్ధసెంచరీ అని చెప్పవచ్చు. ఓపెనర్ కేఎల్ రాహుల్ 35 (6 ఫోర్లు, 1 సిక్స్), ఫాఫ్ డూప్లెసిస్ 23 (2 ఫోర్లు, 1 సిక్స్) మంచి ప్రారంభాన్ని అందించారు. ఆ తర్వాత వచ్చిన కరున్ నాయర్ (44), సెదికుల్లా అతల్ (22), సమీర్ రిజ్వీ (58) వేగంగా పరుగులు చేయడంతో ఛేజింగ్ సులువయిపోయింది. మొత్తంగా 4 వికెట్లు కోల్పోయి.. ఛేజింగ్ చేసింది ఢిల్లీ. ఇక పంజాబ్ బౌలర్లలో హార్‌ప్రీత్ బ్రార్ 2, మార్కో జేన్ సన్, ప్రవీన్ దూబే చెరో వికెట్ తీసుకున్నారు. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 206 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 53 (5 ఫోర్లు, 2 సిక్సులు) పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య (6) తక్కువ స్కోర్‌కే ఔటైనప్పటికీ.. మరో ఓపెనర్ ప్రభుసిమ్రన్ సింగ్ 28(4 ఫోర్స్, 1 సిక్స్), జోష్ ఇంగ్లిస్ 32 (3 ఫోర్స్, 2 సిక్సులు) రాణించారు. చివర్లో మార్కస్ స్టోయినస్ 42 (3 ఫోర్లు, 4 సిక్సులు) విరుచుకుపడడంతో పంజాబ్ భారీ స్కోర్ చేయగలిగింది. ఢిల్లీ బౌలర్లలో ముస్తఫిజూర్ రెహమాన్ 3, కుల్దీప్, విప్‌రాజ్ నిగమ్ చెరో రెండు వికెట్లు పడగొట్టగా.. ముకేష్ కుమార్ ఒక వికెట్ తీసుకున్నాడు.



కార్యక్రమంలో సందేశాన్నిస్తున్న కెఎ పాల్

# కెఎ పాల్ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి సమ్మేళనం

**హైదరాబాద్ (కంటోన్మెంట్), మే 24, ప్రభాతవార్త:** సికిందరాబాద్ జింఖానా మైదానంలో కె.ఏ.పాల్ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. జింఖానా మైదానంలో హైకోర్టు అనుమతులు ఇచ్చిన నేపథ్యంలో ప్రపంచ శాంతి సమావేశాన్ని నిర్వహించారు. డాక్టర్ కే.ఏ.పాల్ ఆధ్వర్యంలో ప్రపంచంలోని వివిధ దేశాలలోని మిలియన్ల ప్రజలకు శాంతి సందేశాన్ని ఇస్తు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కెఎ పాల్ ప్రపంచవ్యాప్తంగా శాంతిని కాంక్షిస్తు ప్రార్ధనలు చేశారు. కార్యక్రమంలో గ్లోబల్ పీస్ అంబాసిడర్స్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు. ప్రపంచం సుఖఃశాంతులతో వర్ధిల్లాలని ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఆయన తన సందేశాన్ని అందజేశారు. వర్షం పడుతున్నప్పటికీ కేఏ పాల్ తన సందేశాన్ని అందజేసి ప్రపంచ శాంతి పట్ల తనకున్న మక్కువను చాటుకున్నారు.

# సరిహద్దుల్లో గస్తీ సిబ్బందికి జంగిల్ వార్‌ఫేర్‌లో శిక్షణ

## పహాల్గాం దాడి తర్వాత అప్రమత్తమైన కేంద్రం

**శ్రీనగర్, మే 24:** జమ్మూకాశ్మీర్‌లోని పహాల్గాంలో గత నెల 22న ఉగ్రవాదులు దట్టమైన అటవీ ప్రాంతాన్ని అవకాశంగా తీసుకొని పర్యాటకులపై దాడిచేసి 26 మందిని బలిగొనడంతో అలాంటి ఉగ్రదాడులను ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో తొలిసారిగా జమ్ముకశ్మీర్‌లోని పోలీసులు, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ సిబ్బందికి జంగిల్ వార్‌ఫేర్‌లో శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించింది. కశ్మీర్, ఇతర సరిహద్దు ప్రదేశాల్లోని పర్వత ప్రాంతాలు, ప్రమాదకరమైన అటవీ భూభాగాలపై అవగాహన ఉన్న ఉగ్రవాదులను ఎదుర్కోవడమే లక్ష్యంగా ప్రమాదకరమైన అటవీ ప్రాంతాల్లో పోలీసులకు యుద్ధ మెళకువల్లో శిక్షణనిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పోలీసులకు శిక్షణనిచ్చే బాధ్యతను ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి, జమ్ముకశ్మీర్ డీజీపీ నళినీ ప్రభాత్‌కు అప్పగించినట్లు చెప్పారు. గతంలో ఎలైట్ యాంటీనక్సల్ గ్రేహౌండ్స్ కమాండర్‌గా పనిచేసిన ప్రభాత్ కశ్మీర్‌లోని ఎత్తైన ప్రదేశాల్లో సిబ్బందికి శిక్షణనిస్తున్నారు. అధికారులు ఎస్ఓజీ బృందాలకు దేశంలోని ప్రమాదకర బహుళ ప్రదేశాలలో శిక్షణ ఇస్తున్నారు. కొన్ని బ్యాచ్‌లు ఇప్పటికే ముఖ్యమైన శిక్షణను పొందాయి.

ఇందులో భాగంగా తెలంగాణలోని గ్రేహౌండ్స్, జంగిల్ వార్‌ఫేర్ స్కూల్, పంజాబ్‌లోని తల్వారాలోని వైట్ నైట్ కార్ప్స్ బేస్, కశ్మీర్‌లోని దోడాలోని కార్ప్స్ బాటిల్ స్కూల్స్‌లో పలు సెషన్‌లు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఈ కేంద్రాల్లో సిబ్బందికి రోజుల తరబడి ప్రతికూల పరిస్థితులలో జీవించడం, శత్రువులను ట్రాక్ చేస్తూ దట్టమైన అడవులను నావిగేట్ చేయడం లాంటి వాటిలో శిక్షణ ఇస్తారు. విధులు నిర్వహిస్తున్న ప్రాంతంలోని అన్ని ప్రదేశాలపై అవగాహన ఉండేలా మ్యాప్‌ల సహాయంతో క్లిష్టమైన ప్రదేశాలకు త్వరగా చేరుకునేలా మెళకువలు నేర్పిస్తారు. అయితే పహాల్గాం దాడి సమయంలో స్థానికంగా నిఘా వర్గాలు లేకపోవడం కూడా ఓ



వైఫల్యంగా భావించిన అధికారులు మారుమూల ప్రాంతాల్లో నెట్‌వర్క్‌ల ఏర్పాటుపైనా దృష్టి పెడుతున్నట్లు సమాచారం.

# ఖరీఫ్‌లో 16.70 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలు

## గతం కంటే పెరగనున్న వివిధ పంటల విస్తీర్ణం

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** వచ్చే నెల నుండి ప్రారంభమయ్యే వానాకాలం సాగు సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 16.70 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమని పేర్కొంది. సన్న రకం వరి ధాన్యం సాగు వైపే రైతులు మొగ్గుచూపే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా విత్తనాలు సిద్ధం చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ పేర్కొంది. రాష్ట్ర వ్యాప్తంగా 1.34 కోట్ల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని తాజాగా ప్రతిపాదించింది. గత వానాకాలం సీజన్‌తో పోలిస్తే ఈ సారి సాగు విస్తీర్ణం సుమారు 4లక్షల ఎకరాలకుపైగా పెరిగే అవకాశం ఉన్నట్టు అంచనా. కూరగాయలు, ఇతర ఉద్యానవన పంటలు కలిపి 10లక్షల ఎకరాల వరకు ఉండొచ్చని వ్యవసాయ శాఖ భావిస్తోంది. ఈ మేరకు వానాకాలం సీజన్ సాగు ప్రణాళికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపింది. ఈ మొత్తం విస్తీర్ణంలో అన్ని పంటల కంటే అత్యధికంగా 66.80 లక్షల ఎకరాల్లో వరిని సాగు చేస్తారని పేర్కొంది.

క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వడంతో సన్నాలకు గిరాకీ పెరుగుతున్న దృష్ట్యా వీటి సాగు 60 నుంచి 70 శాతానికి పైగా ఉండొచ్చని అంచనా వేసింది. పత్తి సాగు 50 లక్షల ఎకరాలతో రెండోస్థానం ఉంటుందని వెల్లడించింది. వీటికి అనుగుణంగా విత్తనాలు, ఎరువులను వ్యవసాయ శాఖ సిద్ధం చేస్తోంది. వచ్చే వానాకాలంలో 16.70 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం కానుండగా, ఇందులో ఇప్పటికే 75లక్షల ఎకరాలకు సరిపడా విత్తనాలను అందుబాటులో ఉంచింది. వాటిలో సీడ్స్ కార్పొరేషన్ 17,790 క్వింటాళ్లు, నేషనల్ సీడ్ కార్పొరేషన్ 9,500 క్వింటాళ్లను సిద్ధం చేసింది. ఇక ప్రయివేటు సంస్థలు 18.52 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చాయి. అలాగే 45వేల క్వింటాళ్ల పత్తి విత్తనాలకుగాను ప్రయివేటు కంపెనీలు 1.34 లక్షల క్వింటాళ్ల బీటీ విత్తనాలను సిద్ధంగా ఉంచాయి.

మొక్కజొన్న ఆరు లక్షల ఎకరాల్లో సాగైతే, అందుకు 48వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని తేల్చింది. ఇవి కాకుండా కందులు, పెసలు, మినుములు, జొన్నలు, వేరుశనగ, ఆముదం, నువ్వులు తదితర పంటల విత్తన ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేసింది.

# ప్రజాసంపదను దోచుకుని, ఫామ్‌హౌజ్‌లకు పరిమితం

## దోచుకున్న సంపద పంపిణీలో విభేదాలు

## ఇందిరమ్మ, ప్రజాప్రభుత్వంపై గత పాలకుల కుట్ర



**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:** వేలకోట్ల ప్రజా సంపదను దోచుకుని, పదేళ్ల పాటు ఫామ్ హౌజ్ లకే పమితమై పాలనను గాలి కొదిలేసిన దొరలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు మాట్లాడు తున్నారని ఉప ముఖ్యమంత్రి మల్లు భటి విక్రమార్క తీవ్రస్థాయిలో బిఆర్ఎస్ పాలనపై విరుచుకుపడ్డారు. జిల్లాలోని వివిధ నియోజక వర్గాల్లో శనివారం రాష్ట్ర మంత్రులు భట్టివిక్ర మార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈసందర్భంగా వైరా నియోజకవర్గ మైన వైరా జూనియర్ కాలేజ్ లో జరిగిన జాబ్ మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసం గించారు. రాష్ట్ర సంపదను దోపిడీ చేసి, పాలనలో అన్ని రంగాల్లో వైఫల్యం చెందిన గత ప్రభుత్వాన్ని ఎన్నికల్లో ఓడించి...ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వాన్ని అధికారం లోకి తీసుకొచ్చారని రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్న ప్రజా ప్రభుత్వంపై కొన్ని శక్తులు కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నాయని వారి ఎడల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు.

దోచి, దాచుకున్న రాష్ట్ర సంపద పంపకాలు విషయంలో కుటుంబంలో వచ్చిన విభేదాలను కప్పిపుచ్చు కునే ప్రయత్నంలో భాగం గానే ప్రజా ప్రభుత్వం పై అవాకులు, చవాకులు పేలుతున్నారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యువత అనేక ఆశలతో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొం దని గత ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు చూపిం చడంలో వైఫల్యం చెందిందని విమర్శిం చారు. ఇందిరమ్మ రాజ్యం రాగానే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసి...గ్రూప్ 1,2 పరీక్షలను విజయవంతం గా నిర్వ హించమన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడ్డ మొదటి సంవత్సరం లోనే 56 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని... రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలన్నింటిని భర్తీ చేస్తామని పేర్కొన్నారు. యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు గాను 9 వేల కోట్ల పెట్టుబడి తో రాజీవ్ యువ వికాసం పథకాన్ని రాష్ట్ర అవతరణ దినోత్స వం అయిన జూన్ 2న ఎంపికైన యువతకు ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులకు 21వేల కోట్లతో రూ. 2 లక్షల రుణమాఫీ చేశామని, రైతు భరోసా కింద 18 వేల కోట్లు బడ్జెట్ లో పెట్టమని వివరించారు. పంటల బీమా పథకాన్ని అమలు చేస్తూనే, సన్న వడ్లు పండించిన రైతులకు క్వింటా ఒక్కింటికి రూ.5 వందలు బోనస్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు 5 లక్షల రూపాయల విలువైన ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, వైరా ఎమ్మెల్యే రాం దాస్ నాయక్, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్, దెయ్యం రేవంత్‌రెడ్డి

## పార్టీ అధినేతకు లేఖ రాయడమనేది తప్పేమీ కాదు : కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే24:** తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్, దెయ్యం రేవంత్‌రెడ్డి అంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వ్యాఖ్యలు చేశారు. ఆ దెయ్యాన్ని, శనిని ఎలా వదిలించాలన్న దాని పైనే తాము పనిచేస్తున్నామని అన్నారు. మాజీ సిఎం, బిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ ఎంఎల్‌సి కవిత లేఖ రాయడంపై కెటిఆర్ స్పందించారు. తమ పార్టీ అధినేతకు లేఖ రాయడమనేది తప్పేమీ కాదని వ్యాఖ్యానించారు. అన్ని పార్టీల్లో కోవర్టులు ఉంటారని, తమ పార్టీలో కూడా రేవంత్‌రెడ్డి కోవర్టులు ఉండొచ్చని చెప్పారు. సమయం వచ్చినప్పుడు తమ పార్టీలో ఎవరైనా కోవర్దులు ఉంటే వారంతట వారే బయటపడతారు అన్నారు. తమ పార్టీలో ప్రజాస్వామ్యం ఉందని, పార్టీ అధినేతకు సూచనలు చేయాలంటే లేఖలు రాయొచ్చని తెలిపారు. గతంలో కూడా తమ అధినేతకు సూచనలు సలహాలు ఇస్తూ అనేకమంది లేఖలు రాశారని తెలిపారు. పార్టీలో అంతర్గత విషయాలు.. అంతర్గతంగా మాట్లాడితేనే మంచిది అని, అది ఎవరైనా సరే అని పేర్కొన్నారు. పార్టీలో అందరం కార్యకర్తలమే..అందరం సమానమే అని.. ఇది అందరికీ వర్తిస్తుందని తెలిపారు. తమ పార్టీ అధినేత కెసిఆర్‌కు సూచనలు చేయాలంటే ఎవరైనా లేఖలు రాయొచ్చని అన్నారు.

# కవితను ఎట్టిపరిస్థితుల్లో బిజెపిలో చేర్చుకోమన్న డికె అరుణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే24:** ఎమ్మెల్సీ కవితపై బీజేపీ ఎంపీ డీకే అరుణ తాజాగా సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. శనివారం బీజేపీ స్టేట్ ఆఫీస్‌లో విలేకర్లతో మాట్లాడిన ఆమె... కవితను ఎట్టిపరిస్థితుల్లో బీజేపీలో చేర్చుకోమని అన్నారు. ఎవరిని బడితే వారిని పార్టీలో చేర్చుకోమని, పార్టీలో చేరుతామనే వాళ్లెవరో చూసి చేర్చుకుంటామన్నారు. అన్ వాంటెడ్ గెస్టులను పార్టీలోకి ఆహ్వానించబోమని తెలిపారు. ఇక, తండ్రి కేసీఆర్‌కు కవిత రాసిన రహస్య లేఖ ఎలా బయటకు వచ్చిందో ఫాదర్, సన్, డాటర్‌కే తెలియాలని అరుణ పేర్కొన్నారు.

# పోటీ నిర్వాహకులు నన్ను వేశ్యగా భావించారు

## మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణ

## ఆమె వైదొలగడంపై వివరణ ఇచ్చిన సంస్థ ఛైర్‌పర్సన్

## వివాదాస్పదంగా మారిన మిల్లా మాగీ 'ది సన్ న్యూస్' ఇంటర్వ్యూ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 24:** హైదరాబాద్‌లో జరుగుతున్న 72వ మిస్ వరల్డ్ పోటీల నుంచి మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ వైదొలగిన విషయం సంచలనంగా మారింది. 'ది సన్' న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ పోటీ నిర్వాహకులపై తీవ్ర ఆరోపణలు చేసినట్లు తెలిసింది. పోటీ నిర్వాహకులు తనను ఓ వేశ్యగా చూస్తున్నారంటూ సంచలన ఆరోపణలు చేశారు. అంతేకాదు తనతో కొందరు అగౌరవంగా ప్రవర్తించారని చెప్పుకొచ్చారు. వినోదం కోసం మమ్మల్ని వీధుల్లో తిప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు చాలా అసౌకర్యంగా అనిపించిందని, అందుకే మన స్తాపంతో పోటీల నుంచి తప్పుకున్నట్లు పేర్కొన్నారు. 'సమాజంలో మార్పు తీసుకురావడానికి, యువతలో స్ఫూర్తి నింపేందుకు నేను అక్కడికి వెళ్లాను. అయితే, అక్కడ పరిస్థితులు వేరు. కొందరిని సంతృప్తి పరిచేందుకు కోతుల్లా ప్రదర్శన ఇచ్చేందుకు మేం అక్కడున్నాం. అలాంటి పరిస్థితుల్లో ఉండాల్సి వస్తుందని నేను కలలో కూడా ఊహించుకోలేదు. చాలా అగౌరవంగా అనిపించింది. మనల్ని అక్కడ ఎంత తక్కువగా చూస్తున్నారో అర్థమైంది' అని ది సన్‌తో మిల్లా తన ఆవేదనను చెపుకొచ్చారు. ప్రస్తుతం ఆమె కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. కాగా, బ్రిటీష్ మీడియాలో ప్రచారంలో ఉన్న కథనాలపై మిస్ వరల్డ్ సంస్థ ఛైర్‌పర్సన్, సీఈఓ జూలియా మోర్లే వివరణ ఇచ్చారు. ఆ మేరకు ఒక ప్రకటనను విడుదల చేస్తూ మిస్ ఇంగ్లాండ్ మాగీ ఆరోపణలను ఖండించారు. ఈ నెల ప్రారంభంలో మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ తన తల్లి, కుటుంబ సభ్యుల ఆరోగ్యానికి సంబంధించి అత్యవసర పరిస్థితి కారణంగా ఈ పోటీల నుంచి విరమించుకునేందుకు అనుమతించాలని సంస్థను కోరినట్లు జూలియా మోర్లే తెలిపారు. మిల్లా పరిస్థితిని అర్థం చేసుకొని వెంటనే స్పందించి ఆమె కుటుంబ సభ్యుల సంక్షేమం తొలి ప్రాధాన్యతగా పరిగణించామన్నారు. తక్షణమే ఆమెను ఇంగ్లాండ్‌కు తిరిగి పంపే ఏర్పాట్లు చేసినట్లు స్పష్టం చేశారు. మిస్ మిల్లా మిస్‌వరల్డ్ పోటీల నుంచి వైదొలిగిన తర్వాత మిస్ ఇంగ్లాండ్ మొదటి రన్నరప్ మిస్ షార్లెట్ గ్రాంట్ ఇంగ్లాండ్ తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు ముందుకొచ్చారని ప్రస్తావించారు. మిస్ షార్లెట్ బుధవారం భారత్‌కు చేరుకున్నారని, మిస్ వరల్డ్ సోదరభావంతో ఆమెను పోటీల్లో పాల్గొనేందుకు అనుమతించామని ఆమె తెలిపారు. ఈ పోటీల్లో ఆమె పాల్గొంటున్నారని చెప్పారు. బ్రిటీష్ మీడియాలో ప్రచారంలో ఉన్న కథనాలు, కొన్ని యూకే మీడియా సంస్థలు మిల్లా మాగీ పోటీల్లో ఎదుర్కొన్న అనుభవాలపై తప్పుడు, అపవాదకరమైన కథనాలను ప్రచురించినట్లు సంస్థకు తెలియడంతో ఆ ఆరోపణలను ఖండిస్తూ ఆ కథనాలు పూర్తిగా నిరాధారమైనవని జూలియా మోర్లే తోసిపుచ్చారు. మిస్‌వరల్డ్ పోటీల ప్రారంభ సమయంలో మిస్ మిల్లా మాగీ స్వయంగా వ్యక్తపరిచిన భావాలు, ఎడిట్ చేయని వీడియో క్లిప్‌లు మిస్ వరల్డ్ సంస్థ విడుదల చేసింది. అందులో ఆమె ఆనందం, కృతజ్ఞత వంటి అనుభవాలను తెలుపుతూ మాట్లాడిన దృశ్యాలు కూడా ఉన్నాయని అన్నారు. తాజాగా ప్రచురితమైన తప్పుడు కథనాలు నిరాధా రమైనవని, ఆ ఆరోపణలు ఖండిస్తున్నామని ప్రకటిం చారు. మిస్ వరల్డ్ సంస్థ నిజాయితీ, గౌరవం, బ్యూటీ విత్ ఏ పర్పస్ అనే విలువలకు కట్టుబడి, నిబద్ధంగా పోటీలు కొనసాగుతు న్నాయని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో జూరియా మోర్లే ఇలాంటి ప్రకటనలు ప్రచురించే ముందు తగిన ఆధారాలు, వివరణతో ధ్రువీకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఇద్దరు వాంటెడ్ సైబర్ నేరగాళ్ల అరెస్టు

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** వరుసగా సైబర్ నేరాలకు పాల్పడి అమాయకులను ముంచిన కేసులో వాంటెడ్ నేరగాళ్లుగా వున్న ఇద్దరిని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) అరెస్టు చేసింది. దీనికి సంబంధించిన వివరాలను టిజిసిఎస్‌బి డిజి శిఖా గోయల్ శనివారం మీడియాకు వెల్లడించారు. నగ రంలోని జీడిమెట్ల ప్రాంతానికి చెందిన కొలనాటి నాగ శివ అలియాస్ జేమ్స్ (36) రాష్ట్రంలోని నిజామాబాద్, ఆర్మూర్ పోలీసు స్టేషన్లలో నమోదైన మూడు కే సుల్లో నిందితుడు. ఈ కేసులు తీవ్రమైనవి. అయితే నేరం చేశాక ఇతను విదేశాలకు పారిపోయాడు. ఇతనిపై లుకవుట్ నోటీసులు జారీ కాగా కోల్‌కతా విమానా శ్రయంలో దిగిన వెంటనే అక్కడి అధికారులు అరెస్టు చేశారు. దీనిపై టిజిసిఎస్‌బి అధికారులకు సమాచారం ఇవ్వగా వారు వెంటనే కోల్‌కతా వెళ్లి నాగశివను అరె స్టు చేసి హైదరాబాద్‌కు తీసుకువచ్చి రిమాండుకు తరలించారు. మరో కేసులో గుజరాత్‌లోని పోరుబందర్‌కు చెందిన హితేష్ అర్జన సౌమ్యా (29) తెలంగాణలో నమోదైన పలు సైబర్ నేరాలలో నేరగత్తె. కొంతకాలంగా పరారీలో వున్న ఈమెను ఢిల్లీలో అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలించి రిమాండుకు పంపారు.

# టిజి, ఎపిల్లో 1 నుండి థియేటర్ల మూత లేదు

## ఫిల్మ్ ఛాంబర్ వెల్లడి

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోని సినిమా థియేటర్లు బంద్ లేదని ఫిల్మ్ ఛాంబర్ ప్రకటించింది. రెండు రాష్ట్రాల్లో థియేటర్లను బంద్ చేయాలని ఎగ్జిబిటర్లు నిర్ణయించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అమలులో ఉన్న అద్దె ఆధారిత రెవెన్యూ మోడల్‌పై ఎగ్జిబిటర్ల అసంతృప్తి చెందడం ఈ నిర్ణయం వెనుక ప్రధాన కారణంగా ఉంది. అయితే ఈ వ్యవహారంపై హైదరాబాద్‌లో ఆల్ సెక్టార్ల మీటింగ్ జరిగింది. ఈ మీటింగ్ లో ప్రొడ్యూసర్లు, ఎగ్జిబిటర్లు వివిధ అంశాలపై చర్చించిన అనంతరం కీలక నిర్ణయం తీసుకున్నారు. ముందస్తుగా ప్రకటించినట్లుగా జూన్ 1 నుంచి థియేటర్ల బంద్ లేదని ఈ సందర్భంగా ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ దామోదర్ ప్రసాద్ ప్రకటించారు. సమావేశం అనంతరం సెక్రటరీ మీడియాతో మాట్లాడుతూ రెండు రాష్ట్రాల్లో చిత్ర ప్రదర్శనలు యథావిధిగా కొనసాగుతాయని ప్రకటించారు. ఇది ఆల్ సెక్టార్ల మీటింగ్ తర్వాత అందరూ కలిసి తీసుకున్న నిర్ణయం అని స్పష్టం చేశారు. ఈ సమస్యలను తామే పరిష్కరించుకుంటామని, ఈ సమస్యలపై ఈ నెల 30న కమిటీ వేస్తున్నట్లు ఫిల్మ్ ఛాంబర్ స్పష్టం చేసింది. దీంతో థియేటర్ల బంద్ వివాదం సమసిపోయింది.

# హైదరాబాద్‌కు మరో 800 ఇవి బస్సులు కేటాయించండి

## కేంద్రమంత్రిని కోరిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 24:** హైదరాబాద్‌కు మరో 800 ఎలక్ట్రిక్ బస్సులు (ఈవీ) కేటాయించాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం భేటీ అయ్యారు. ఇటీవల హైదరాబాద్‌కు 2000 ఇవి బస్సులు కేటాయించారని, ప్రస్తుత నగర అవసరాలను దృష్టిలో పెట్టుకొని పీఎంఈ డ్రైవ్ పథకం కింద అదనంగా 800 బస్సులు కేటాయించాలని కోరారు. ఆర్టీసీ డ్రైవర్లు, మెకానిక్‌లు బస్సు నిర్వ హణ చూసేలా హైబ్రిడ్ జీసీసీ మోడల్‌ను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర మంత్రికి సీఎం సూచించారు. తెలంగాణ ఆర్టీసీ డీజిల్ బస్సుకు రెట్రోఫిట్టెడ్ చేపట్టగా అది సఫలమైందని, ఆ బస్సు నగరంలో రాకపోకలు సాగిస్తోందని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సులకు రెట్రో ఫిట్‌మెంట్ అవకాశం కల్పించాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.



# మిస్ వరల్డ్ ఫ్యాషన్ ఫినాలేలో తళుక్కుమన్న తెలంగాణ డిజైన్లు

## పోచంపల్లి, గద్వాల, గొల్ల భామ చేనేత చీరలతో ర్యాంపు వాక్

## వందకుపైగా దేశాల భామలతో తెలంగాణ డిజైన్లకు ప్రపంచఖ్యాతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే24:** మిస్ వరల్డ్ వేదికపై మరోసారి తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలు తళుక్కున మెరిసాయి. శనివారం జరిగిన వరల్డ్ ఫ్యాషన్ ఫినాలే షోలో పోటీదారులు అందరూ తెలంగాణకు ప్రత్యేకమైన పోచంపల్లి, గద్వాల్ చీరలు ధరించి ర్యాంపుపై వాక్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన అంతర్జాతీయ ఖ్యాతి పొందిన పోచంపల్లి హ్యాండ్లూమ్ వస్త్రాలతో మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు మెరిశారు. వందకు పైగా దేశాల ప్రతినిధులు చీరకట్టులో సంప్రదాయబద్ధంగా కనిపించారు. అమెరికా కరెయ్బన్ దేశాలకు చెందిన సుందరీమణులు చేనేత వస్త్రాలతో ర్యాంప్ వాక్‌తో ఆకట్టుకున్నారు. ఇక యూరోప్ ఖండానికి చెందిన దేశాల ప్రతినిధులు గొల్ల భామల చేనేత చీరలతో మెప్పించారు. యూనెస్కో గుర్తింపు పొందిన గొల్ల భామల చేనేత వస్త్రాలతో తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా యూరోపియన్ దేశాల కంటెస్టెంట్లు మిస్ వరల్డ్ ఫ్యాషన్ షోలో రాంప్ వాక్ చేశారు. ఇక మిస్ ఇండియా నందిని గుప్తా ఎరుపు రంగు పటోలా లెహంగాలో తళుక్కు మన్నారు. తెలంగాణ చేనేత వస్త్రాలతో డిజైన్లు చేయడం ఆనందంగా, గర్వంగా ఉందని డిజైనర్ అర్చనా కొచ్చారు అన్నారు. దీని ద్వారా చేనేత చీరలకు ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి దక్కుతుందని తెలిపారు.

### మిస్ వరల్డ్ ఫ్యాషన్ ఫినాలేలో నాలుగు ఖండాల విజేతలు

మిస్ వరల్డ్ ఫ్యాషన్ ఫినాలేలో నాలుగు ఖండాల అందాల భామలు విజేతలుగా నిలిచారు. అమెరికన్ విభాగంలో టాప్ మోడల్ ఫైనల్ టైటిల్‌ను మార్టినిక్ దేశ ప్రతినిధి సాధించారు. ఆఫ్రికన్ విభాగంలో టాప్ మోడల్ ఫైనల్ టైటిల్‌ను నమీబియా ప్రతినిధి సాధించారు. యూరప్ విభాగంలో టాప్ మోడల్ ఫైనల్ టైటిల్‌ను ఐర్లాండ్ ప్రతినిధి సాధించారు. ఏషియా ఓషియాన విభాగంలో టాప్ మోడల్ ఫైనల్ టైటిల్‌ను మిస్ ఇండియా సాధించారు.

# ఎమోషనల్ మూవీ 'భైరవం'

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ మోస్ట్ అవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ భైరవం టీజర్, పాటలు, ప్రమోషనల్ కంటెంట్‌కు అద్భుత స్పందనతో, పాజిటివ్ బజ్‌తో ముందుకు దూసుకెల్తు తోంది. ఈ నేపథ్యంలో హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. **ఈ సినిమాకి దర్శకుడిగా విజయ్‌ని ఎంచుకోవ డానికి కారణం?** నాకు కమర్షి యల్ హీరోగా మంచి పేరు వచ్చిం ది. తర్వాత కొన్ని స్టైలిష్ సినిమాలు చేయడం జరిగింది. అప్పుడు మాస్ కనెక్ట్ అవుతున్నారా లేదా అనే ఆలోచన ఉండేది. అందరూ రిలేట్ చేసుకునే ఒక రూరల్ స్టోరీ చేయాలని ఉండేది. అలాంటి సినిమా కోసం చూస్తున్నప్పుడు ఈ కథ దొరికింది. ఈ కథని మన సెన్సిబిలిటీస్‌కి తగ్గట్టు ప్రజెంట్ చేసే గల దర్శకుడు విజయ్ అనిపించింది. నేను కూడా కొన్ని రీమిక్స్ చేశాను. **రోహిత్, మంచు మనోజ్ క్యారెక్టర్స్ గురించి?** రోహిత్, మనోజ్ ఇద్దరు కూడా చాలా ఇంపార్టెంట్ క్యారెక్టర్స్ చేస్తున్నారు. ముందు రోహిత్‌కి కలిసి ఈ క్యారెక్టర్ గురించి ఆయనకు చెప్పిన వెంటనే అంగీకరించారు. తర్వాత మిరాయ్ పోస్టర్లో మనోజ్‌ని చూసి ఆ క్యారెక్టర్‌కి మనోజ్ అయితే బాగుంటుందని ఆయనని సంప్రదించాం. ఆయనకు కూడా కథ నచ్చింది. ఈ కథకి వారిద్దరూ పర్ఫెక్ట్‌గా మ్యాచ్ అయ్యారు. ఈ కథకి ఇద్దరు కూడా చాలా ఎక్సైట్ అయ్యారు. **అతిథి శంకర్ గురించి?** అతిథి శంకర్ వెరీ నైస్ పర్సన్. వెరీ ఎనర్జిటిక్. మా అందరితో కలిసిపోయింది. తను చాలా మంచి యాక్టర్ అవుతుంది. తను మంచి సింగర్, డాన్సర్. చాలా టాలెంటెడ్. **ట్రైలర్‌లో ఒక పూనకం షాట్ ఉంది కదా.. దాని గురించి చెప్పండి?** నాకు మెయిన్‌గా నచ్చిన పార్ట్ అది. కథలో దాన్ని చాలా అద్భుతంగా వాడడం జరిగింది. ఆ సర్ ప్రైజ్‌ని ఆడియన్స్ చాలా ఎంజాయ్ చేస్తారు. చాలా ఎమోషనల్ ఇంపాక్ట్ ఇచ్చే సినిమా ఇది. ఈ సినిమా ట్రీట్మెంట్ చాలా కొత్తగా ఉంటుంది. మీరు ఒకవేళ తమిళ్ లో వెర్షన్ చూసినా కూడా ఈ సినిమా మీకు చాలా నచ్చుతుంది.


హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్

# 'కట్టలన్' టైటిల్ అనౌన్స్‌మెంట్

బిగ్గెస్ట్ పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ మార్కో విజయం తర్వాత క్యూబ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాత షరీఫ్ మహమ్మద్, తన తదుపరి ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా కట్టలన్ ను అనౌన్స్ చేశారు. ఇది పాన్‌ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న హైయాక్షన్ థ్రిల్లర్. ప్రముఖ నటుడు ఆంటోనీ వర్గీస్ (పేపే) హీరోగా నటిస్తున్నారు. దర్శకత్వం పాల్ జార్జ్. కాంతార 2కి సంగీతం అందించిన అజనీష్ లోకనాథ్ ఇప్పుడు షరీఫ్ మహమ్మద్‌తో చేతులు కలిపారు. ఈ సినిమాకి సంగీతంతో అజనీష్ మరోసారి ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ సంచలనంగా మారింది. వర్షంలో తడిచిన పేపే, చుట్టూ పడి ఉన్న మృతదేహాలు, ఏనుగు దంతాల మధ్య



నిలబడి వుండటం కథలో ఉండబోయే వైలెన్స్ సూచిస్తోంది. మార్కో స్థాయిని మించి ఉండ బోతోందని సంకేతాలు ఇస్తోంది. జైలర్, లియో, జవాన్, కూలీ లాంటి చిత్రాలకు టైటిల్ ఫాంట్స్ డిజైన్ చేసిన ఐడెంట్ ల్యాబ్స్ ఈ సినిమాకి కూడా టైటిల్ డిజైన్ చేశారు. కంటెంట్, మార్కెటింగ్ పరంగా క్యూబ్స్ ఎంటర్‌టైన్ మెంట్స్ కొత్త ప్రమాణాలను నెలకొల్పుతుండగా, పేపే హై ఇంటెన్సిటీ పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న తరుణంలో కట్టలన్ నిజంగా ఒక గొప్ప సినీ అనుభూతి కావడంలో సందేహమే లేదు. ఈ సినిమాకి పీఆర్ మార్కెటింగ్ వంశీ శేఖర్.

# హైదరాబాద్‌లో 'మెగా157' రెగ్యులర్ షూటింగ్

ఎంటర్‌టైన్‌మెంట్, చరిష్మాతో ప్రేక్షకుల ను అలరించేందుకు మెగాస్టార్ చిరంజీవి సిద్ధమయ్యారు. ఆయన హీరోగా నటిస్తున్న మెగా157 బ్లాక్‌బస్టర్ మేకర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొం దుతోంది. వరుస విజయాలు అందించిన అనిల్ రావిపూడికి ఇది చిరంజీవితో తొలి చిత్రం కావడం విశేషం. చిరంజీవి అభిమానులు ఎప్పటి నుంచో ఆయనను మళ్లీ పూర్తి స్థాయి హ్యూమరస్ క్యారెక్టర్‌లో చూడాల నుకుంటున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహూ గారపాటి, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సుశ్మిత కొనిదెల ఈ చిత్రాన్ని నిర్మి స్తున్నారు. ప్రెస్టీజియస్‌గా రూపొందుతున్న ఈ చిత్రా నికి శ్రీమతి అర్చన ప్రజెంట్ చేస్తున్నారు. నయన తార చిరంజీవికి జోడిగా నటిస్తున్నారు. తన అభిమాన హీరో మెగాస్టార్ చిరంజీవిని డైరెక్ట్ చేయాలన్న అనిల్ రావిపూడి నిరీక్షణకు తెరపడింది. హైదరాబాద్‌లో సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. మొదటి రోజు డైరెక్టర్ అనిల్ రావిపూడి చిరంజీవితో పాటు ఇతర నటీనటులపై ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. అనిల్ రావిపూడి లానే చిరంజీవి కూడా ఈ ప్రాజెక్ట్‌పై ఎంతో ఆసక్తిగా ఉన్నారు. తాజాగా సంక్రాంతికి





విడుదలైన సంక్రాంతికి వస్తున్నాం ఇండస్ట్రీ బ్లాక్ బస్టర్‌తో మంచి జోరు మీదున్న అనిల్ రావిపూడి, తన యూనిక్ ప్రమోషన్లతో సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నారు. టెక్నికల్ క్రూ పరిచయ వీడియో, తర్వాత నయనతార ప్రోమో వీడియో ఆడియన్స్‌ని కట్టిపడేసింది. ఈ చిత్రానికి సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. తమ్మిరాజు ఎడిటర్. రైటర్స్ ఎస్ కృష్ణ, జి ఆది నారాయణ స్క్రిప్ట్‌పై వర్క్ చేస్తున్నారు, ఎస్ కృష్ణ కూడా ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా పనిచేస్తున్నారు. ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్. ఈ సినిమా 2026 సంక్రాంతికి విడుదల కానుంది. నటీనటులు: మెగాస్టార్ చిరంజీవి, నయనతార, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: అనిల్ రావిపూడి నిర్మాతలు: సాహు గారపాటి, సుస్మిత కొణిదెల, బ్యానర్లు: షైన్ స్క్రీన్స్ గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ సమర్పణ: శ్రీమతి అర్చన సంగీతం: భీమ్స్ సిసిరోలియో డీవోపీ: సమీర్ రెడ్డి.

# థియేటర్ల బంద్‌పై తెలుగు ఫిలిం ఛాంబర్ క్లారిటీ

తెలుగు ఫిలిం ఛాంబర్ కార్యదర్శి కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ, ఇటీవల వినిపిస్తున్న కొన్ని వార్తలను బేస్ చేసుకుని ఈ మీటింగ్ పెట్టడం జరిగింది. దీనికై ఉదయం 11 గంటల నుండి ఫిలిం ఛాంబర్‌లో ఒక మీటింగ్ నిర్వహించాము. ఈ మీటింగ్‌కు రెండు తెలుగు రాష్ట్రాల ప్రముఖ నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు హాజరయ్యారు. ప్రస్తుతం థియేటర్ల పరిస్థితిపై ఉన్న కొన్ని సమస్యల గురించి చర్చలు జరగాయి. మే 1వ తారీకు నుండి థియేటర్లు మూతపడతాయని వార్త బయటకు వెళ్ళింది. కానీ అలా థియేటర్లు మూసి వేయడం అనేది జరగడం లేదు. అది పూర్తిగా ఊహాగానం మాత్రమే. ఈనెల 30వ తేదీన ఈసీ మీటింగ్ ఉండబో తుంది. ఆరోజు మూడు సెక్టార్లకు నుండి ఒక కమిటీ నిర్మించబోతు న్నాము. ఓ నిర్ణీత సమయంలోనే ఈ సమస్యకు పరిష్కారం వచ్చేలా ఆ కమిటీ పని చేయబోతుంది. దీనికి సంబంధించిన ఎటువంటి వార్తలేనా ఫిలిం ఛాంబర్ ఇంకా అనుసంధాన సంస్థల నుండి బయటకు వస్తే కేవలం ఆ వార్తలను మాత్రమే ప్రచారం చేయండి. అంతేకానీ బయటనుండి వేరే ఇతర వార్తలు ఏమైనా వస్తే వాటిని దయచేసి నమ్మకండి, ప్రచారం చేయకండి. ఎందుకంటే అటువంటి అబద్ధపు వార్తలు కేవలం చిత్ర పరిశ్రమలో అనవసరమైన ఆటంకాలు తీసుకొస్తున్నాయి. అలాగే ఈ విషయంపై అవసరమైతే ప్రభుత్వంతో కూడా మాట్లాడతాము. గతంలో కూడా కొన్ని సమస్యలకు ప్రభుత్వంతో కూర్చుని చర్చించడం జరిగింది. అదేవిధంగా ఇప్పుడు కూడా చర్చించబోతున్నాము. చిత్ర పరిశ్రమలో ఎటువంటి కష్టాలు వచ్చిన బయట వారు ఎవరు వచ్చి ఆ కష్టాల నుండి బయటకి తీసుకున్నారు. కేవలం ఇండస్ట్రీ మాత్రమే ఆ కష్టాలను స్వయంగా బయట పడుతుంది. అలాగే ఏదో ఒక సినిమాను టార్గెట్ చేసి థియేటర్లు బంద్ చేస్తున్నారు అనే వార్తను పూర్తిగా ఖండిస్తున్నాము. ఇండస్ట్రీకి మంచి జరిగే విధంగానే ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ఈ సమస్యల నుండి బయట పడి ముందుకు వెళ్తాము అన్నారు.



దిశా పటాని నయా లుక్



# 'పరమపద సోపానం' నుంచి లిరికల్ సాంగ్

టాలీవుడ్‌కి అర్ధనారి వంటి హిట్ సినిమాతో హీరోగా తెరంగేట్రం చేసి మంచి పాపులారిటీ సంపాదించుకున్న అర్జున్ అంబటి ఆ తర్వాత బిగ్ బాస్ రియాలిటీ షోతో ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. తాజాగా తెప్పసముద్రం వెడ్డింగ్ డైరీస్ వంటి వైవిధ్యమైన సినిమాల్లో నటిస్తూ దూసుకుపోతున్నారు. అతను హీరోగా రూపొందిన లేటెస్ట్ మూవీ పరమపద సోపానం. అచ్చమైన తెలుగు టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా ఓ ఇంటరెస్టింగ్ థ్రిల్లర్ ప్రేక్షకుల ముందుకు రానుంది. జెన్నీఫర్ ఇమ్మాన్యుయేల్ ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తుంది. ఎస్.ఎస్. మీడియా సంస్థపై గిడిమిట్ల శివ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గుడిమెట్ల ఈశ్వర్ ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవరిస్తున్నారు. అలాగే ఈ సినిమాకు గతంలో పూరి జగన్నాథ్ వంటి దిగ్గజ దర్శకుడికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసిన నాగ శివ పరమపద సోపానం చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్ ప్లే మరియు దర్శకత్వం అందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా జూలై 11న గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా ప్రమోషన్లను వేగవంతం చేస్తూ ముందుగా చిన్ని చిన్ని తప్పులేవో అనే లిరికల్ సాంగ్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. మాస్ మహారాజ్ రవితేజ ఈగల్ వంటి సినిమాతో సంగీత దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న దేవ్ జాండ్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. చిన్ని చిన్ని తప్పులేవో పాటకి ఆయన అందించిన ట్యూన్ ట్రెండీగా ఉంది. సింగర్స్ పృథ్వీ చంద్ర, అదితి బావరాజు ఆలపించిన విధానం.. రాంబాబు గోశాల అందించిన సాహిత్యం యువతని ఆకర్షించే విధంగా ఉందని చెప్పాలి. విడుదలైన కాసేపటికే ఈ పాటకి సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ లభించింది. సినిమా కూడా ఈ పాటలనే అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని చిత్ర యూనిట్ సభ్యులు విశ్వసిస్తున్నారు.



# 26న 'డకాయిట్-ఏక్ ప్రేమ్ కథ' గ్లింప్స్ రిలీజ్

అడివి శేష్ మోస్ట్ ఎవైటెడ్ పాన్‌ఇండియా యాక్షన్ డ్రామా డకాయిట్ ఎక్సయిటింగ్ సినిమాటిక్ ఎక్సపీరియన్స్‌ని అందించ బోతోంది. మృణాల్ ఠాకూర్ ఈ చిత్రంలో కథానాయిక నటిస్తోంది. ప్రముఖ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ ఈ ప్రాజెక్ట్‌లో ఒక పవర్ ఫుల్ పాత్రని పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ఒక ఎక్సయి టింగ్ అప్డేట్‌తో వచ్చారు. డకాయిట్ ఫైర్ గ్లింప్స్ మే 26న రిలీజ్ చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు. అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో అడివి శేష్ ఇంటెన్స్ లుక్‌లో దూరంగా ట్రైన్, కార్ ఫైర్ యాక్సిడెంట్‌ని చూస్తూ కనిపించడం ఫైర్ గ్లింప్స్‌పై క్యూరియాసిటీని పెంచుతోంది. షనీల్ డియో దర్శకత్వం వహించిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పిస్తోంది. డకాయిట్ కథ, స్క్రీన్‌ప్లేను శేష్, షనీల్ డియో సంయుక్తంగా రూపొందించారు. హిందీ, తెలుగు భాషలలో ఏకకాలంలో షూటింగ్ జరుగుతున్న మూవీ ఆడియన్స్‌కి గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతోంది.



# సౌమిత్ రావు, శ్రేయాసి సేన్ జంటగా 'నిలవే'

సౌమిత్ రావు, శ్రేయాసి సేన్ జంటగా నటించిన నిలవే చిత్రానికి సౌమిత్ రావు, సాయి వెన్నం దర్శకత్వం వహించారు. తాహెర్ సినీ టెక్ సౌజన్యంతో సాయి వెన్నం, గిరిధర్ రావు పోలాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి పాత్రల్ని పరిచయం చేశారు. సంతోషం, నమ్మకం, అలక, పిలుపు అంటూ అన్ని రకాల ఎమోషన్స్‌కు సంబంధించిన నిలవే పోస్టర్‌లను రిలీజ్ చేశారు. అనంతరం చిత్రయూనిట్ మాట్లాడుతూ, హీరో సౌమిత్ రావు మాట్లాడుతూ, నిలవే ఓ మంచి మ్యూజికల్ లవ్ డ్రామాగా రాబోతోంది. అంతా కొత్త వాళ్లం కలిసి చేస్తున్నాం. కొత్త వాళ్లు కూడా మంచి చిత్రాలను తీస్తారు. మేం ఎంతో నిజాయితీతో ఈ మూవీని చేశాం. మా కంటెంట్ బాగుందని ఆడియెన్స్ చెప్పాలి. మా సినిమా బాగుందని ఆడియెన్స్ ఫీల్ అయ్యేలా చేయాలని ప్రయత్నిస్తున్నాం. మా మూవీని ఆడియెన్స్ వద్దకు తీసుకెళ్లేందుకు మీడియా సహకరించాలి. నిజాయితీకి అర్థం ఉంటే అది మా నిలవే సినిమా. మా చిత్రం అందరినీ సర్ ప్రైజ్ చేస్తుంది అని అన్నారు. దర్శకుడు సాయి వెన్నం మాట్లాడుతూ, మా పేర్లు ఎవ్వరికీ



తెలియకపోవచ్చు. మాది చిన్న టీం కావొచ్చు. మాది చిన్న ఐడియా కావొచ్చు. కానీ మా కాన్సెప్ట్, మా సినిమా చాలా పెద్దగా ఉంటుంది. ఇదొక అందమైన ప్రేమ కథ. ఓ వ్యక్తి జీవితంలో జరిగే ప్రయాణమే నిలవే. మ్యూజిక్‌ని లవ్‌తో చూపించాలని అనుకున్నాం. మేం కథ పైన ప్రేమతో ఎంతో కష్టపడి నిలవే చిత్రాన్ని తీశాం. టీజర్ చూస్తే నిజాయతీగా ఉంటుంది. ఎక్స్‌పోజింగ్ లేదని, డైలాగుల్లో బూతులు లేవని, వైరల్ అవ్వదని చాలా మంది చెప్పారు. కానీ మా కంటెంట్ మాత్రమే చెప్పాలని టీజర్ కట్ చేశాం. నిలవే చాలా మంచి సినిమా. అందరూ మా సినిమాకు సపోర్ట్ చేయండి అని అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ కళ్యాణ్ నాయక్ మాట్లాడుతూ, నిలవే టైంకి నా చేతిలో ఒక్క సినిమా కూడా లేదు. కానీ నా మీద నమ్మకంతో సినిమాను ఇచ్చారు. ఈ మూవీకి కొత్తమ్యూజిక్‌ను ఇచ్చాం. సినిమా, కథ నుంచే ఇంత మంచి సంగీతం వచ్చిందని నేను నమ్ముతున్నాను. ఈ మూవీని నేను జీవితాంతం గుర్తు పెట్టుకుంటాను. మంచి చిత్రానికి అందరూ సపోర్ట్ చేయాలి.

# 'గుర్తింపు' ఫస్ట్ లుక్

స్వస్తిక్ విజన్స్ సమర్పణలో గంగా ఎంటర్టైన్మెంట్స్ నిర్మాణంలో కేజేఆర్ హీరోగా తెన్‌పతియాన్ దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోన్న చిత్రం గుర్తింపు. స్పోర్ట్స్ కోర్ట్ డ్రామాగా రాబోతోన్న ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. యథార్థ సంఘటనల ఆధారంగా గుర్తింపు చిత్రాన్ని తెరకెక్కిస్తు న్నారు. నిర్మాత మహేశ్వర్ రెడ్డి మూలి మాట్లాడుతూపేదరికంలో ఉన్న ఓ వ్యక్తి.. తన కలల్ని నెరవేర్చు కునేందుకు క్రీడా రంగంలో ఎదిగిన తీరు, క్రీడా రంగంలో గుర్తింపు కోసం పడిన శ్రమ, చేసిన ప్రయాణం, ఎదుర్కొన్న సవాళ్లను అందరికీ కనెక్ట్ అయ్యేలా ఎమోషనల్ డ్రామాగా గుర్తింపు సినిమాను రూపొందిస్తున్నా. ఇప్పటికి 85 శాతం షూటింగ్ పూర్తయింది. ఇంతకు ముందు మా సంస్థలో శివ కార్తికేయన్ చిత్రాన్ని వరుణ్ డాక్టర్ పేరుతో అనువదించి మంచి విజయాన్ని అందుకున్నా. ఇటీవల అశ్విన్ బాబు హీరోగా శివం భజే చిత్రం నిర్మించాను అని తెలిపారు. స్పోర్ట్స్, కోర్ట్ డ్రామాగా రానున్న ఈ గుర్తింపు చిత్రంలో కేజేఆర్, సింధూరి విశ్వనాథ్, విజి వెంకటేష్, రంగరాజ్ పాండే, మన్సూర్ అలీ ఖాన్, రమా, మోహన్ రామ్, ఆంటోనీ, అజిత్ ఘోషి, విమల్, ఇజబెల్లా, షాన్, దీపిక, జానకి, అరుల్ జ్యోతి వంటి వారు ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి



సంగీతం: జిబ్రాన్, కెమెరామెన్: ఎ.విశ్వనాథ్, యాక్షన్: పీటర్ హెయిన్, ఎడిటర్: శాన్ లోకేష్, ఆర్ట్ డైరెక్టర్: రాము తంగరాజ్, నిర్మాణం: స్వస్తిక్ విజన్స్, గంగా ఎంటర్టైన్మెంట్స్, దర్శకుడు: తెన్‌పతియాన్.

# ముడతలూ, మచ్చలూ లేకుండా..

30వ పడిలోకి అడుగు పెట్టగానే... వృద్ధాప్య ఛాయలు మొదలైపోయాయని బాధపడేవారే ఎక్కువ. ఈ సమస్య నుంచి బయటపడటానికి ఏవేవో మార్గాలను కనిపెట్టెడతారు. వాటిలో మాయిశ్చరైజర్ల వాడకం ఒకటి. అయితే, సరైన వాటిని ఎంపిక చేసుకోకపోయినా, రాసుకునే విధానం తెలియకపోయినా... సమస్య మరింత జటిలం అవుతుంది. అసలు దీన్నెల వాడాలంటే...



★ చాలామంది పొడిబారిన చర్మంపై మాయిశ్చరైజర్ రాస్తుంటారు. అలాకాకుండా చర్మం కాస్త తడిగా ఉన్నప్పుడు మాత్రమే దీన్ని రాయాలి. అప్పుడే ప్రభావవంతంగా పనిచేస్తుంది.

★ ఇప్పుడంతా ఉరుకులూ, పరుగులే... ఆ కంగారులో దీన్ని రాసుకొని, వెంటనే మేకప్ వేసుకునే వాళ్లే ఎక్కువ. దీనివల్ల చర్మకణాలు మూసుకుపోయి, వృద్ధాప్య ఛాయలు తొందరగా వచ్చేస్తాయట. అందుకే దీన్ని రాసుకున్నాక 1015 నిమిషాలైనా ఆరనివ్వాలి. అప్పుడే అనుకున్న స్థాయిలో ఫలితం ఉంటుంది.

★ చాలా మాయిశ్చరైజర్స్‌లో చర్మానికి హాని చేసే రసాయనాలు ఉంటాయి. అందుకే వీటి ఎంపికలో సహజ సిద్ధమైన వాటితో తయారైన వాటికి ప్రాధాన్యత ఇవ్వండి. ఒకవేళ వేరే ఉత్పత్తులు వాడినా... తయారీలో వాడే వస్తువులు, స్థాయిలూ మీ చర్మతత్వానికి సరిపోతాయో లేదో తెలుసుకుని... వైద్యుల సలహా మేరకు తీసుకుంటేనే మేలు.

★ చర్మ సంరక్షణలో ముఖానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి... మెడను అలానే వదిలేస్తారు. దాంతో పిగ్మెంటేషన్, ముడతలు పడి... ఎక్కువ వయసు వారిలా కనిపిస్తారు. కాబట్టి ముఖంతో పాటూ మెడకు దీన్ని రాయాలి.

★ వాడుకలో పరిమాణమూ ముఖ్యమే. ఏ చర్మతత్వానికి ఎంతమేర మాయిశ్చరైజర్ వాడొచ్చో తెలుసుకోవాలి. అలాకాకుండా, ఎక్కువ, తక్కువ రాస్తే అనుకున్న స్థాయిలో ఫలితాలు ఉండవు ఆ స్కిన్‌ను కాబట్టి మాయిశ్చరైజర్స్ అవసరం లేదనుకుంటారు చాలామంది. కానీ దీనికీ ఇవి అవసరమే. □

# అక్కడ హైహీల్స్‌కు ప్రభుత్వ అనుమతి అవసరం

కొన్ని ప్రాంతాల్లో ఆమలు చేసే వింత నిబంధనలు విస్మయానికి గురి చేస్తుంటాయి. అలాంటిదే కార్మెల్ బై ది సీ' నగరంలో ఉన్న ఈ నిబంధన



అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న ఈ చిన్న నగరంలో కాళ్లకు రెండు అంగుళాల కంటే ఎత్తయిన హై హీల్స్ ధరించడం నిషేధం ఒకవేళ ధరించాలని ఎవరైనా ముచ్చటపడినా స్థానిక ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ఈ నగరంలోని బీచ్, చారిత్రక కట్టడాలు, ప్రకృతి అందాలు పర్యాటకుల్ని బాగా ఆకట్టు కుంటాయి. ఇక్క సైప్రెస్, పైన్ చెట్లు ఎక్కువ. ఇవి భారీగా పెరగడంతో వాటి పేర్లు నగరమంతా వ్యాపించాయి. రోడ్లకు ఇరువైపులా పాదదారుల కోసం ఏర్పాటుచేసిన పేవ్‌మెంట్లు పేర్ల పెరుగుదల కారణంగా దెబ్బతింటున్నాయి. ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా ఫలితం ఉండల్లేదు. అలాంటిచోట్ల హైహీల్స్‌తో నడిస్తే కిందపడిపోయే ప్రమాదముంది. అందుకే 1963లోనే అప్పటి నగర అటార్నీ హైహీల్స్‌పై నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అనుమతి తీసుకున్నవారు హైహీల్స్‌తో నడిచి పడిపోతే దానికి ప్రభుత్వం బాధ్యత వహించదు. కోర్టులో దావా వేయలేరు. □

# లక్ష్య సాధన కోసం కష్టపడి ..



### ప్రసవిమంచిన 14 రోజులకే !

కలెక్టరు కావాలన్నది ఆమె కల. దాన్ని నెరవేర్చుకోవడానికి చివరగా ఆరోసారి ప్రయత్నం చేసింది. సరిగ్గా పరీక్షకు 14 రోజుల ముందు మగబిడ్డను ప్రసవించింది. అయినా అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంది. 45వ ర్యాంకునూ సాధించిన మాళవిక జినాయర్ మరెందరికో స్ఫూర్తి నింపింది. యూపీఎస్సీ మెయిన్స్ పరీక్షలు జరుగుతున్నాయి. అభ్యర్థులంతా ఏకాగ్రతగా రాయడంలో 7 మంది మునిగిపోయారు. మాళవిక దృష్టి అంతా పరీక్షాహాలుకు బయటే ఉంది. చిన్న చప్పుడైనా బాబు ఏడుస్తున్నాడేమో అన్న భ్రమకు లోనయ్యేది. ప్రశ్నాపత్రం చూసిన వెంటనే తెలిసి రావడంతో మొదట్లో సంతోషమేసినా, తీరా రాయడం మొదలుపెట్టేసరికి బాబు గుర్తుకొచ్చి ఏకాగ్రత పెట్టలేక ఆందోళనకు గురైంది. అంతలోనే లక్ష్యం గుర్తొచ్చింది. ఆ తర్వాత ఆమె కలం క్షణం కూడా ఆగలేదు.

ఒత్తిడి అలసట ! 2020లో యూపీఎస్సీ రాసింది. కానీ ర్యాంకు సాధించలేకపోయింది. తిరిగి 2022లో 172వ ర్యాంకుతో ఐఆర్ఎస్ ఆఫీసర్‌గా ఉద్యోగంలో చేరింది. చిన్నప్పటి నుంచి కలెక్టరు కావాలని కల కన్నాను. అందుకే నా ఆశయాన్ని సాధించాలనే ప్రయత్నాన్ని మానుకోలేదు. అలా అయిదుసా రాసినా ఫలితం దక్కలేదు. నందగోపంతో వివాహమైంది. చివరి ప్రయత్నంగా ఆరోసారి రాయాలనుకున్నప్పుడు గర్భం దాల్చాను. అదే సమయంలో మావారు ఐపీఎస్ శిక్షణలో ఉన్నా ఓవైపు ఉద్యోగం, మరో వైపు పరీక్షకు సిద్ధమయ్యే దాన్ని. పరీక్షా తేదీకి 14 రోజులముందు ప్రసవించా. అమ్మను అయ్యాననే సంతోషం ఓవైపు, చివరి అవకాశం... ఇవన్నీ తీవ్ర అలసట, ఒత్తిడికి గురి చేశాయి. కూర్చో వడమూ కష్టంగా ఉండేది. పసిబిడ్డతో పరీక్ష ఎలా రాయగలవు అన్నారు తెలిసిన వాళ్లంతా. ఆ సమయంలో నా కుటుంబం చేయూతగా నిలిచింది.

### భయం దాటి విజయం !

ఏడు సంవత్సరాల కష్టం, ఆప్షనల్ మార్పు... వీటన్నింటికంటే భయమే తనను ఆపిందంటారు. కర్ణపు శ్రీనివాస కీర్తిరెడ్డి. అది దాటాకే సివిల్స్‌లో 316వ ర్యాంకు సాధ్యమైంది అంటున్నారామె. సివిల్స్ రాస్తే చాలామందిపై సానుకూల ప్రభావం చూపొచ్చు. ప్రజలకు సాయం చేయొచ్చు... ప్రయత్నించు అన్న నాన్న మాటతో సివిల్ సర్వీసెస్ మీద దృష్టిపెట్టా. మాది కడప. నాన్న కర్ణపు చెలమారెడ్డి, అమ్మ శ్రీకృష్ణ ఇద్దరూ ఎల్వీసీ ఉద్యోగులే. నాన్న పదవీ విరమణ పొందారు. పాఠశాల విద్యాభ్యాసమంతా కడపలోనే సాగింది. ఆపై బిట్స్ పిలానీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశా. గ్రాడ్యుయేషన్ పూర్తవ్వగానే సివిల్స్‌పై దృష్టి పెట్టింది. అప్పుడు ఆప్షనల్గా ఫిజిక్స్ తీసుకున్నా. కష్టపడటం వరకూ బాగానే కష్టపడ్డా. అయినా ఏదో అనుమానం. 'సివిల్స్ మనకురాదేమో' అన్న భయం. దాంతోనే తొలి మూడు ప్రయత్నాల్లో విఫలమయ్యా. తరవాత నాకు పెళ్లైంది. పొలిటికల్ సైన్స్, ఇంటర్నేషనల్ రిలేషన్ ఆప్షన్‌లా తీసుకున్నా. నిజానికి ఫిజిక్స్ బాగా చదివాననుకున్నా. తీరా మార్కులు రాలేదు. అందుకే ఆప్షనల్ మార్చుకున్నా. కాకపోతే ఎక్కువ కష్టపడాల్సి వచ్చింది. తిరిగి మొదలు పెట్టాననే చెప్పాలి. అయితే ఇష్టంగా చదివా. కొత్త ఉత్సాహం సాధించాలన్న పట్టుదలతో ప్రయాణం మొదలు పెట్టా గతసారి ఇంటర్వ్యూ వరకూ వెళ్లా. తీరా తుది జాబితాలో పేరు లేదు ఈసారి అదే ఉత్సా హంతో ప్రయత్నించా. 316వ ర్యాంకు సాధించా.





### అమ్మ కష్టం నాన్న కల...

ఓడిపోయినప్పుడల్లా తిరిగి ప్రయత్నించాలి. అప్పుడే అనుకున్న గమ్యాన్ని చేరుకోగలం. అంబటి యామిని లక్ష్మీదేవి ఈ కోవకు చెందిన వారే. తాజా యూపీఎస్సీ ఫలితాల్లో 581వ ర్యాంకు దర్శించుకున్నారు. బాగా చదువుకోవాలి..చుట్టూ ఉన్న వాళ్లకి తోచిన సహాయం చేయాలి ఇదే ఎప్పుడూ చెప్పేవారు నాన్న మాతో. ఐఎఎస్ అవ్వాలనే లక్ష్యం ఏర్పడింది ఆయన వల్లే, నేను నాలుగో తరగతి చదువుతున్నప్పుడే ఆయన చనిపోలేదు. కానీ నాన్న మాత్రం మమ్మల్ని విడిచి వెళ్లలేదు. ఇది వాళ్ల కష్టానికి ఇప్పుడు ప్రతిఫలం దక్కింది. చిన్నప్పట్నుంచీ చదువులో చురుకే నవోదయలో పదో తరగతి చదివాక, ఇంటర్ సీసీ హైదరాబాద్‌లో పూర్తి చేసింది. 97 శాతంతో తెలంగాణ స్టేట్ ఫస్ట్ ర్యాంకును ఎక్కువగా ఉంది. పర్వతాలు, నదులు, నాగరికత, భూభాగాల విభజన లాంటి అంశాలన్నీ మూలాల నుంచీ తెలుసుకోవడం నాకు ఇష్టం. అందుకే డిగ్రీ జాగ్రఫీలో ఆనర్స్ చేయాలనుకున్నా. అందుకు మంచి యూనివర్సిటీల గురించి వెతకడం మొదలుపెట్టా. అప్పుడే ఢిల్లీలోని మిరాండా హౌస్ కాలేజీకి తెలిసింది. దేశంలోనే అత్యుత్తమ కాలేజీలో ఇది ఒక్కటి. మెరిట్ విద్యార్థిని కావడం వల్ల సీటు కూడా సులువుగానే దొరికింది. కానీ ఆర్థిక సమస్యలతో వెళ్లాలా? వద్దా అన్న ఆలోచనలో పడ్డాను. అమ్మే ధైర్యం చెప్పి పంపింది అనే యామిని సివిల్స్‌లోనూ దాన్నే ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంపిక చేసుకుంది. డిగ్రీ పూర్తయ్యాక ఢిల్లీలో ఉండి సివిల్స్ శిక్షణ తీసుకుంటే మంచిదన్నారు అంతా. కానీ అది ఆర్థిక భారం. అందుకే ఊరు వచ్చేశా. తర్వాత కొవిడ్. దాంతో సంవత్సరం ఇంట్లోనే సమయం వృథా చేయకూడదని ఆన్‌లైన్ తరగతుల్లో చేరాను. పరిస్థితులు కుదురిన తరువాత, 2022లో హైదరాబాద్‌లో వచ్చి స్నేహితులతో కలిసి పరీక్షలకు సన్నద్ధమయ్యారు. రోజులో 7-8 గంటలు చదివేదాన్ని. పరీక్షల సమయంలో అయితే ఇంకా ఎక్కువే. మనం ఎంతసేపు చదివాం అన్నదాని కన్నా.. ఎంత క్వాలిటీగా చదివాం అనే దానిపైనే ఫలితం ఆధాపడుతుంది. ఈ సమయం లో నాకెప్పుడు ఒత్తిడి అనిపించినా.. స్నేహితులతో చిట్‌చాట్ చేసేదాన్ని. వాళ్లే నా స్ట్రెస్ బస్టర్స్ మొదటి సారి ప్రిలిమ్స్ వరకే చేరుకోగలిగా. ఈ రెండో ప్రయత్నంలో 591వ ర్యాంకు సాధించాను. దీంతో సరిపెట్టుకుని ఆగిపోను. నా లక్ష్యం ఐఎఎస్. దాని కోసం మళ్లీ ప్రయత్నిస్తా అంటోంది యామిని. □

**చెలి చిట్కా** బజ్జీలు కరకర లాడాలంటే శనగ పిండిని బియ్యపు పిండిని తీసుకోండి దానిలో తగిన మోతాదులో ఉప్పు కారం వేయండి. తర్వాత చిడికెడుసోడా ఉప్పు కొద్దిగా బేకింగ్ పౌడర్ కొద్దిగా బొంబాయి రవ్వ, వేడినీరు పోసి బాగా కలపాలి. ఆ మిశ్రమంలో బంగాళా దుంప అరటికాయ నేతి బీరకాయ కాలీ ఫ్లవర్ ముక్కలను ముంచి దోరగా వేయించండి. □

# టేస్టీ టేస్టీ టిక్కాలు

ఆదివారం ఇంట్లో అందరూ ఉండే టైమ్‌లో సాయంకాలం చిన్నారుల చిట్టి బొజ్జ నింపడానికి... రకరకాల స్నాక్స్ అందివ్వొచ్చు. మురుకులు, చెగోడీలు, అప్పాలు.. ఎప్పుడూ ఇవేనా అనే చిచ్చర పిడుగులకు టేస్టీ టేస్టీ వెరైటీ టిక్కాలను చేసి పెట్టండి ఇష్టంగా తింటాం..

## పనీర్‌తో..

**కావాల్సినవి :** పనీర్-200 గ్రా. పెరుగు-400 గ్రా. పసుపు-అర చెంచా, కారం-రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, అల్లంవెల్లుల్లి ముద్దు, జీలకర్ర పొడి, ధనియాల పొడి- చెంచాన్నర చొప్పున, గరంమసాలా, చాట్ మసాలా- చెంచా చొప్పున, నిమ్మకాయ-ఒకటి (రసం తీసి పెట్టుకోవాలి), కసూరీ మేథీ- చెంచా, శనగపిండి- రెండు చెంచాలు (ఇష్టమైతే), కార్న్‌ఫ్లోర్-చెంచా, క్యాప్సికమ్ (పసుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగుల్లో) కొన్ని ముక్కలు (పెద్దగా), ఉల్లిపాయ-ఒకటి (పెద్ద ముక్కలుగా), నూనె-తగినంత.



**తయారీ :** పెద్ద గిన్నెలో పెరుగు, కారం, పసుపు మిరియాల పొడి తగినంత ఉప్పు, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరంమసాలా, చాట్ మసాలా, అల్లంవెల్లుల్లి ముద్ద, నిమ్మరసం, కసూరీ మేథీ వేసి కలపాలి. ఆ తర్వాత పదార్థాలు కలిసిపోయేలా బాగా గిలక్కొట్టాలి. దాంతో చిక్కటి క్రీమ్‌లా తయారవుతుంది. కావాలనుకుంటే శనగ పిండి కలపొచ్చు. కార్న్‌ఫ్లోర్‌నూ జత చేయాలి. బెల్‌పెప్పర్‌లను విత్తనాలను తీసేసి పెద్ద ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. ఉల్లిపాయలను కూడా. పెద్ద పాత్రలో కూరగాయ ముక్కలతోపాటు పన్నీర్ ముక్కలనూ జత చేయాలి. బెల్‌పెప్పర్‌లను విత్తనాలను తీసేసి పెద్ద ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. ఉల్లిపాయలను కూడా. పెద్ద పాత్రలో కూరగాయ ముక్కలతోపాటు పన్నీర్ ముక్కలనూ జత చేయాలి. వీటిపై మారినేట్ చేసిన ద్రవం పోసి ముక్కలకు పట్టేలా బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ఓ మూడు గంటలు నాననివ్వాలి. ఆ తర్వాత పన్నీర్, క్యాప్సికమ్స్, ఉల్లిపాయ ముక్కలను స్టిక్‌కు గుచ్చాలి. పొయ్యి మీద గ్రిల్ పాన్ పెట్టి నూనె రాసి పనీర్ గుచ్చిన పుల్లలను పెట్టాలి. రెండు నిమిషాలు మూత పెడితే చక్కగా మగ్గుతాయి. ఇప్పుడు మరో వైపు తిప్పాలి. అవసరమైతే కాస్త నూనె రాయొచ్చు. అన్ని వైపులా చక్కగా కాలే వరకు తిప్పుతూ ఉండాలి. గ్రిల్ పాన్ లేనివారు సాధారణ పాన్ పై కూడా చేసుకోవచ్చు. చివరగా చక్కగా వేగిన పనీర్ టిక్కాలను ఆమ్‌చూర్ చల్లి తింటే చాలా బాగుంటాయి.

## గోబీతో..



**కావాల్సినవి :** కాలీఫ్లవర్ ముక్కలు-20, ఉప్పు- తగినంత,వేడినీళ్లు-మూడు కప్పులు.

**మారినేషన్ కోసం :** పెరుగు-అర కప్పు, కారం, కసూరీ మేథీ-చెంచా చొప్పున, పసుపు- పావు చెంచా, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరంమసాలా- అర చెంచా చొప్పున, ఉప్పు- తగినంత, నిమ్మరసం, వేయించిన శనగపిండి-రెండు చెంచాల చొప్పున, నూనె-తగినంత, అల్లం వెల్లుల్లి ముద్ద- చెంచా.

**తయారీ :** పెద్ద గిన్నెలో కాలీఫ్లవర్ ముక్కలు, ఉప్పు, వేడినీళ్లు పోసి కలిపి అయిదు నిమిషాలు పక్కన పెట్టాలి. ఆ తర్వాత నీళ్లని పారబోసి పక్కన పెట్టాలి. మరో గిన్నెలో పెరుగు, కారం, పసుపు, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరంమసాలా, కసూరీ మేథీ, ఉప్పు, నిమ్మరసం, అల్లంవెల్లుల్లి ముద్ద,శనగపిండి.. ఇలా అన్నింటినీ ఒకదాని తర్వాత మరొకటి వేసి బాగా కలపాలి. ఆ తర్వాత కాలీఫ్లవర్ ముక్కలు, కాస్తంత నూనెను చేర్చిబాగా కలియబెట్టాలి. ఈ పూర్తి మిశ్రమాన్ని అరగంట ఫ్రిజ్‌లో పెట్టాలి. పొయ్యి వెలిగించి పాన్ పెట్టి రెండు చెంచాల నూనె వేసుకోవాలి. అది కాగిన తర్వాత మారినేట్ చేసి గోబీ మిశ్రమాన్ని పాన్‌లో సమంగా పరిచి మంటను మధ్యస్థంగా పెట్టి ముక్కలు పూర్తిగా ముదురు గోధుమ రంగులోకి వచ్చే వరకు ఫ్రై చేయాలి. ఇప్పుడు వీటిని పొడవైన పుల్లలకు గుచ్చాలి. మరో పొయ్యి మీద గ్రిల్ పాన్ పెట్టి ఈ పుల్లలను దానిమీద పెట్టి కాస్తంత నూనె రాస్తూ అన్ని వైపులా వేగేలా చక్కగా వేయించాలి.

## మష్రూమ్‌తో..



**కావాల్సినవి :** పుట్టగొడుగులు-పది, ఉల్లిపాయ-సగం (పెద్ద ముక్కలుగా), ఆకుపచ్చ, ఎరుపు క్యాప్సికమ్-పావు ముక్క (పెదనద ముక్కలుగా) చొప్పున, గడ్డపెరుగు-అర కప్పు, శనపిండి-రెండు చెంఆచలు, పసుపు, జీలకర్ర పొడి, వాము-పావు చెంచా చొప్పున, కారం - చెంచా, అల్లం వెల్లుల్లి ముద్ద, ధనియాల పొడి, గరంమసాలా, కసూరీ మేథీ-అర చెంచా చొప్పున, నిమ్మరసం -రెండు చెంచాలు, ఉప్పు-తగినంత, నూనె-అయిదు చెంచాలు, చాట్ మసాలా-చిటికెడు.

**తయారీ :** పుట్టగొడుగులు, కూరగాయ ముక్కలు, రోస్టింగ్ కోసం నూనె, చాట్ మసాలా తప్పించి మిగతా పదార్థాలనినంటినీ పెదనద పాత్రలో వేసి బాగా కలపాలి. చిక్కటి మిశ్రమం వచ్చేవరకు కలుపుతూ ఉండాలి. దీంట్లో పుట్టగొడుగులు, ఉల్లిపాయ, క్యాప్సికమ్ ముక్కలు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని అరగంట లేదా రాత్రంతా ఫ్రిజ్‌లో పెట్టాలి. మారినేషన్ పూర్తయిన తర్వాత పుట్టగొడుగులు క్యాప్సికమ్, ఉల్లిపాయ ముక్కలను పుల్లలకు గుచ్చాలి. పొయ్యి మీద పాన్/గ్రిల్ పాన్ పెట్టి నూనె వేసి వీటిని వేయించాలి. టిక్కాపై నూనె వేస్తూ అన్ని వైపులా దోర్లించాలి. మంటను మధ్యస్థంగా పెట్టి అన్నివైపులా బాగా కాలేలా చూడాలి. అయితే మాడకుండా జాగ్రత్త పడాలి. చివరగా చాట్ మసాలా చల్లితే మష్రూమ్ టిక్కా తినడానికి రెడీ.

## చికెన్ చీజ్‌తో...

**కావాల్సినవి :** చికెన్ బ్రెస్ట్-రెండు, మొజరెల్లా చీజ్-కప్పు, చీజ్ స్లైస్‌లు-రెండు, అల్లంవెల్లుల్లి ముద్ద, పచ్చిమిర్చి, కొత్తిమీర తురుము-రెండు చెంచాలచొప్పున, నూనె-తగినంత, నిమ్మరసం-పావు కప్పు, జాజికాయ పొడి- పావు చెంచా, జీలకర్ర-అర చెంచా, జాపత్రి-ఒకటి, యాలకులు- నాలుగు, శనగపిండి, పెరుగు-పావు కప్పు చొప్పున, సన్నగా కోసిన ఉల్లిపాయ-ఒకటి, ఉప్పు సరిపడా, గరంమసాలా-పావు చెంచా, నల్లుప్పు-చిటికెడు.



**తయారీ :** పలుచటి, వెడల్పాటిం పెద్ద చికెన్ ముక్కలను కత్తి మొనదేలిన భాగం వైపు నుంచి కాకుండా మరోవైపు నుంచి మెల్లిగా బీట్ చేయాలి. ఈ ముక్కలను ప్లేట్‌లోకి తీసుకోవాలి. వీటికి రెండు వైపులా నిమ్మరసం, ఉప్పు, అల్లం వెల్లుల్లి ముద్ద, నూనె వేసి రాసి పక్కన పెట్టుకోవాలి. పొయ్యి మీద పాన్ పెట్టి అది వేడయ్యాక జాజికాయ, జీలకర్ర, జాపత్రి, యాలకుల వేసి వేయించి రోట్లో వేసి కాస్త ఉప్పు కలిపి పొడి చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ప్లేట్‌లోకి తీసుకుని అందులో శనగపిండి, సన్నగా కోసిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు, కొత్తిమీర తురుము, కాస్తంత ఉప్పు, నల్లుప్పు, గరంమసాలా వేసి కలపాలి. కొద్దిగా నూనె పోసి మరోసారి బాగా కలపాలి. మారినేట్ చేసి పెట్టుకునన చికెన్ ముక్కలకు ఈ మసాలా మిశ్రమాన్ని పట్టించి నాలుగు గంటలు మరోసారి మారినేట్ చేసుకోవాలి. ఆ తర్వాత ఈ చికెన్ ముక్క మధ్యలో చీజ్ స్లైస్ పెట్టి గుండ్రంగా చుట్టి ప్లేట్‌లోకి తీసుకుని పైనుంచి ఆ తర్వాత ఈ చికెన్ ముక్క మధ్యలో చీజ్ స్లైస్ పెట్టి గుండ్రంగా చుట్టి ప్లేట్‌లోకి తీసుకుని పైనుంచి మొజరెల్లా చీజ్‌ని తురిమి వేసుకోవాలి. దీన్ని బేకింగ్ ట్రేలో పెట్టి 180 డిగ్రీల్లో దాదాపు అరగంట. బేక్ చేసుకోవాలి. అంతే రుచికరమైన చికెన్ చీజ్ టిక్కా రెడీ. అవెన్ లేనివారు మందపాటి పాన్‌ను తీసుకుని నీళ్లు పోసి దాని మీద ప్లేట్‌లో చికెన్ ముక్కలు పెట్టి మూత బిగించి వేయించుకోవాలి. ఇలా చేస్తే అరగంట తర్వాత బేస్ట్ చికెన్ టిక్కా రెడీ. □

# బోలెడు లాభాలు..



**పొయ్యిమీద అన్నం ఉడుకుతోంది.** మూత తీయడానికి సమయానికి హోల్డర్ కానీ, బట్ట కానీ లేదు. గాజు సీసా మూత బిగుసుకు పోయింది. ప్రయత్నిస్తుంటే చేతికి జారిపోతుంది. వెల్లుల్లిపై పొట్టు తియాలి. వీటన్నింటికి వేర్వేరు పరికరాలకోసం వెతక్కండి. సలికాన్ ట్రైవెట్స్ సెట్ ఒకటి ఇంట్లో ఉంటే చాలు. ఇవి వంటింట్లో ఎన్నో రకాలుగా ఉపయోగపడాయి. వీటిపై ఉండే డిజైన్ తేనెటీగలు పెట్టే హనీకాంబ్‌లా ఉంటుంది. దీంతో వేడిపాత్రల్ని పట్టుకోవచ్చు. ఇవి వేడికి కరగవు. మూతలు తీయడానికి అనుకూలంగా ఉంటాయి. వెల్లుల్లి పొట్టుని వీటితో నలిపి తీయడం తేలిక. వేర్వేరు రంగుల్లో దొరుకుతాయి కాబట్టి డైనింగ్ టేబుల్‌పైన టీకప్పులు పెట్టుకొనే కోస్టర్లుగా కూడా పనికొస్తాయి. □

# విధేయతే గొప్ప బహుమతి



'దహనబలికి కట్టెలు తీసికొని తన కుమారుడగు ఇస్సాకుమీద పెట్టి తన చేతితో నిప్పును కత్తిని పట్టుకొనిపోయెను..అబ్రాహాము అక్కడ బలిపీఠమును కట్టి కట్టెలు చక్కగా పేర్చి తన కుమారుడగు ఇస్సాకును బంధించి ఆ పీఠముపై నున్న కట్టెలమీద ఉంచెను' (ఆది 22:6-9). ఇక్కడ అబ్రహాముతో దేవుడు తన కుమారుడైన ఇస్సాకును బలిగా అర్పించమని చెప్పాడు. వెంటనే అబ్రాహాము కట్టెలను తన కుమారుడైన ఇస్సాకుపై పెట్టి, కొండపై దేవుడు తనకు చూపించిన స్థలంలో బలి అర్పించేందుకు సిద్ధపడ్డాడు. కత్తి ఎత్తి ఇస్సాకును వధించేముందు.. దేవుడు బలిగా అర్పించవద్దు అని చెప్పి ఇస్సాకుకు బదులుగా ఒక పొట్టేలును బలిగా ఇచ్చాడు. ఇక్కడ ఇస్సాకు విధేయతను మనం గమనించాలి. తండ్రి ఏది చెప్పాడో కొడుకు అదే చేశాడు. ఏ మాటకు ఎదురు చెప్పలేదు. చివరికి తననే బలిగా అర్పిస్తున్నా కూడా తండ్రి నిర్ణయాన్ని వ్యతిరేకించలేదు. తండ్రి చిత్తానుసారంగా దేవుడికి సమర్పించుకున్నాడు. ఇలాంటి విధేయత మనం కూడా కలిగి ఉండాలి. పిల్లలు తల్లిదండ్రులకు, పెద్దలకు లోబడి జీవించాలి. అన్నింటికంటే ముఖ్యంగా దేవుడికి మరింత విధేయతగా ఎలా జీవించాలో తల్లిదండ్రులు నేర్పించాలి. 'బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము వాడు పెద్దవాడైనప్పుడు దానినుండి తొలగిపోడు' (సామె 22:6). ఇస్సాకు నా అనుమతి లేకుండా నా ప్రాణాన్ని దేవుడికి ఎందుకు బలిగా ఇస్తున్నావు, నీకు ఆ హక్కు లేదు..వంటి మాటలు ఏమీ కూడా చెప్పలేదు. తండ్రికి విధేయత చూపేందుకు తన ప్రాణాలను కూడా బలిగా ఇచ్చేందుకు సిద్ధపడ్డాడు. నేడు చాలామంది పిల్లలు, యువత తల్లిదండ్రుల మాటలకు విలువ ఇవ్వడం లేదు. ఇక దేవుడికి చూపాల్సిన భయం విషయంలో శ్రద్ధ చూపడం లేదు. వారిని క్రమశిక్షణలో పెంచడం అనేది నేడు తల్లిదండ్రులకు ఒక సవాలుగా మారింది. ప్రత్యేకంగా గ్యాడ్జెట్లు (సెల్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్, ట్యాబ్) వారి చేతికి వచ్చిన ఈకాలంలో పిల్లలకు, పెద్దలకు దేవుడిపై భయం సన్నగిల్లుతోంది. అందుకే మనం దేవుడి వాక్యాన్ని చదవాలి, వినాలి, ఆవిధంగా జీవించేందుకు ప్రయత్నించాలి. దేవుడు మననుంచి కోరేది ఒక్క విధేయత తప్ప మరేమీ కోరడం లేదు. కాబట్టి దేవుడు ఏది చెబితే దాన్ని చేయాలి. ఆయన ఆజ్ఞల్ని మీరకూడదు. నిత్యం దేవుడియందు భయభక్తులతో జీవిస్తూ, మనకు ఏది కావాలినో దాన్ని అడిగితే దేవుడు తప్పనిసరిగా ఇస్తాడు. మనతోపాటు మన పిల్లలు కూడా సదాకాలం దేవాదిదేవుడిని సేవిస్తూ జీవిస్తే ఎంతో మేలు, ధన్యత. మనం దేవుడికి విధేయత చూపిస్తే అదే గొప్ప బహుమతి.


-పి.వాణిపుష్ప

అంతర్వాణి

## ఆరోగ్యానికి వేపపూత

★ ఎండిన వేపపూతను తడిలేకుండా చూసి తేనెలో వేసి ఎండలో కొన్నాళ్ళుంచి గట్టిపడిన తర్వాత ప్రతిరోజూ ఉదయాన ఒక చెంచా చొప్పున తింటే కఫదోషంపోయి జీర్ణశక్తిని కలిగించడమేకాక ఆకలిని పుట్టిస్తుంది.

★ వేపపూత బెల్లం కొంచెం ఉప్పు కారం వేసి కొద్దిగా నీరు కలిపి నూరండి. పచ్చడిగా ఆహారములో తింటే కడుపులో క్రిములో పోవడమేకాక జీర్ణశక్తిని కలిగించి ఆకలిని పుట్టిస్తుంది. □



## స్లో ఓవర్ రేట్‌తో కమిన్స్, పాటిదార్‌లకు జరిమానా

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబి) కెప్టెన్ రజత్ పాటిదార్ మరియు సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్‌లకు వారి జట్ల స్లో ఓవర్ రేట్ కారణంగా జరిమానా విధించబడింది. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి ప్రకారం కమిన్స్ జట్టు ఈ సీజన్‌లో చేసిన మొదటి నేరం కావడంతో అతనికి రూ.12 లక్షల జరిమానా విధించగా, రెండోసారి కూడా నేరం చేసిన ఆర్‌సిబి జట్టు ప్లేయింగ్ ఎలెవన్‌లో సభ్యుడిగా పాటిదార్‌కు రూ.24 లక్షల జరిమానా విధించారు. ఇంపాక్ట్ ప్లేయర్‌తో సహా ప్లేయింగ్ 11 లోని మిగిలిన సభ్యులకు ఒక్కొక్కరికి వ్యక్తిగతంగా రూ.6 లక్షలు లేదా వారి మ్యాచ్ ఫీజులో 25 శాతం, ఏది తక్కువైతే అది జరిమానా విధించినట్లు ఐపీఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. కనీస ఓవర్‌రేట్ నేరాలకు సంబంధించిన ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం, ఈ సీజన్‌లో అతని జట్టు చేసిన మొదటి నేరం ఇది కాబట్టి, కమిన్స్‌కు రూ.12 లక్షల జరిమానా విధించబడింది" అని పేర్కొంది.

## నాపోలికి ఫుట్‌బాల్ టైటిల్

### 2-0 తేడాతో కాగ్లియా ఓటమి



**న్యూఢిల్లీ:** నాపోలి 2024-25 సిరీస్ ఎ ఫుట్‌బాల్ టైటిల్‌ను గెలుచుకుంది. చివరి మ్యాచ్‌లో ఇంటర్ మిలన్‌ను ఒక పాయింట్ తేడాతో ఓడించడం ద్వారా ఈ విజయాన్ని అందుకుంది. ఛాంపియన్స్ లీగ్ ఆశావాదులైన ఇంటర్ కోమోలో సాధించిన విజయం వృథా కావడంతో, నాపోలి 2-0 తేడాతో కాగ్లియారీని ఓడించి సీరీ ఎ టైటిల్‌ను కైవసం చేసుకుంది. శనివారం జరిగిన సిరీస్ టైటిల్ రేస్ ముగింపు మ్యాచ్‌లో నాపోలి చివరి రౌండ్ ఆటలకు చేరుకునే ముందు ఇంటర్ మిలన్ కంటే ఒక పాయింట్ ఆధిక్యంలో ఉంది. విరామానికి మూడు నిముషాల ముందు మెక్‌టోమినే మాటియో పొలిటాన్ క్రాస్ నుండి అద్భుతమైన సైకిల్ కిక్‌తో స్కోరింగ్‌ను ప్రారంభించాడు. పునహ ప్రారంభమైన ఆరు నిముషాల తర్వాత లుకాకు లాంగ్ ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. గత సీజన్‌లో పేలవమైన టైటిల్ డిఫెన్స్‌లో పార్టెనోపీ 10వ స్థానంలో నిలిచిన తర్వాత దక్షిణ జట్టు మొత్తం ఈమధ నాల్గవ సిరీస్ ఎ టైటిల్‌ను ఆకట్టుకునే మలుపు తిప్పింది. ఆ సీజన్‌లో ఇంటర్ చేతిలో ఓడిపోయిన నేపుల్స్ కల్బ్ టైటిల్‌ను తిరిగి పొందేందుకు నాపోలి ఈసారి తీవ్ర యత్నం చేసింది. ఇంటర్ తరపున డిఫెండర్ స్టెఫాన్ డిబ్రిజ్ 20 నిముషాల్లో గోల్ చేశాడు. బౌన్స్ హెడర్‌తో కార్నర్ కిక్‌ను దారి మళ్లించాడు.



## భారత్ కెప్టెన్‌గా గిల్

### టెస్టు క్రికెట్‌లో నవ శకం స్టార్ట్.. ఇండియా జట్టు ఖరారు

**న్యూఢిల్లీ:** భారత టెస్టు క్రికెట్‌లో నవ శకం ప్రారంభమైంది. యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ టీమ్ ఇండియా కొత్త కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. తొలి నుంచి ప్రచారం జరిగినట్లుగానే గిల్ వైపే సెలక్టర్లు మొగ్గు చూపారు. జూన్‌లో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనున్న భారత జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. ఇందులో గిల్‌కు డిప్యూటీగా రిషభ్ పంత్‌ను నియమించింది. మొత్తం 18 మంది ఆటగాళ్లతో జట్టును ప్రకటించింది. ఇక 33ఏళ్ల కరుణ్ నాయర్‌కు ఎట్టకేలకు టీమ్ ఇండియా పిలుపు అందింది. గత కొంతకాలంగా దేశవాళీలో అదరగొడుతున్న కరుణ్‌ను సెలక్టర్లు ఇంగ్లాండ్ సిరీస్‌కు ఎంపిక చేశారు. 2016లో టెస్టుల్లో ఎంట్రీ ఇచ్చిన కరుణ్ 6 మ్యాచ్‌లే ఆడాడు. ఇందులో ఓ ట్రిపుల్ సెంచరీ ఉంది. అయితే ఆ తర్వాత ఏడాదే 2017లో కరుణ్ జట్టులో చోటు కోల్పోయాడు. అప్పటి నుంచి టీమ్ ఇండియాలో రీఎంట్రీ కోసం ప్రయత్నిస్తే, ఇన్నేళ్లకు అవకాశం దక్కింది. అలాగే తొలి సారిగా నలుగురికి భారత్ జట్టులో చోటు దక్కింది. సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, అర్షదీప్ సింగ్‌లకు లక్కీ ఛాన్స్ దక్కింది. ఇంగ్లాండ్ సిరీస్ లో వీళ్లు బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. కాగా, సాయి సుదర్శన్, అర్షదీప్ ఇప్పటికే టీ20, వన్డేల్లో ఆడినప్పటికీ టెస్టుల్లో అవకాశం ఇదే ఫస్ట్ టైమ్. మరోవైపు, అభిమన్యు టీమ్ ఇండియాకు ఎంపికవ్వడం ఇదే తొలిసారి. మరోవైపు, సీనియర్ బ్యాటర్లు అజింక్యా రహానే, ఛతేశ్వర్ పుజారాకు మరోసారి నిరాశే మిగిలింది. రోహిత్, విరాట్ రిటైర్మెంట్ నేపథ్యంలో ఈ ఇద్దరికీ అవకాశం వస్తుందని భావించినా సెలక్టర్లు మొండి చేయి చూపారు. రహానే, పుజారా టీమ్‌ఇండియా తరఫున 2023లో ఆఖరి టెస్టు మ్యాచ్ ఆడారు. కాగా టీమ్‌ఇండియాలో శుభ్‌మన్ గిల్ (కెప్టెన్). రిషభ్ పంత్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్షదీప్ సింగ్, కుల్‌దీప్ యాదవ్ ఉన్నారు.

## ఐపిఎల్‌లో మెయిడిన్‌గా 20వ ఓవర్

### లాస్ట్ ఓవర్‌లో ఒక్క రన్ ఇవ్వని బౌలర్లు

**న్యూఢిల్లీ:** ఐపీఎల్‌లో బరిలోకి దిగిన బ్యాటర్ ప్రతి బంతిని బౌండరీ లైన్ దాటించాలనే ప్రయత్నిస్తాడు. అలాగే ఆట మొదలైనప్పటి నుంచి ముగిసేదాకా బ్యాటర్‌ను కట్టడి చేయడానికి బౌలర్‌పై ఒత్తిడి తీవ్రంగానే ఉంటుంది. డెత్ ఓవర్లలో అయితే చెప్పనవసరం లేదు. మరీ ముఖ్యంగా చివరి ఓవర్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తారు. ఏ బౌలర్‌కైనా చివరి ఓవర్ (20వ ఓవర్) బౌలింగ్ చేయడం అంత సులువేం కాదు. అలా ఐపీఎల్‌లో 20వ ఓవర్లో 30+ పరుగులు వచ్చిన సందర్భాలు అనేకం. అయితే అలాంటి కఠినమైన పరిస్థితుల్లో చివరి ఓవర్‌ను మెయిడిన్‌గా మలిచిన సందర్భాలు కూడా ఉన్నాయి. మెయిడిన్ ఓవర్ అంటే ఒకే ఓవర్‌లో బౌలర్ ఒక్క పరుగు కూడా ఇవ్వకపోయినట్లయితే ఆ ఓవర్‌ను మెఇయడిన్ ఓవర్ అంటారు. అవును! 18 సీజన్ల ఐపీఎల్ చరిత్రలో ఒక్కసారి, రెండుసార్లు కాదు. ఏకంగా నాలుగుసార్లు 20వ ఓవర్ మెయిడెన్ అయ్యింది. మరి ఈ అరుదైన ఘనత సాధించిన బౌలర్లలో నలుగురు ఉన్నారు. క్రికెట్ లో చివరి ఓవర్‌ను మెయిడిన్‌గా వేసిన బౌలర్లలో ఇర్ఫాన్ పఠాన్, ఉమ్రాన్ మాలిక్, జయదేవ్ ఉనద్కట్, లాసిత్ మాలింగ ఉన్నారు. ఐపీఎల్ చరిత్రలో 20వ ఓవర్ మెయిడెన్‌గా మలిచిన తొలి బౌలర్ ఇర్ఫాన్ పఠాన్. 2008లో పంజాబ్‌కు ప్రాతినిధ్యం వహించిన ఇర్ఫాన్, ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు. అతను హైదరాబాద్ తో జరిగిన మ్యాచ్ లో 20వ ఓవర్ మెయిడిన్ వేసి 3 వికెట్లు కూడా తీసుకున్నాడు. ఇర్ఫాన్ ఐపీఎల్ కెరీర్‌లో 103 మ్యాచ్‌ల్లో 80 వికెట్లు పడగొట్టాడు. ఇక ముంబయి ఇండియన్స్ బౌలర్ లసిత్ మలింగ ఐపీఎల్‌లో అత్యుత్తమ బౌలర్లలో ఒకరిగా నిలిచాడు. 2009లో దక్కన్ ఛార్జర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో మలింగ 20వ ఓవర్ మెయిడెన్ చేశాడు. ఈ ఓవర్‌లో పరుగులేమీ ఇవ్వకపోవడమే కాకుండా 2 వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. మలింగ 122 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 170 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. ఇక ఈ అరుదైన ఘనత సాధించిన లిస్ట్‌లో టీమ్‌ఇండియా పేసర్ జయదేవ్ ఉనాద్కత్ కూడా ఉన్నాడు. 2017 ఐపీఎల్‌లో రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్ టీమ్‌లో ఉన్నాడు. హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో చివరి ఓవర్‌లో మెయిడెన్‌తో సహా 3 వికెట్లు పడగొట్టాడు. ఒక మెయిడెన్‌తో హ్యాట్రిక్ వికెట్లు తీసిన బౌలర్‌గా కూడా రికార్డు సృష్టించాడు. 2022 ఐపీఎల్‌లో ఉమ్రాన్ మాలిక్ సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడాడు. పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో మూడు వికెట్లు పడగొట్టి ఒక్క పరుగు కూడా ఇవ్వలేదు.













## విండీస్ మ్యాచ్ రద్దు

### వర్షంతో సాధ్యంకాని ఐర్లాండ్ ఇన్నింగ్స్

### ఫలితం లేకుండా ముగిసిన రెండో వన్డే

**న్యూఢిల్లీ:** విజయంపై ఆశలు పెంచుకున్న వెస్టిండీస్‌ను వరుణుడు కరుణించ లేదు. దీంతో ఐర్లాండ్, వెస్టిండీస్ జట్ల మధ్య జరిగిన రెండో వన్డే ఫలితం తేలకుండానే ముగిసింది. వెస్టిండీస్ ఇన్నింగ్స్ ముగిశాక భారీ వర్షం రావడంతో ఐర్లాండ్ ఛేజింగ్ సాధ్యపడ లేదు. వెరసి మూడు వన్డేల సిరీస్‌లో ఐర్లాండ్ ప్రస్తుతం 1-0 ఆధిక్యంతో ఉంది. ఇక ఐర్లాండ్ చేతిలో తొలి వన్డేలో ఎదురైన ఓటమి నుండి తేరుకున్న విండీస్ రెండో వన్డేలో అదరగొట్టి భారీ స్కోరు చేసింది. డబ్లిన్‌లో టాస్ గెలిచిన ఐర్లాండ్ కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ ఫీల్డింగ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ దిగిన వెస్టిండీస్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 352 పరుగులు చేసింది. వన్‌డౌన్ బ్యాటర్ కేసీ కార్టీ (109 బంతుల్లో 102, 13 ఫోర్లు, 1 సిక్స్) కెరీర్‌లో రెండో సెంచరీ నమోదు చేయగా, చివర్ల మాథ్యూ ఫోర్డ్ (19 బంతుల్లో 58 పరుగులు, 2 ఫోర్లు, 8 సిక్స్‌లతో శివమెత్తాడు. కేవలం 16 బంతుల్లోనే ఫోర్డ్ అర్థ సెంచరీ సాధించాడు. ఈ క్రమంలో వన్డేల్లో హాఫ్ సెంచరీ చేసిన ప్లేయర్‌గా ఏబీ డివిలియర్స్ (16 బంతుల్లో) పేరిట ఉన్న రికార్డును ఫోర్డ్ సమం చేశాడు. కెప్టెన్ షై హోప్ (57 బంతుల్లో 49 పరుగులు, 5 ఫోర్లు, 1 సిక్స్) పరుగు తేడాతో అర్థ సెంచరీని చేజార్చుకోగా, జస్టిన్ గ్రీవెస్ (36 బంతుల్లో 44 పరుగులతో నాటౌట్, 4 ఫోర్లు, 1 సిక్స దూకుడుగా ఆడాడు. ఐర్లాండ్ బైలర్లలో బ్యారీ మ ఎకార్తీ, జోష్ లిటిల్ 2 వికెట్లు చొప్పున తీయగా, లియామ్ మెకార్తీకి 3 వికెట్లు దక్కాయి. ఇక ఈ రెండు జట్ల మధ్య చివరిదైన మూడో వన్డే ఈనెల 25న జరగనుంది.

## ఆర్‌బిఐ డివిడెండ్ రూ.2.70 లక్షల కోట్లు

**ముంబై, మే 24:** ఈ సారి ప్రభుత్వానికి కొత్త రికార్డు డివిడెండ్ చెల్లించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. నివేదిక ప్రకారం, ఆర్‌బిఐ 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వానికి రూ.2.69 లక్షల కోట్ల డివిడెండ్‌ను బదిలీ చేస్తుంది. అంతకుముందు సంవత్సరం (2023-24)లో ఇది రూ.2.1 లక్షల కోట్ల డివిడెండ్ చెల్లించింది. అయితే, ఈసారి డివిడెండ్ 27 శాతం పెరిగింది. ఇది ప్రభుత్వానికి ఆర్బీఐ చెల్లించే గరిష్ట డివిడెండ్ మొత్తం. 2022-23లో ప్రభుత్వానికి ఆర్‌బిఐ చెల్లించిన డివిడెండ్ కేవలం రూ.87,416 కోట్లు మాత్రమే. ప్రపంచ అనిశ్చితి, పాకిస్తాన్‌తో సరిహద్దు వివాదం వంటి సంఘటనలు భారత దేశ ఆర్థిక పురోగతికి కొంతవరకు ఆటంకం కలిగించాయి. ఈ సమయంలో ఆర్థిక వృద్ధిని పెంచడానికి ప్రభుత్వం ఈ సంవత్సరం చాలా ఖర్చు చేయడం అత్యవసరం. ఈ కారణంగా ఆర్‌బిఐనుండి వచ్చే రూ.2.70 లక్షల కోట్లు ప్రభుత్వానికి సహాయపడతాయి. మే 15న కొత్త ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్ష తన జరిగిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో రూ.2,68,590.07 కోట్ల డివిడెండ్ ప్రకటించాలని నిర్ణయం తీసుకున్నారు. డివిడెండ్ మొత్తాన్ని ఎకనామిక్ కేపిటల్ ఫ్రేమ్‌వర్క్ అనే ఫార్ములా ఆధారంగా నిర్ణయిస్తారు. ఈ ఫ్రేమ్‌వర్క్ ప్రకారం, 7.50 నుండి 4.50 వరకు ఆదాయం శాతాన్ని కంటింజెంట్ రిస్క్ బఫర్‌గా పరిగణిస్తారు. ఈరిస్క్ బఫర్‌మొత్తాన్ని నిలుపుకుని, మిగిలిన మొత్తాన్ని డివిడెండ్ల రూపంలో ప్రభుత్వానికి ఇస్తారు. ఆర్‌బిఐ ప్రతి సంవత్సరం ప్రభుత్వానికి డివిడెండ్‌లను చెల్లిస్తుంది. బాండ్ల నుండి వచ్చేవడ్డీ, ఫారెక్స్ నిల్వలలో ఉన్న ఆస్తుల పెరుగుదల నుండి వచ్చే లాభాలు మొదలైనవి ఆర్‌బిఐకి ప్రధాన ఆదాయ వనరులు. ఆర్‌బిఐ వాణిజ్య బ్యాంకులకు నిర్దిష్ట వడ్డీ రేటుకు డబ్బు ఇస్తుంది. ఇది ఆర్‌బిఐకి ప్రధాన ఆదాయవనరు. ఆర్‌బిఐ ప్రభుత్వ బాండ్లను కొనుగోలు చేస్తుంది. ఇవి ప్రభుత్వం నుండి వడ్డీ చెల్లింపులను పొందుతాయి. ఆర్‌బిఐ తన విదేశీ మారక నిల్వలలో గణనీయమైన భాగాన్ని యుఎస్ ట్రెజరీ బాండ్ల వంటి ఆస్తులలో పెట్టుబడి పెడుతుంది.




## టారిఫ్ విధించినా.. భారత్‌లో తక్కువ రేటుకే ఆపిల్ ఫోన్లు

**వాషింగ్టన్, మే 24:** అమెరికాలో ఐఫోన్లు తయారుచేయని పక్షంలో, ఆపిల్ ఉత్పత్తులపై 25 శాతం సుంకం విధిస్తానని డొనాల్డ్ ట్రంప్ మరో సారి ఆపిల్‌ను హెచ్చరించిన విషయం తెలిసిందే. అయితే భారత్‌లో తయారుచేసే ఐఫోన్లపై అగ్రరాజ్యం సుంకం విధించినప్పటికీ దేశంలో ఐఫోన్ల తయారీ అమెరికాలో కంటే తక్కువే అవుతుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్షియేటివ్ తన నివేదికలో వెల్లడించింది. భారత్‌లో తక్కువ ఉత్పత్తి ఖర్చులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు వంటివి దీనికి దోహదం చేస్తాయని పేర్కొంది. జీటీఆర్ఐ నివేదిక ప్రకారం.. భారత్‌లో ఒక ఐఫోన్ అసెంబ్లింగ్ ఖర్చు సుమారు 30 డాలర్లు కాగా, అమెరికాలో 390 డాలర్లు వెచ్చించాల్సి ఉంటుంది. దీని కారణంగా భారత్‌లో కార్మికుల జీతాలు తక్కువగా ఉండటమే. దేశంలో ఒక కార్మికుడికి నెల సంపాదన సగటున 230 డాలర్లు (రూ.19,000). అదే అమెరికాలో కనీస వేతన చట్టాల కారణంగా ఈ సంపాదన 2,900 డాలర్ల (రూ.2.4 లక్షలు) వరకు ఉంటుంది. అంటే దాదాపు 13 రెట్ల వ్యత్యాసం. దీనికితోడు భారత ప్రభుత్వం అందించే పీఎల్ఐ పథకం కూడా యాపిల్‌కు అదనపు లాభాల్ని అందిస్తోంది. దీంతో భారత్‌లో తయారుచేసే ఐఫోన్లపై 25 శాతం సుంకం విధించినా అమెరికా మార్కెట్‌లో చౌకగా లభిస్తాయని నివేదిక తెలుపుతోంది. ఐఫోన్లను 12కు పైగా దేశాలు కలిపి తయారుచేస్తాయి. యాపిల్ తన బ్రాండ్, సాఫ్ట్‌వేర్, డిజైన్‌లతో ఒక్కో ఐఫోన్‌పై 450 డాలర్ల లాభం ఆర్జిస్తుంది. ఇక అమెరికాలో ఐఫోన్లను తయారు చేస్తే.. ఉత్పత్తి ఖర్చులు పెరుగుతాయి. దీనికి అనుగుణంగా రిటైల్ ధరలు పెంచకపోతే ఆపిల్ లాభం 450 డాలర్ల నుంచి 60 డాలర్లకు పడిపోవచ్చని పేర్కొంది. భారత్‌లో ఐఫోన్ల తయారీకి అమెరికా విధించే సుంకాల ముప్పు ఉన్నప్పటికీ ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుందని జీటీఆర్ఐ నివేదిక స్పష్టం చేసింది.



## ఐటిఆర్ దాఖలుకు ముందు చేయాల్సిన పనులివే..

**న్యూఢిల్లీ, మే 24:** ప్రతి సంవత్సరం ఆదాయపు పన్ను రిటర్న్ (ఐటీఆర్) దాఖలు చేసే సమయం వచ్చినప్పుడు చాలా మంది పన్ను చెల్లింపుదారులు తొందరపడి తమ రిటర్న్‌లను దాఖలు చేస్తారు. కానీ మీరు ఆదాయపు పన్ను శాఖ నుండి నోటీసు అందుకోకూడదనుకుంటే లేదా మీ పన్ను వాపసు నిలిచిపోయినట్లయితే, ఐటిఆర్ దాఖలు చేసే ముందు, ఖచ్చితంగా ఫారమ్ 26ఎఎస్ వార్షిక సమాచార ప్రకటన (ఎఐఎస్) తనిఖీ చేయండి. ఫారం 26ఎఎస్ అనేది మీ పాన్ నంబర్ నుండి ఎంత పన్ను తగ్గించబడిందో, ఎంత పన్ను జమ అవుతుందో చూపించే పన్ను క్రెడిట్ స్టేట్‌మెంట్. ఇందులో జీతం, బ్యాంకు వడ్డీ, ఆస్తి కొనుగోలు, మ్యూచువల్ ఫండ్ పెట్టుబడి వంటి సమాచారం ఉంటుంది. ఇందులో ఏదైనా టిడిఎస్ ఎంట్రీ తప్పిపోతే, మీరు పన్ను క్రెడిట్ పొందడంలో సమస్యను ఎదుర్కోవలసి ఉంటుంది. అందువల్ల రిటర్న్ దాఖలు చేసే ముందు అన్ని ఎంట్రీలు సరిగ్గా నమోదు అయ్యాయో నిర్ధారించుకోవడం ముఖ్యం. ఎఐఎస్ అనేది ఫారం 26ఎఎస్ కంటే ఎక్కువ సమాచారాన్ని అందించే వివరణాత్మక పత్రం. ఇది బ్యాంకు నుండి పొందిన వడ్డీ, డివిడెండ్, షేర్లు, మ్యూచువల్ ఫండ్ల కొనుగోలు, అమ్మకం, అద్దె, విదేశీ లావాదేవీలు, క్రెడిట్ కార్డ్ ఖర్చుల గురించి సమాచారాన్ని కలిగి ఉంటుంది. ఎఐఎస్ అనేది మీ మొత్తం ఆర్థిక ప్రొఫైల్ బ్లూప్రింట్, ఇది పన్ను శాఖ వద్ద అందుబాటులో ఉంటుంది. మీరు మీ ఐటీఆర్‌లో ఎటువంటి సమాచారాన్ని పూరించక పోయినా, అది ఎఐఎస్‌లో నమోదు చేయబడితే, మీకు తర్వాత ఆదాయపు పన్ను శాఖ నుండి నోటీసు రావచ్చు. అందువల్ల ఎఐఎస్‌ని తనిఖీ చేయడం చాలా ముఖ్యం. అలాగే ఏదైనా వ్యత్యాసం గమనించినట్లయితే, పోర్టల్‌లో అభిప్రాయాన్ని అందించండి. 2025-26 అసెస్‌మెంట్ సంవత్సరానికి ఐటీఆర్ దాఖలు చేయడనికి చివరి తేదీ జూలై 31, 2025 (ఆడిట్ కాని సందర్భాలలో). ఫారమ్‌లు ఇంకా పూర్తిగా అప్‌డేట్ చేసినప్పటికీ.. మీరు ఫారమ్ 26ఎఎస్, ఎఐఎస్‌ని తనిఖీ చేయడం ద్వారా మీ ఐటీఆర్ ని ఇప్పుడే ప్రారంభించవచ్చు. ఫారమ్ 26ఎఎస్, ఎఐఎస్‌ని తనిఖీ చేయడం ఒక చిన్న దశ కానీ చాలా ముఖ్యమైన దశ. ఇది మీ రిటర్న్‌ను సరిగ్గా ఉంచడమే కాకుండా, పన్ను వాపసులో జాప్యం, నోటీసు వంటి సమస్యలను కూడా నివారించవచ్చు.




## మళ్లీ ఐపిఒకు రెడీ అవుతున్న కంపెనీలు

**ముంబై, మే 24:** ఈ యేడాది ప్రారంభం నుంచి భారత స్టాక్ మార్కెట్లు ఒడుదుడుకుల మధ్య స్థిరమైన ర్యాలీని చూస్తున్నాయి. ఈ కారణంగా దలాల్ స్ట్రీట్‌లో పబ్లిక్ ఆఫర్‌లు కూడా పెద్దగా రాలేదు. చాలా కంపెనీఉ మార్కెట్ పరిస్థితులను బట్టి ఐపిఒ ప్రక్రియలో ముందుకెళ్లా లని భావిస్తున్నాయి. అయితే తాజాగా పరిస్థితులు సాను కూలంగా మారుతున్నాయి. ఈ నెల్లో అమెరికా టారిఫ్ విషయంలో పరిస్థితులు మారడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, ఇతర పరిణామాల నేపథ్యంలో సూచీలు రాణిస్తున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో కంపెనీ ఐపిఒలు రెడీ అవుతున్నాయి. ఈ నెల మూడో వారంలో ఇప్పటికే బెల్రైజ్‌ఇండస్ట్రీస్, బొరానా వీవ్స్‌బిడ్డింగ్ ప్రక్రియను ప్రారంభించాయి. చివరి వారంలో మరో నాలుగు ఐపిఒలు మార్కెట్లలో అడుగు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటిలో సోడా ట్యూబ్స్, ప్రోస్టార్మ్ ఇన్ఫో సిస్టమ్స్, లీలా హోటల్స్, ఏజిస్ వొపాక్ టెర్మినల్స్ వంటి కంపెనీలున్నాయి. ఈ యేడాదిలో ఇప్పటి వరకు ఐపిఒ మార్కెట్ ఏమంత ఉత్సాహంగా లేదు. అయితే ఐపిఒకు ముందు ప్రక్రియ విషయంలో మాత్రమే పెద్ద ఎత్తున సెబీకి దరఖాస్తులు, డిఆర్‌హెచ్‌పి పత్రాలు అందాయి. దీన్ని బట్టి కంపెనీలు పబ్లిక్ లిస్టింగ్‌లపై ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నాయని తెలుస్తుంది. ఇప్పటికే సెబి వద్ద పత్రాలు సమర్పించిన కంపెనీల్లో ప్రెస్టెజ్ హాస్పిటాలిటీ వెంచర్స్, కెనరా హెచ్‌ఎస్‌బిసి లైఫ్ ఇన్సూరెన్స్, అర్బన్ కంపెనీ ఉన్నాయి. ఇన్‌క్రెడ్, క్యూర్ ఎఐ, ద్యూరో ఫ్లెక్స్, గ్రో, షిప్ రాకెట్ వంటి కొత్త జనరేషన్ కంపెనీలు కూడా మార్కెట్లోకి వచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. మరోవైపు 2025లోనే ఐపిఒ ప్రక్రియను ప్రారంభించాలని కొన్ని బడా కంపెనీలు కూడా చూస్తున్నాయి. వాటిలో రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ రూ.40వేల కోట్ల పబ్లిక్ ఇష్యూతో వచ్చే అవకాశం ఉంది. ఇదే జరిగితే భారత చరిత్రలోనేఅతిపెద్ద ఐపిఒ కానుంది. టాటాకేపిటల్, ఫోన్‌పే, జెప్టో వంటి పెద్ద కంపెనీల షేర్లు కూడా ఐపిఒ విషయంలో వినిపిస్తున్నాయి. ఫైనాన్స్ రంగంలో హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ.12,500 కోట్లు, హీరో ఫిన్‌కార్ప్ రూ.3,668 కోట్ల నిధులు సమీకరించాలని భావిస్తున్నాయి. సెబి నుంచి ఆమోదం పొందిన ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఇండియా కూడా రూ.15వేల కోట్ల విలువైన ఐపిఒకు సిద్ధమవుతోంది.




## వాణిజ్యం

## రికార్డుస్థాయిలో పాలసీల విక్రయం

**న్యూఢిల్లీ, మే 24:** ప్రభుత్వరంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి) అరుదైన ఘనతను సాధించింది. 24 గంటల్లో రికార్డు స్థాయిలో బీమా పాలసీలు విక్రయించి గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది. ఈ ఏడాది జనవరి 20న ఈ అరుదైన ఘనతను సాధించినట్లు ఎల్ఐసీ ఓ ప్రకటనలో తెలిపింది. విస్తృతమైన ఏజెన్సీ నెట్‌వర్క్ కలిగిన ఎల్ఐసీ పనితీరును గుర్తించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ఈ అరుదైన రికార్డును నమోదు చేసిందని ఎల్ఐసీ పేర్కొంది. దేశ వ్యాప్తంగా 4,52,839 మంది ఏజెంట్లు ఈ ఏడాది జనవరి 20న 5,88,107 లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలను జారీ చేసినట్లు ఎల్ఐసీ తెలిపింది. బీమా చరిత్రలో 24 గంటల వ్యవధిలో ఈ స్థాయిలో పాలసీలు జారీ చేయడం ఇదే తొలిసారి. తమ ఏజెంట్లు తమదైన పనితీరుతో ఒక బెంచ్‌మార్క్‌ను సృష్టించారని ఎల్ఐసీ పేర్కొంది. ఇది తమ ఏజెట్ల అవిశ్రాంత కృషి, అంకితభావం నిదర్శనమని కొనియాడింది. ఎల్ఐసీ కస్టమర్లు, వారి కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పించాలనే లక్ష్యానికి నిబద్ధతగా నిలుస్తోందని తెలిపింది. ఎల్ఐసీ వ్యవస్థాపక దినోత్సవంఅయిన జనవరి 20న 'మ్యాడ్ మిలియన్ డే'ను పురస్కరించకుని ఒక్కో ఏజెంట్ కనీసం ఒక్క పాలసీ అయినా పూర్తి చేయాలన్న ఎల్ఐసీఎండీ, సీఈఓ సిద్దార్థ మొహంతీ విజ్ఞప్తి మేరకు ఈ అరుదైన ఫీట్‌ను ఎల్ఐసీసొంతం చేసుకుంది. ఈ అరుదైన మైలు రాయిని సాధించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తంచేశారు. కస్టమర్లు, ఉద్యోగులు, ఏజెంట్లు కలిసి ఒక చరిత్రను లిఖించారంటూ సంతోషం వ్యక్తం చేశారు.



## రెండు బ్యాంకులపై ఆర్‌బిఐ జరిమానా

**న్యూఢిల్లీ, మే 24:** బ్యాంకింగ్, ఫిన్‌టెక్ రంగాల్లో ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించడంలో విఫలమైనందుకు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ట్రాన్సాక్ట్రీ టెక్నాలజీస్ (లెండ్‌బాక్స్)పై రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా జరిమానా విధించింది. నిబంధనల ప్రకారం నడుచుకోని సంస్థలపై కఠిన చర్యలుంటాయని ఆర్‌బిఐ పేర్కొంది. బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్, 1949 నిబంధనలు, పూచీకత్తు లేని వ్యవసాయ రుణాలపై ఆర్‌బిఐ మార్గదర్శకాలను ఉల్లంఘించినందుకు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.63.6 లక్షల జరిమానా విధించింది. నిధుల బదిలీలో జాప్యం, పూచీకత్తు లేని రుణ విధానాల్లో ఉల్లంఘనలు వెలుగులోకి రావడంతో ఈ జరిమానా విధించినట్లు ఆర్‌బిఐ తెలిపింది. ముఖ్యంగా వ్యవసాయం వంటి ప్రత్యేక రక్షణ అవసరమయ్యే రంగాల్లో ఆర్థిక సంస్థలు నిర్దే శిత రుణ నిబంధనలకు ఉండేలా చూడా లని ఆర్‌బిఐ తెలిపింది. ఆర్‌బిఐ పీర్-టుపీర్ లెండింగ్ ప్లాట్‌ఫామ్ డైరెక్షన్స్-2017ను పాటించనందుకు లెండ్‌బాక్స్ బ్రాండ్ పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ట్రాన్సాక్ట్రీ టెక్నాలజీస్ పై రూ.40 లక్షలు జరిమానా విధించింది. దేశ డిజిటల్ లెండింగ్ ఎకోసిస్టమ్‌లో గణనీయమైన వృద్ధిని చూపిన పి2పి లెండిర్ కార్యకలాపాలకు సంబంధించిన లోపాలను సెంట్రల్ బ్యాంకు గుర్తించింది. ఫిన్‌టెక్ కంపెనీలు పారదర్శకత పాటించాలని, వినియోగదారులు, రుణ దాతలను రక్షించడానికి రూపొందించిన మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాలని గుర్తుచేసింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.